# వైకుంఠపాళి

(ఆధ్యాత్మిక వ్యాస సంపుటి)




రచయిత
మహాసహస్రావధాని
**డా॥ గరికిపాటి నరసింహారావు**

# వైకుంఠపాళి

(ఆధ్యాత్మిక వ్యాస సంపుటి)

రచయిత
మహాసహస్రావధాని

**డా॥ గరికిపాటి నరసింహారావు**

# VYKUNTHA PALI

(SPIRITUAL ESSAYS)

by

**Dr. GARIKIPATI NARASIMHA RAO**

I Edition : July 2015

II Edition : January 2017

Copies : 2000

**Rs.100/-**

***For Copies :***

KIRAN, Cell : 9550829703 / 8341577766

VISALANDHRA (All Branches)

NAVODAYA, Kachiguda, Hyderabad. Ph : 040-24652387

***Printed at :***

**Sai Enterprises**
Kamala Nagar,
ECIL, Hyd.
Cell : 9948880852



కావలెనన్న వచ్చునె? ఎకాయెకి నాకవనమ్ము జేరె నౌ;
రావలెనన్న వచ్చునె? సరాసరి నందన పారిజాతమై
తావుల నీనదే! అయిన దల్లడిలంబనిలేదు; తల్లికిన్
సేవలు సేయు పుత్రకుల జీవితముల్ నవ పారిజాతముల్

## ఆటకు ముందుమాట

జీవితం ఒక ఆట అయితే సరదాగా ఆడుకోవాలి. ఒక సవాలయితే ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒక అనుభూతి అయితే ఆస్వాదించాలి. ఒక తపస్సు అయితే అందులో మునిగిపోవాలి.

జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. దాన్నిబట్టి మనం మారాలి. కానీ మనల్ని బట్టి అది మారదు. అలా ఎప్పటికప్పుడు ఆలోచించడానికి అవసరమైన ధైర్యాన్ని ఈ వ్యాసాలు అందిస్తాయని నా నమ్మకం - ఎందుకంటే, నాకు అందించాయి కాబట్టి.

ఇందులో వ్యాసాలు వివిధ పత్రికల్లో అచ్చయినవి కొన్ని ఉన్నాయి. వారికి సుహృదభినందనలు. అందంగా పొందికగా అచ్చువేసిన సాయి ఎంటర్‌ప్రైజెస్ వారికి కృతజ్ఞతలు.

భాగ్యనగరం, **గరికిపాటి నరసింహారావు**
తేది 02-07-2015

# వ్యాస సూచిక

# 1. వైకుంఠపాళి

తెలుగు ఆటయె చూపించు వెలుగుబాట
తెలుగు మాటయె చెవినించు తేటిపాట
తెలుగు పాటయె రుచిమించు తేనె ఊట
తెలుగు పద్యమ్మె గెలిపించు తెలుగు బాల

కొన్ని వేల పద్యాలు, పాటలు, మాటలు అందించగలిగే ధైర్యం ఒక్క తెలుగు ఆట అందిస్తుంది. అదే వైకుంఠపాళి. తెలుగు తోటలో పండిన విక్రమకేళి. దీన్నే ఆధ్యాత్మిక పరిభాషలో **"పరమపద సోపాన పటము"** అంటారు. కొన్ని ప్రాంతాల్లో **"పాము పటం"** అంటారు.

గాలి పటాలతో ఆడటం తప్ప పాము పటాలతో ఆడే ధైర్యం ఇప్పటి పిల్లలకు నేర్పడం లేదు కానీ ఈ వైకుంఠపాళి ఆడిన వాళ్ళెవరూ ఆత్మహత్యలకు పాల్పడరు. నిరాశా నిస్పృహలకు లోనుకారు.

కేవలం నాలుగు గవ్వలతో మూడో, నాలుగో చింత పిక్కలతో జీవితాన్ని ఆస్వాదించగలిగే, అనుభవించగలిగే, ఎదిరించగలిగే ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చే ఈ ఆట తెలుగువారి సృష్టి. తెలుగు సంస్కృతిలో పుత్రకామేష్టి.

ఇందులో 11 వరుసలుంటాయి. ఒక్కో వరుసలో 11 గడులుంటాయి. మొత్తం 121 గడులు పూర్తయ్యాక 11 గడులలో **'పరమపద సోపాన పటము'** అని 11 అక్షరాలు రాసి ఉంటాయి. ఆ పైన **"ధర సింహాసనమై, నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై..... సిరి భార్యామణియై"** అన్నట్లుగా పదిమంది దివ్యపురుషుల మధ్యలో శ్రీ మహావిష్ణువు కొలువై యుంటాడు. చివరకు

చేరుకోవాల్సిన స్థానం అది. అక్కడకు చేరుకొనేవరకు (జీవితమనే) ఆట ఆడుతూ ఉండవలసిందే. ఈలోగా ఒకటి నుండి 121 వరకు ఎక్కుతూ దిగుతూనే ఉండాలి. పడుతూ లేస్తూనే ఉండాలి. అంటే పరమపదాన్ని చేరుకొనేవరకు ఈ జనన మరణ సంసార చక్రములో పడుతూ లేస్తూ ఉండటం తప్పదని హెచ్చరిక.

పదకొండు అంటే దేవభాషలో ఏకాదశి. ఏకాదశీ వ్రతం భారతీయులందరికీ ఆచరణీయం. ఏకాదశి మహాపర్వదినం. ఆ రోజు ఉపవాసం, జాగరణం, దైవస్మరణ అనే మూడూ తప్పనిసరి. అలా 11 సం॥లు వరుసగా ఏకాదశీ వ్రతం చేస్తే పరమపదం చేరుకోవచ్చునేది పురాణ కథనం.

ఈ ఆధ్యాత్మిక మార్గాన్నే భౌతికంగా ఒక ఆట రూపంలో వైకుంఠపాళి ప్రదర్శిస్తుంది. ఆట ఆడటం భౌతిక ప్రయోజనం. గెలుపోటములు మానసికానుభూతి. పరమపదం చేరుకోవడం ఆధ్యాత్మిక పరమార్థం. ఇదొక రకంగా అరచేతిలో వైకుంఠం. నీ ముక్తి నీ చేతిలో ఉందని చెప్పడం. గవ్వలతో గెలవగలిగిన జీవితం కోసం 'రవ్వ' పెట్టుకోవద్దని ఉపదేశం.

ఇందులో ప్రతి గడిలోను ఏదో ఒక బొమ్మ, దానికో పేరు కచ్చితంగా ఉంటాయి. కొన్ని గళ్లు అడ్డంగా దాటిస్తూ నిచ్చెనలు ఊరిస్తాయి. కొన్ని గళ్లు అమాంతం దించేస్తూ పాములు బెదిరిస్తాయి. అంతలో ఉత్సాహం, అంతలోనే నిరుత్సాహం, అంతిమంగా ద్వంద్వాతీతమైన పరమశాంతి. ఇదీ ఆట నడిచే తీరు.

ఈ ఆటలో పాములున్న గడుల్లో పేర్లు, నిచ్చెనలున్న గడుల్లో పేర్లు నిశితంగా పరిశీలిస్తే అద్భుత జీవన మార్గాలు, అపూర్వ ఆధ్యాత్మిక రహస్యాలు గోచరమౌతాయి. ఉదాహరణకు 75వ గడిలో ఒక పాము తల ఉంటుంది. అక్కడ 'కర్కోటకుడు' అని రాసి ఉంటుంది. దాని తోక 10వ గడిలోకి పాకుతుంది. అక్కడ పంది బొమ్మ వేసి ఉంటుంది. పాము కరవడం వల్ల



క్రిందికి రావడం అనేది పైకి కనిపించే విషయం. జీవితంలో కర్కోటకంగా వ్యవహరిస్తే వచ్చే జన్మలో పందై పుడతావనేది ఆధ్యాత్మికమైన హెచ్చరిక.

అలాగే 55వ గడిలో ఒక పాము తల ఉంటుంది. అక్కడ 'దుర్యోధనుడు' అని రాసి ఉంటుంది. దాని తోక 12వ గడిలోకి పాకుతుంది. 43 గడులు క్రిందికి జారిపోవడం పైకి కనిపించే ఓటమి. జీవితంలో దుర్యోధనుడిలా అసూయాగ్రస్తుడవైతే బాణాలతో భయంకరమైన యుద్ధంలో నువ్వూ, నీవాళ్ళూ మరణిస్తారనేది మరవలేని హెచ్చరిక.

పాముల అమరిక ఇంత అర్థవంతంగా ఉంటే నిచ్చెనల ఏర్పాటు మరింత పరమార్థ బోధకంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. 63వ గడిలో ఒక నిచ్చెన అడుగుభాగం ఉంటుంది. అక్కడ 'భక్తి' అని రాసి ఉంటుంది. ఒక భక్తుని బొమ్మ ఉంటుంది. దాని కొస 83వ గడివరకు సాగుతుంది. అక్కడ 'బ్రహ్మలోకము' అని ఉంటుంది. బ్రహ్మదేవుని చిత్రం ఉంటుంది. నిచ్చెన ఎక్కడం వల్ల పైకి ఎగబ్రాకడం అనేది పై పై విషయం. భక్తిగా ఉండటమే బ్రహ్మలోకానికి చేరే ఉపాయం అనేది లోతైన ఆధ్యాత్మిక రహస్యం.

అలాగే 65వ గడిలో ఒక నిచ్చెన మొదలు ఉంటుంది. అక్కడ 'చిత్తశుద్ధి' అని రాసి ఉంటుంది. దాని కొస 105వ గడిలో ఉంటుంది. అక్కడ 'మహాలోకము' అని ఉంటుంది. మొత్తం వైకుంఠపాళిలో ఇదే పెద్ద నిచ్చెన. 40 గడులు అమాంతం ఎగబ్రాకవచ్చు. ఇదంతా పైకి ఆశపెట్టే విధానం. చిత్తశుద్ధి ఉంటే మహాలోకాలు నీ కోసం ఎదురుచూస్తూ ఉంటాయని అంతరార్థం. ఇప్పటి భాషలో చెప్పాలంటే లోకంలో మహానుభావుడిగా కీర్తింపబడతావని విశేషార్థం. ఏ చిత్తశుద్ధి కొరవడటం వల్ల ఇవాళ దేశం అవినీతి ఊబిలో కూరుకుపోయిందో అటువంటి చిత్తశుద్ధి ప్రాధాన్యాన్ని చిన్న పిల్లల వయస్సులోనే ఆటల రూపంలో నేర్పిన ఏకైక జాతి మన తెలుగుజాతి.

ఇంత గొప్ప విషయాన్ని చెబుతూనే చెంతనే పొంచి ఉన్న ముప్పును గుర్తించి జాగ్రత్త పడమనడం ఈ ఆట ప్రత్యేకత. సాధారణంగా 105వ గడి వరకు రాగానే ఆటగాడికి కొంచెం గర్వం వస్తుంది. ఇంక 16 గడులు దాటితే పండిపోయినట్లే గదా అనుకుంటాడు. అక్కడే ఎదురవుతుంది పెద్ద ప్రమాదం. 106వ గడిలో 'అరుకాషుడు' అనే అతి పెద్ద సర్పం ఉంటుంది. దాని నోట్లో పడితే అమాంతం క్రిందికి జారి మొదటి గడిలోకి అంటే 'కోతి'లోకి వచ్చి పడతాడు. అంటే లోకంలో మహానుభావుణ్ణి (సెలబ్రిటి) అయ్యాను గదా గర్వించి ఒక్క పొరపాటు (ఒక్కటి వేయడం) చేసినా మళ్లీ ఆట మొదటికి రావడం ఖాయం అని హెచ్చరించడం అన్నమాట. పైగా వైకుంఠపాళి పరిభాషలో 'ఒకటి'ని 'గ్రుడ్డి' అంటారు. అంటే ఎంత పెద్ద స్థానంలో ఉన్నా గర్వించి ఒక్క గ్రుడ్డి పని చేసినా మళ్లీ క్రిందికి జారిపోవడం తప్పదని చెప్పడం.

ఇంత జరిగినా ఆట మానకూడని పరిస్థితి ఇందులో విచిత్రమైన విషయం. ఒకడు పెద్ద పాము నోట్లో పడినా ఇంకొకడు ఇంకా పండలేదు కాబట్టి అతను ఇతన్ని ఆడమని ప్రోత్సహిస్తాడు. ప్రత్యర్థిని సైతం బాగా ఆడమని ప్రోత్సహించే ఏకైక క్రీడ బహుశా వైకుంఠపాళీయేనేమో!

ఇంతకీ చివరిదైనా చిన్నది కాని విషయం మరొకటుంది. చిట్టచివర 121వ గడిలో కూడా ఒక పాము ఉంటుంది. దాని పేరు 'అహంకారం'. దాని తోక 99వ గడిలోకి ఉంటుంది. అక్కడ రాక్షసుని బొమ్మ ఉంటుంది. అంటే 106లో అరుకాషుణ్ణి దాటినా, 115లో వైకుంఠంలో ప్రవేశించినా, 117లో కైలాసంలో దివ్యానుభూతి పొందినా చివరలో 121లో అహంకారానికి లోనయితే తిరిగి రాక్షసజన్మ తప్పదు అని హెచ్చరిక. బ్రహ్మరుద్రాది దేవతల్ని తపస్సులతో ప్రసన్నం చేసుకొని మహాభోగాలు అనుభవించి లోకాలన్నీ జయించిన హిరణ్య కశిప, రావణాసురాది వీరులు చివరకు రాక్షసులై దుర్మరణం పాలుకావడానికి ఈ 'అహంకారమే' కారణం గదా!



అంతిమంగా అహంకారం, మమకారం అనే రెంటినీ జయించినవాడే పరమపదం చేరుకోగలడని సారాంశం.

"జీవితమే ఒక వైకుంఠపాళి
నిజం తెలుసుకో భాయీ!
ఎగరేసే నిచ్చెనలే కాదు
పడదోసే పాములు ఉంటాయి.
చిరునవ్వులతో విషవలయాలను
ఛేదించి ముందుకు పోవోయి"

ఈ పాత చలనచిత్ర గీతం ఒక ప్రాచీన శ్లోకంలా, ఒక ప్రబంధ పద్యంలా, ఒక భావకవితలా, ఒక అభ్యుదయ గేయంలా ఎప్పుడూ తెలుగువారి చెవుల్లో మారుమ్రోగుతూ గెలుపుకోసం వెన్నుతడుతూనే ఉంటుంది.

# 2. రామాయణం - ఆధునిక జీవనం

భారతీయ సంస్కృతికి మూలస్తంభాల వంటి గ్రంథాలు మూడున్నాయి. అవే రామాయణ, భారత, భాగవతాలు. వీటిలో భారతం మన నిజ జీవితం. రామాయణం ఆదర్శజీవితం. భాగవతం దివ్య జీవితం. మనం నిజ జీవితంలో ఎన్ని రకాల రాగద్వేషాలతో కొట్టుకుపోతున్నామో భారతం చెబుతుంది. మనం ఎంత ఆదర్శప్రాయమైన జీవితం గడపవచ్చో రామాయణం తెలియజేస్తుంది. ఏరకంగా భావిస్తే మనం దివ్య జీవితం గడపగలుగుతామో భాగవతం బోధిస్తుంది. ఆయా గ్రంథాలలో పాత్రలు, ప్రవృత్తులు, కథలు, సందర్భాలు అన్నీ ఈ ఆశయాలకి అనుగుణంగానే ఉంటాయి. ఎందుకంటే వీటిని రచించిన వ్యాస వాల్మీకులు కారణజన్ములు. మనం వట్టి రణజన్ములం. అదీ తేడా.

కారణజన్ముడైన మహాకవి వాల్మీకి రామాయణాన్ని ఆద్యంతం రమణీయంగానే కాదు, మనందరికీ అనుసరణీయంగా రచించాడు. 'రామ+అయనం' అంటే 'రాముని మార్గం' అని అర్థం. అంటే జీవితంలో తనకు ఎటువంటి సమస్యలు వస్తే రాముడు ఏ మార్గంలో నడిచాడో మనం తెలుసుకొని అనుసరించగలిగితే చరిత్రలో మిగులుతాం. లేకపోతే కాల గర్భంలో కలిసిపోతాం. అలా జీవితాంతం ధర్మమార్గం విడిచిపెట్టలేదు కాబట్టే రాముడు శ్రీరాముడయ్యాడు.

రాముణ్ణి ఇంత గొప్పవాణ్ణి చేసింది ఆయన గురువులు వశిష్ఠ విశ్వామిత్రులే. వశిష్ఠుడు చిన్న వయస్సులోనే రామునికి యోగవాసిష్ఠం బోధించి మనోనిగ్రహం కలిగేలా చేశాడు. విశ్వామిత్రుడు దుర్గమమైన అరణ్య మార్గంలో నడిపించి జీవితం అంటే ఏమిటో దాన్ని స్థైర్యంతో ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో నేర్పాడు.



ఒక రకంగా చూస్తే వశిష్ఠుడు బోధించింది సిద్ధాంతం (థియరి). విశ్వామిత్రుడు చేయించింది ప్రయోగం (ప్రాక్టికల్).

విశ్వామిత్రునితో యజ్ఞసంరక్షణ కోసం బయలుదేదిన రామలక్ష్మణులు ఒకరోజు రాత్రి అడవిలోనే పచ్చగడ్డే పరుపుగా పడుకొని ఉంటారు. ఆ దృశ్యాన్ని మహర్షి వాల్మీకి 'పుష్పితాగ్రం' అనే ఛందస్సులో వర్ణించాడు.

**దశరథ నృప సూను సత్తమాభ్యాం**
**తృణ శయనేऽను చితే ఉషోషితాభ్యాం!**
**కుశికసుత వచోऽను లాలితాభ్యాం**
**సుఖమివ సా విబభౌ విభావరీ చ॥**

కావ్యమంతా ఇంచుమించుగా అనుష్టుప్పు ఛంధస్సులోనే రచిస్తూ అధ్యాయం ముగిసినప్పుడు ప్రత్యేకమైన ఛందస్సు వాడటం వాల్మీకి రచనలో వైచిత్రి. అదీగాక 'పుష్పిత+అగ్రం' అంటే అగ్రభాగం వికసించింది' అని ఇకముందు వికసించబోతోందని ధ్వని వస్తుంది. ఆ అధ్యాయం తరువాత నుంచే రాముని పరాక్రమం వ్యక్తమయింది. రాముడంటే ఏమిటో లోకానికి మొదటిసారి తెలిసింది. విశ్వామిత్రుడు కథలు చెప్పి ఆ వెన్నెల రాత్రులను పరిమళ భరితాలుగా చేసి సుఖంగా నిద్రపట్టేలా చేశాడట. ఎంత అందమైన, ఆహ్లాదకరమైన భావుకత!

ఈ సందర్భాన్ని ఒక తెలుగు పద్యంలో చెప్పాలంటే.... ఇలా ఉంటుందేమో ఆ పద్యం!

**"కటికనేల మీద కమలాక్షుడు పరుండె**
**ప్రక్కగూడ అతని ప్రక్క బండె***
**కథలు చెప్పుఋషికి కదలిపోయెను గుండె**
**కథను నదుపువాడు కదలకుండె"**

---

* లక్ష్మణ రూపంలో ఉన్న శేషుడు

కఠినమైన అరణ్యమార్గంలో నడుస్తున్నా కథలు, కమ్మని ఉపదేశాలు ఆ దారిలో పూవులు పరిచాయి. అందుకే 'అలకలల్లాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో' అని త్యాగరాజస్వామి అన్నట్లుగా రాముడు వేగంగా నడుస్తూ గురూపదేశ సారాన్ని కూడా అంత వేగంగా అర్థం చేసుకొని ఆచరించాడు.

విశ్వామిత్రునితో చేసిన యాత్రలో రాముడు ముగ్గురు స్త్రీలను కలుసుకొన్నాడు. వారే తాటక, అహల్య, సీత. ఈ ముగ్గురి పట్ల రాముడు మూడు విధాలుగా ప్రవర్తించాడు. తాటకను సంహరించాడు. అహల్యను సంస్కరించాడు. సీతను స్వీకరించాడు. ఎందుకు ఈ విధంగా భిన్నంగా ప్రవర్తించవలసి వచ్చిందంటే... ఆ ముగ్గురి విషయంలో అలాగే ప్రవర్తించమని గురూపదేశం. ఆ ఉపదేశం ఆయనకే కాదు మనకీను. అది అడవుల్లో తిరగడం కోసం చేసింది కాదు. జీవితమంతా పాటించవలసిన మహోపదేశం. తాటక తమోగుణానికి సంకేతం. తమోగుణాన్ని సంహరించాలి. అందుకే సంహరించాడు. అహల్య రజోగుణానికి సంకేతం. ఆమెలోని చురుకుదనం, క్రియాశీలత తప్పుదారి పట్టాయి. అటువంటి వాళ్ళని సహనంతో సంస్కరించాలి. అందుకే రాతిని నాతిగా మార్చి ఆమెను సంస్కరించాడు. ఆమెకు రాముడంతటివాడు పాదాభివందనం చేయడం గమనార్హం. ఇక సీత సత్త్వగుణానికి సంకేతం. వెదకి చూచినా లోపం దొరకదు. అందుకే ఆమెను పందెంలో గెలిచి మరీ స్వీకరించాడు. ఏ వ్యక్తి అయినా తమోగుణాన్ని సంహరించాలి. రజోగుణాన్ని సంస్కరించుకొని మంచి పనుల కోసం వినియోగించాలి. సత్త్వగుణాన్ని వృద్ధిచేసుకొని క్రమంగా గుణాతీత స్థితికి చేరుకొని మోక్షం పొందాలి. ఇదీ రాముని మార్గం. అదే రామాయణం. ఆధునిక సమాజానికి ఆనాటి రాముడు చెప్పి, చేసి చూపించింది ఇదే.

మూడు గుణాలకు ప్రతీకలుగా ముగ్గురూ స్త్రీలనే చూపించే ఈ ఘట్టం ద్వారా మరో విశేషం గ్రహించవచ్చు. 'స్త్రీ' అనే పదాన్ని గమనిస్తే సకారం సత్త్వగుణం, త కారం తమోగుణం, రకారం రజోగుణం అని తెలుస్తుంది. పైన ఈకారం అమ్మవారి బీజాక్షరం. త్రిగుణాత్మక ప్రకృతికి ప్రతీకే స్త్రీ. అదీ మన భాష గొప్పదనం.



ప్రేమ, ప్రేమ అంటూ కొట్టుకుపోయే మన యువతీయువకులకి శ్రీరాముడు ప్రేమంటే ఏమిటో ఎవరిని ప్రేమించాలో తెలియజేశాడు. సీతను పెండ్లాడాక ఆమెను ప్రాణాధికంగా ప్రేమించాడట. ఎందుకో తెలుసా?

**ప్రియాతు సీతా రామస్య**
**దారాః పితృకృతా ఇతి**
**గుణాద్రూపగుణాచ్చాపి**
**ప్రీతిః భూయోఽభి వర్ధత**

ఇది పెద్దలు కుదిర్చిన పెండ్లికదా అని రాముడు సీతను ప్రత్యేకించి ఇష్టపడ్డాడట. తాను ధనుర్భంగం అనే పందెంలో గెలిచి చేసుకొన్నదే అయినా ఆ ప్రయత్నం విశ్వామిత్రుని ఆదేశంతోనే గదా చేసింది! అనంతరం దశరథాదులందరూ అంగీకరించిందే గదా ఆ పెండ్లి! అందుకోసం రాముడు ఆమె అంటే ఇష్టం కావాలనే పెంచుకొన్నాడు. సీత కూడా తన గుణగణాలతోను, లక్ష్మీకళతో విలసిల్లే రూపంతోనూ రామునికి తనపై ప్రేమ పెరిగేలా చేసుకొంది. ఇదీ సంసారం నిలబెట్టుకొనే లక్షణం. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలా, పెళ్ళిచేసుకొని ప్రేమించాలా అని పెద్ద పెద్ద చర్చలు జరుపుతున్న ఈ కాలం యువతరానికి రాముడు ఆచరించి చూపిన మార్గం ఇది. యువతీయువకులు తమ సహచరుణ్ణి ఎన్నుకోవాలనుకొంటే అందానికి కొందరు, ఐశ్వర్యానికి కొందరు, ఆర్భాటాలకు కొందరు, అర్థంకాని, అర్థంలేని విషయాలకు కొందరు ప్రాధాన్యం ఇచ్చి పెళ్ళి చేసేసుకొని ఆ తరువాత ఒకటి ఉంటే ఒకటి లేదని బాధపడుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్లు అలా ఉండవు.

**"కన్యా వరయతే రూపం, మాతా విత్తం పితాశ్రుతం**
**బాంధవాః కులమిచ్ఛంతి, మృష్టాన్నమితరే జనాః"**

అని శాస్త్రం చెబుతోంది. అమ్మాయి అందం చూస్తే, అత్తగారు (అమ్మాయి తల్లి) ఆస్తిపాస్తులు చూస్తుందట. మామగారు అల్లుడి చదువు, ఉద్యోగం, హోదా

అన్నీ చూస్తాడు. బంధువులు వంశం, సంప్రదాయం చూస్తారు. ఇతరులు పది మందినీ పిలిచి మంచి భోజనం పెట్టగలడా అని ఆలోచిస్తారట. ఇంతమంది ఇన్నీ చూస్తే ఆ బంధం ప్రబంధంలా కలకాలం ఉంటుంది. లేకపోతే దుర్గంధమై తాను కుళ్లిపోయి చుట్టూ వాతావరణం కూడా కుళ్లబెడుతుంది. అందుకే రాముడు పెద్దలు కుదిర్చిన పెళ్లిచేసుకొని యువకులకీ, అలా చేసుకొన్న భర్తను రూపంతోను, గుణాలతోను ఆకర్షించి సంసారం నిలబెట్టుకోమని యువతులకీ సందేశం ఇస్తున్నాడు.

ఈనాటి ప్రభుత్వాలకీ, అధికారులకీ ఉపయోగపడే ఎన్నో విషయాలు అయోధ్యకాండలో రాముడు భరతుడికి తెలియజేస్తాడు. ఇవన్నీ కుశల ప్రశ్నల రూపంలో ఉంటాయి. అయోధ్యకాండలో నూరవ సర్గ అంతా రాముని కాలంనాటి పాలనా సూత్రాలే. ఈ సర్గలో మాటిమాటికీ 'కచ్చిత్' అనే మాట రావడం వల్ల పండితులు దీన్ని కచ్చిత్ సర్గ అని కూడా అంటారు. ఇందులో మన పంచవర్ష ప్రణాళికల గురించి ఏం చెప్పాడో చూడండి.

"కచ్చిదర్థం వినిశ్చిత్య
లఘుమూలం మహోదయం
క్షిప్రమారభసే కర్తుం
న దీర్ఘయసి రాఘవ"

ప్రణాళికలు ప్రారంభించేటప్పుడు ముందు ధనం సమృద్ధిగా ఉందో లేదో చూసుకోవాలి. ప్రపంచబ్యాంకు అప్పిస్తుందిలే అని మొదలుపెట్టకూడదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితం పొందేలా ప్రణాళిక తయారుచెయ్యాలి. పని వీలయినంత త్వరగా మొదలుపెట్టాలి. ఏళ్లతరబడి సాగదీయకూడదు. ఇదీ శ్రీరాముడు భరతుడికి చేసిన ఉద్బోధ. ఈ సర్గ మన చట్టసభల్లో ఎవరైనా పండితుడు చదివి వివరణ చేస్తే మన పెద్దల ఆలోచనలు కొంతవరకైనా సరైన దారిలో నడుస్తాయి. భారతదేశం అప్పుల ఊబిలోంచి బయటపడుతుంది.



రామరాజ్యం, రామరాజ్యం అంటూ గాంధీగారు ఎందుకు కలవరించారో అర్థం అవుతుంది.

పాలకులకి చెప్పిన మాటలిలా ఉంటే పడతులకి కూడా రామాయణం ఎన్నో జాగ్రత్తలు బోధిస్తోంది. అరణ్యకాండలో రావణాసురుడు ఎత్తుకు పోతుంటే సీతాదేవి రామా, లక్ష్మణా అంటూ ఆర్తనాదాలు చేస్తూ క్రిందికి చూస్తోంది. క్రింద పెద్ద గుంపు కనబడింది. అప్పుడేమి చేసిందంటే ....

**"వస్త్రముత్సృజ్య తన్మధ్యే విక్షిప్తం సహభూషణం**
**సంభ్రమాత్తు దశగ్రీవః తత్కర్మ నస బుద్ధవాన్"**

సీతాదేవి తన ఆభరణాలు తానే తన చీరనే చింపి మూటగట్టి ఆ గుంపు మధ్యలో వదిలేసిందట. సీతను ఎత్తుకుపోయే సంభ్రమంలో ఉన్న దశకంఠుడు ఆ విషయాన్ని గమనించలేదట. ఇక్కడే మనం కాస్త సూక్ష్మంగా ఒక విషయాన్ని గమనించాలి. శ్రీరాముడంటే వనవాస నియమం ప్రకారం రాజవస్త్రాలు, భూషణాలు విసర్జించి నారచీరలు ధరించి బయలుదేరాడు. కానీ సీతాదేవికి ఆ నియమాలేవీ లేవు. ఆవిడ చీని చీనాంబరాలతో సర్వాభరణాలు ధరించి బయలుదేరింది. పుట్టింటివారు, అత్తింటివారు పెట్టిన ఏడు వారాల నగలూ ఒంటిమీద ఉన్నా ఆ తల్లి మాయలేడి ఒంటి మీద బంగారం చూసి మోజుపడింది. ఇదే విధి విలాసం అంటే! అటువంటి ఆశకు లోనయినందుకే సీత తన సమస్తాభరణాలు కోల్పోవలసి వచ్చింది. సాక్షాత్తు లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవికే ఈ పరిస్థితి వస్తే ఇక మానవమాత్రులం మనమనగా ఎంత? అందుకే అవసరం లేనిది ఒకటి మోజుపడి కొంటే అవసరం ఉన్నవి కూడా అమ్మేయవలసి వస్తుందని మనం గ్రహించడం మంచిది.

మరో ముఖ్య విషయం అరణ్యకాండలోనే మనం గమనించవచ్చు. సీతా వియోగంలో ఉన్న శ్రీరాముడు అక్కడి నదులనీ, చెట్లనీ, పుట్టల్నీ, కొండల్నీ,

గుట్టల్నీ, లేళ్లనీ, కుందేళ్లనీ కనిపించిన చరాచర జీవరాశినంతటినీ సీత గురించి ప్రశ్నిస్తాడు. ఆయన స్థితిని చూసి తట్టుకోలేక లేళ్లు యథాశక్తి ప్రయత్నించి ఆయనకు రావణ దుర్మార్గాన్ని గురించి సూచించాయట. పర్ణశాల వైపు చూడటం, ఆపైన దక్షిణంగా పరిగెత్తడం, ఆగి ఆకాశం వైపు చూసి కంటనీరు పెట్టడం -- ఇలా చేస్తున్నాయట. అది గమనించిన రామునికి పర్ణశాలలో ఉన్న సీతని ఎవరో రాక్షసుడు ఎత్తుకు పోయి ఆకాశమార్గంలో దక్షిణదిశగా ప్రయాణించాడని అర్థమయిందట. ఈ స్థితిని వర్ణిస్తున్న వాల్మీకి శ్లోకం దీనస్థితిలో పడిన ప్రతి సత్పురుషునికీ ఒక ఓదార్పునిస్తుంది.

**"సుపంథానంతు గచ్ఛంతం**
**తిర్యంచోపి సహాయతే**
**కుపంథానంతు గచ్ఛంతం**
**సోదరోపి విముంచతి"**

మంచిమార్గంలో పయనించే వ్యక్తులకి పక్షులు, పశువులు కూడా సాయం చేస్తాయట. అందుకే రామునికి లేళ్లు, జటాయువు, సంపాతి, వానరులు కూడా సాయం చేశారు. దుర్మార్గంలో నడిచే వ్యక్తిని సోదరుడు కూడా విడిచిపెట్టి వెళ్లిపోతాడట. సరిగ్గా రావణుని విషయంలో ఇదే జరిగింది. ఇదీ మహర్షి మానవజాతికి చేసిన ఉపదేశం. ఏ కాలానికైనా, ఏ పరిస్థితులలోనైనా ఉపయోగించే మాటలివి. అందుకే బ్రహ్మదేవుడు కొండలున్నంత వరకూ, నదులు ప్రవహించినంత వరకూ రామాయణం ఉంటుందని చెప్పింది. మొగమాటానికి చెప్పిన మాట కాదది. నాలుగు ముఖాలతో ఉద్ఘాటించిన నగ్న సత్యం.

కిష్కింధకాండ చివరలో జటాయువు అన్నగారు సంపాతి దక్షిణ సముద్ర తీరంలో రెక్కలు కోల్పోయి పడి ఉండగా వానరులు పొరపాటున అతని నోటి సమీపానికి చేరతారు. కొన్ని వేలమందిని ముక్కుతో కరచుకొని మ్రింగేద్దామని చూస్తాడు సంపాతి. కాస్సేపటికి రామదండు అని తెలిసి వదిలేస్తాడు. దారి



చెప్పి ఉపకారం కూడా చేస్తాడు. ఆ సందర్భంలో వానరుల్లో కొందరు 'ఏమయ్యా, నీ దుంపతెగా! ఇన్ని వేలమందిని ముక్కున కరచుకొన్నావు, మ్రింగేద్దామనే? అంత ఆకలి ఉందా నీకు? అని ప్రశ్నిస్తే సంపాతి సమాధానం వివిధ జాతుల గురించి విశేష సమాచారం అందిస్తుంది.

**"తీక్ష్ణ కామాస్తు గంధర్వాః**
**తీక్ష్ణ కోపా భుజంగమాః**
**మృగాణాంచ భయం తీక్ష్ణం**
**తత స్తీక్ష్ణ క్షుధా వయం"**

గంధర్వులకు కామవాంఛ ఎక్కువ. పాములకు కోపం ఎక్కువ. మృగాలకు భయం ఎక్కువ. పక్షులకు ఆకలి ఎక్కువ. మరి మానవులకో? అదే మహర్షి కవిత్వంలో ధ్వని. పైకి చెప్పదు. మనకు ఆ నాలుగూ ఎక్కువే. జాగ్రత్త పడదాం.

ఈ విషయాలు ఇలా ఉండగా ఈనాడు మన సమాజంలో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు సంభాషణా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం అంటూ ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే సంస్థలు వెలిసాయి కదా ! 15 ఏళ్లు చదువుకొన్న విద్యార్థికి సంభాషణా నైపుణ్యం, నాయకత్వపు ధైర్యస్థైర్యాలు లేవంటే, అతని వ్యక్తిత్వం ఇంకా వికసించలేదంటే ఈ పదిహేనేళ్లు మనం ఆ విద్యార్థికి ఏం నేర్పినట్లు? ఇన్నేళ్లు చదువు చెప్పాక కూడా మళ్లీ మూడు వేలు ఖర్చుపెట్టి, మూడు నెలల శిక్షణ తీసుకోవలసి వస్తోందంటే ఆ లోపం ఉపాధ్యాయులది, విద్యావ్యవస్థదీ కాదా?

ఒక్క రామాయణంలో కేవలం సుందరకాండ చదివినా కావలసినంత ధైర్యం, కార్యసాధన నైపుణ్యం, సంభాషణా చాతుర్యం అన్నీ అలవడతాయి.

సముద్రాన్ని లంఘించడం గురించి వానరులు వంతులు వేసుకొంటూ ఉంటే కొందరు గొప్పలు చెప్పుకొంటూ భుజాలు అప్పళిస్తుంటే కూడా అసలైన

నాయకుడు హనుమంతుడు ఏమీ మాట్లాడడు. దూరంగా ఎక్కడో ఒక రాతిమీద కూర్చొని రామనామ జపంలో ఉంటాడు. వానరులందరూ వెళ్లి ఆయన్ని ఆహ్వానించినప్పుడే రంగం మీదికి వస్తాడు. అనవసరపు గొప్పలు చెప్పడు. అవసరం వచ్చినప్పుడే తన శక్తి ప్రదర్శిస్తాడు. ఇదే నాయకత్వ లక్షణం.

కొండ మీద నుండి మరో కొండ పైకి లేచినట్లుగా మహేంద్ర పర్వతం మీంచి మారుతి పైకి ఒక్క ఉదుటున లేచి ఆకాశంలోకి ఎగిరి ఏకధాటిగా సాగిపోతుంటే మధ్యలో మైనాకుడు అనే పర్వతం అడ్డువచ్చి తన పైన కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని వెళ్లమని కోరుతుంది. హనుమంతుడు ఆ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించి ముందుకు సాగిపోతాడు. ఇదీ కార్యసాధకుని లక్షణం. ఒక ముఖ్యమైన పనిమీద వెళ్తున్నప్పుడు మధ్యలో ఆయాసాలు, ఆగడాలు పనికిరావు. పనిలో వేగం తగ్గిపోవడం, ఆలస్యం కావడం అటుంచి దీనివల్ల మరో ప్రమాదం ఉంది. ఆపి, ఆతిథ్యం ఇచ్చిన పెద్దమనిషి ఒకోసారి మన పనిలో మనల్ని నిరుత్సాహపరిచేలా మాట్లాడవచ్చు. సరిగ్గా భారతంలో ఇలాగే జరిగింది. నకుల సహదేవుల సొంత మేనమామ అయిన శల్యుడు పాండవులకు యుద్ధంలో సాయం చేయడానికి మద్ర దేశం నుండి కురుక్షేత్రానికి బయలు దేరాడు. మధ్యలో దుర్యోధనుడు ఆయన్ని మర్యాదగా ఆపగలిగాడు. విందు వినోదాలలో ముంచి తేల్చాడు. ఆ మత్తులో పడిన శల్యుడు కౌరవుల పక్షాన యుద్ధం చేస్తానని ఆయనకు మాటిచ్చాడు. ఆ మాటకు కట్టుబడి వచ్చిన పనికి సరిగ్గా విరుద్ధమైన పనిచేసి అప్రతిష్ఠపాలయ్యాడు. చివరకు అజాత శత్రువు చేతుల్లో మరణం పాలబడ్డాడు కూడా. ఇటువంటివి జరిగే అవకాశం ఉండబట్టే హనుమంతుడు మైనాకుని అతిథ్యాన్ని మర్యాదగా తిరస్కరించి కార్యసాధనలో ముందుకు దూసుకుపోయాడు.

హనుమంతుడు అలా అకుంఠితంగా సాగుతూ ఉంటే 'సురస' అనే రాక్షసి పెద్దగా నోరు తెరచి ఆయన్ని మ్రింగేయాలని చూసింది. ఆంజనేయుడు దానితో



పోటీపడి శరీరం పెద్దదిగా చేసి చివరకు ఒక్కసారిగా శరీరాన్ని తగ్గించేసి దాని శరీరంలో దూరి ఉపాయంతో బయటపడ్డాడు. ఒక మహత్తర కార్యసాధన కోసం మనం ప్రయత్నించేటపుడు ఎంత శక్తినైనా ప్రదర్శించి ఎదగాలి. అవసరాన్ని బట్టి అంతస్థాయి నుండి దిగి ఒదిగిపోవాలి. "ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు పూసెజ్జపై" అనే ఏనుగు లక్ష్మణ కవి సుభాషితం చదివినా ఈ విషయం అర్థమవుతుంది. ఇవన్నీ పనిని సాధించడానికి ఉపాయాలు కావా? నాయకత్వ లక్షణాలు కావా?

ఇన్ని విషయాలు ఇంత స్పష్టంగా మన పురాణాల్లో ఉంటే వీటిని చెప్పడం మానేసి ఎక్కడో ఇంగ్లీషు దేశాల్లో ఇంగ్లీషు భాషలో ఉదాహరణలు చెప్పి మన పిల్లల మనస్సులకి ఎక్కించాలని చూస్తే అసలు ముందు అర్థం అవుతాయా? ఒకవేళ అయినా ఆచరించేంతగా స్ఫూర్తిని అందించగలుగుతాయా? ఒకవేళ అందించినా ఆ విద్యార్థులకి అన్ని గొప్ప విషయాలూ ఇతర దేశాల్లోనూ, ఇతర బాషల్లోనే ఉన్నాయనీ, మన గ్రంథాల్లో, మన సంస్కృతిలో అంత గొప్పవి ఏమీ లేవనే అభిప్రాయం కలగదా? అటువంటి అభిప్రాయమే కలిగితే అంతకంటే ఆత్మవిశ్వాస రాహిత్యం వేరే ఏదైనా ఉందా? అలా ఆత్మవిశ్వాసంలేని యువతరాన్ని మనం తయారుచేస్తే ఇప్పటికే వెనుకబడ్డ దేశంగా పేరుబడ్డ మనదేశం ఇకముందు ముందుకు పడిపోయిన దేశమైపోదా? పెద్దలందరూ, ఉపాధ్యాయులందరూ, శిక్షణాకేంద్రాలు నడిపే వాళ్ళందరూ, ఇంగ్లీషులో ఉపదేశాలు చేసేవారందరూ, ఇళ్లలో తల్లిదండ్రులందరూ ఆలోచించాల్సిన విషయం ఇది.

తరువాతి కథలో చూడండి. సీత కోసం వెదకి వెదకి చివరకు శింశుపా వృక్షం క్రింద ఆమెను కనుగొన్నాక కాస్త స్తిమితపడి, రావణుడు వచ్చి వెళ్ళే వరకూ ఆగి, ఆ తరువాత నెమ్మదిగా రామకథాగానంతో హనుమంతుడు తన పరిచయం కలిగించాడు తప్ప, ఎటువంటి హడావుడీ చేయలేదు. అనవసరపు ఆర్భాటం చేస్తే సీతకు నమ్మకం కుదరకపోతే అసలు పనికి మోసం వస్తుంది.

ఇదంతా కార్యసాధన నైపుణ్యం కాదా! ఈ విషయాలు తెలిస్తే 'మేనేజింగ్ ఎబిలిటీ' అంటూ ప్రత్యేకంగా నేర్చుకోవాలా? ఆపైన సీతతో జరిపిన సంభాషణలో ఆమెను ఓదార్చడం, రాముని ప్రేమను వివరించడం, రాముడు తప్పక వస్తాడని నమ్మకం కలిగించడం చేస్తాడు తప్ప తాను సముద్ర లంఘనంలో గాని, సీతాన్వేషణలో గాని పడిన కష్టం ఏ మాత్రం చెప్పడు. ఎంత నిస్వార్థం? ఎంత నిరాడంబరత? ఇవీ నాయకత్వ లక్షణాలంటే...

యుద్ధకాండలో రావణ వధ అయిపోయాక విభీషణుడు వచ్చి తన అన్నగారి పార్థివ దేహాన్ని అప్పగిస్తే రాక్షసుల వంశాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వర్తించుకొంటామని చెప్పి శ్రీరాముని అనుమతి కోరతాడు. అప్పుడు మర్యాదా పురుషోత్తముడైన రాముని సమాధానం చూడండి.

**"మరణాంతాని వైరాణి, నిర్వృత్తం నః ప్రయోజనం**
**క్రియతామద్య సంస్కారః మమాప్యేష యథా తవ"**

"ఓ విభీషణా! ఎంతటి శత్రుత్వమైనా చావుతో ముగిసిపోవాలి. సీతారక్షణం అనే మన ప్రయోజనం కోసం సంధి కుదరక తప్పనిసరై యుద్ధం చేయవలసి వచ్చిందే కానీ ఈ జన నష్టం నాకిష్టం లేదు. మీ అన్నగారి శవానికి మీ ఆచారం ప్రకారం దహన సంస్కారాలు నడిపించు. ఇక నుండి ఈ పెద్దమనిషి నీకే కాదు, నాకూ అన్నగారే".

భార్యను బలవంతంగా ఎత్తుకుపోయిన వాడి మీద ఎవరికైనా ఎంత కక్ష ఉంటుంది? అటువంటి కోపతాపాలన్నీ మరిచిపోయి ధర్మబద్ధంగా, బాధ్యతాయుతంగా మాట్లాడటం శ్రీరామునికే చెల్లింది. అందుకే ఆయన దేవుడయ్యాడు.

ఈ దేవుడే ఈ రాముడే ఇన్ని వేల ఏళ్లుగా ఈ జాతికి స్ఫూర్తిమూర్తిగా నిలిచాడు. నిన్నమొన్నటి కార్గిల్ యుద్ధంలో కూడా రామాయణంలోని ఈ



ఘట్టమే మన సైన్యానికి మార్గదర్శనం చేసి భారతీయుల జీవనాదర్శాలు ఇంత మహోన్నతంగా ఉంటాయని యావత్ప్రపంచానికి చాటి చెప్పింది.

కార్గిల్ యుద్ధంలో మన సైనికులు పాకిస్థాన్ వారికి చిక్కితే క్రూరాతి క్రూరంగా చిత్రహింసలు పెట్టి నీచాతి నీచంగా కళ్లు, చెవులు, మోకాళ్లు చెక్కేసి శవాలను మన సరిహద్దు వైపు త్రోసేశారు. అదే సమయంలో వారి సైనికులు కొందరు మనవారి చేతుల్లో మరణించారు. ఆ శవాలను పెట్టెలో పెట్టి వారికి అప్పగిస్తే ఆశ్చర్యకరంగా తీసుకొందుకు నిరాకరించారు. చనిపోయిన సైనికుల గురించి ఆ దేశ నాయకులకు చింత ఉండదన్నమాట! ఆ పార్థివ దేహాలను ఏం చెయ్యాలని మన సైన్యాధిపతులు అప్పటి ప్రధాని వాజ్‌పేయిని సంప్రదించారు. భారతీయ సంస్కారం మూర్తీభవించిన అటల్ బిహారీ వెంటనే రామాయణం యుద్ధకాండలోని 'మరణాంతాని వైరాణి' అనే (పైనుదహరించిన) శ్లోకాన్ని చదివి ఇలా అన్నాడట. ఏ దేశం తరపున పోరాడినా సైనికుడు సైనికుడే. రాజకీయ నాయకత్వంలో అహంకారాల వల్ల యుద్ధాలు జరుగుతుంటాయి. దానికి సైనికులను నిందించకూడదు. వీరుడి భౌతికదేహాన్ని కూడా వీరోచితంగానే గౌరవించాలి. వారి శవాలకి ఇస్లాం మతం సంప్రదాయాల ప్రకారం వారి మౌల్వీల సమక్షంలో ఖనన సంస్కారాలు జరిపించండి' అని ఆదేశించారట. అప్పట్లో వార్తాపత్రికలు ఈ విషయాన్ని ప్రచురిస్తే ప్రతి భారతీయుని కళ్లు చెమర్చి భక్తిగా రామునికి, ప్రధాని వాజ్‌పేయికి నమస్కరించాయి. ఇదీ రామాయణం ప్రభావం.

మరో ముఖ్య సంఘటన. చివరిదైనా కాని చిన్నది కాని విషయం. రామరావణ యుద్ధం ముగిసింది. వానరులంతా అలసిపోయి ఉన్నారు. ఆ సమయంలో విభీషణుడు పదిరోజుల పాటు లంకలో ఉండి విశ్రాంతి తీసుకొని వెళ్లమని కోరాడు. లక్ష్మణ సుగ్రీవులతో సహా అందరూ సై అంటే సై అని తయారయ్యారు. కాని అలా లంకలో మకాం పెడితే వానరుల బుద్ధులు ఎలా

మారతాయో రామునికి బాగా తెలుసు. క్రమంగా పదిరోజులు పది మాసాలు అవుతాయి. అసలీ రాజ్యం విభీషణునికి ఎందుకివ్వాలి అనే చర్చ వస్తుంది. విజయ మదాలసులైన వానరులు లక్ష్మణునితో సహా లోభగ్రస్తులై దానం ఇచ్చిన రాజ్యాన్ని తిరిగి తీసేసుకుందామనే దురాలోచన చేసే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రమాదానికి ఇప్పటి పదిరోజుల విశ్రాంతి ఒక అవకాశం. ఇది గ్రహించిన రాముడు మొత్తం స్వార్థప్రవాహానికి అడ్డుకట్టవేసే ఉద్దేశ్యంతో ఇలా అంటాడు.

**"అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే**
**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"**

"ఓ లక్ష్మణా! లంక ఎంత సువర్ణమయమైనా, సుఖభోగాలమయమైనా ప్రస్తుతం నా దృష్టి దాని మీద లేదు. కన్నతల్లి కన్నా, ఉన్న ఊరుకన్నా ఏదీ అందంగా ఉండదు. స్వర్గమైనా, ఈ రెండింటికన్నా తక్కువే. అందువల్ల పద్నాలుగేళ్లుగా నీ కోసం, నా కోసం చూస్తున్న జనని కోసం, జన్మభూమి కోసం వెంటనే బయలుదేరుదాం పదండి" అని ఉపదేశం రూపంలో ఆదేశించాడు. మనకు నచ్చని విషయాన్ని కూడా సలహా ఇచ్చినవాళ్ల మనస్సు గాయపడకుండా ఎంత సున్నితంగా చెప్పవచ్చో నిరూపించాడు. ఇదీ సంభాషణా నైపుణ్యం (కమ్యూనికేషన్ స్కిల్స్) అంటే.

ఇటువంటివి ఎన్నో అంశాలు రామాయణం నుండి మన యువతరానికి నేర్పవచ్చు. రామాయణం ఆకాలానికి మాత్రమే సంబంధించినది కాదు. అది సార్వకాలిక సత్యం. అటువంటి గ్రంథాలు నదులు, కొండలు, అరణ్యాలు ఉన్నంత వరకు ఉంటాయి. ఎందుకంటే వాటిని రచించినవారు కేవలం కవులు కాదు. ఋషులు. ముందు తపించి తరువాత రచించారు. ఇప్పటి కవులు ముందు రచించేసి తరువాత తపిస్తున్నారు పురస్కారాల కోసం. కవులలో ఈ ధోరణి మారాలన్నా శ్రీమద్రామాయణ పఠన, పాఠనాలే గతి. అన్యథా శరణం నాస్తి.



# 3. ధర్మరాజు - యుధిష్ఠిరుడు

ధర్మరాజుకి 'యుధిష్ఠిరుడు' అనే బిరుదం ఉంది. అంటే యుద్ధంలో స్థిరంగా నిలబడి పోరాడేవాడు అని అర్థం. కాని ధర్మరాజు యుద్ధాల్లో వెనుదిరగని వీరుడు అని మనం ఋజువు చేయడం కష్టం. మరైతే ఈ బిరుదు ఆయన విషయంలో ఎలా సార్థకమవుతుంది?

యుద్ధం అంటే కేవలం శత్రువులతో చేసేది మాత్రమే కాదు. ఆయుధాలతో చేసేది అంతకన్నా కాదు. ఎవరు శత్రువో తెలియకపోయినా, ఏ ఆయుధం దొరకక పోయినా మనం మనల్ని జయించడం కోసం చేసే నిత్యజీవన సంగ్రామమే నిజమైన యుద్ధం. ఆ యుద్ధంలో ధర్మరాజు నిజంగా వెనుదిరగని వీరుడే. అందుకే ఆయన యుధిష్ఠిరుడయ్యాడు.

ఆయన జీవన యుధిష్ఠిరత్వానికి ప్రత్యక్ష నిదర్శనమే యక్ష ప్రశ్నలు 'ఘట్టం'.

'అనువుగానిచోట అధికులమనరాదు' అని ప్రపంచంలో అన్ని ప్రదేశాలలోను, జీవితంలో అన్ని సందర్భాలలోను మనదే పై చేయి అనుకోకూడదు. వనవాసంలో ఉన్న ధర్మరాజుకి, సోదరులకి దాహం అయితే నకులుణ్ణి పిలిచి నీళ్లు ఎక్కడైనా దొరుకుతాయోమో తీసుకురమ్మన్నాడు. అతను వెళ్లి ఒక సరోవరం చూశాడు. అందులో దిగి నీరు త్రాగబోయాడు. అంతలో ఒక యక్షుడు కొంగ రూపంలో వచ్చి అడ్డుకొని తన ప్రశ్నలకు సమాధానాలు చెబితేగాని నీరు త్రాగడానికి వీలు లేదన్నాడు. కొంగను అల్పజీవిగా భావించిన నకులుడు ఆ ఆదేశాన్ని ధిక్కరించి నీరు త్రాగబోయాడు. యక్షుని క్రోధానికి గురై మరణించాడు. సహదేవుడు, అర్జునుడు, భీముడు కూడా అదే దారిని త్రొక్కి, అదే అహంకారంతో అదే విధంగా మరణించారు. చివరకు ధర్మరాజు వెళ్లాడు.

సోదరుల శవాలు గమనించి దుఃఖించాడు. చుట్టూ ఉన్న పరిస్థితులు గమనించాడు. 'ఇది అనువుగాని ప్రదేశం. ఇక్కడ అధికులమనరాదు' అని నిశ్చయించుకొన్నాడు. కొంగలోని దివ్యత్వాన్ని అవగాహన చేసుకొని ప్రశ్నలకు జవాబులివ్వడానికి సిద్ధపడ్డాడు. జవాబులు చెప్తే ఒక్కరినైనా బ్రతికిస్తుందని కచ్చితంగా చెప్పలేం. అయినా 'ఆపదలందు ధైర్యగుణము' అన్నట్లుగా గుండెలు చిక్కబట్టుకొని తన ప్రయత్నం తాను చేశాడు.

మొత్తం వంద ప్రశ్నలకు పైగా ఉన్నా అన్నింటికీ ఓపికగా తన పరిజ్ఞానం మేరకు సమాధానాలు చెప్పాడు. అవి ఏ పుస్తకంలోనూ సమాధానం దొరకని ప్రశ్నలు. వాటికి ఏ కేంద్రంలోనూ శిక్షణ ఇవ్వరు. అవగాహనే గ్రంథం. అంతరంగమే శిక్షణ కేంద్రం.

భూమి కంటే గొప్పది ఏది? - తల్లి. ఆకాశం కంటే ఉన్నతుడు ఎవరు? - తండ్రి. జీవితాంతం తోడుండేది ఎవరు? - గుండె ధైర్యం.

ఇవీ ఆ సమాధానాలు. ఆ సమాధానాలకు సంతోషించిన యక్షుడు చివరిగా ఒక ప్రశ్న అడిగాడు. దానికి జవాబు చెబితే సోదరులలో ఒకరిని బ్రతికిస్తానన్నాడు. అక్కడికదే అదృష్టం అని అంగీకరించాడు ధర్మరాజు. చివరి ప్రశ్న చాలా ఆశ్చర్యకరమైనది.

అన్నింటికంటె ఆశ్చర్యకరమైనది ఏది? - 'రోజూ ఎంతో మంది మరణిస్తూ ఉంటే చూస్తూ కూడా మనం శాశ్వతం అనుకొని సంపదలు కూడబెట్టుకొంటున్నామే - ఇదీ అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం - అన్నాడు.

ఆశ్చర్యపోయిన యక్షుడు ధర్మరాజును అతి క్లిష్టమైన పరిస్థితిలోకి నెట్టాడు. ఇంతకీ నీ సోదరులు నలుగురిలో ఎవరిని బ్రతికించమంటావు అన్నాడు. ఇంతవరకు సమాచారానికి పరీక్ష. ఇప్పుడు సంస్కారానికి పరీక్ష.



ధర్మరాజు ఒక్క క్షణం ఆలోచించలేదు. 'నకులో యక్ష జీవతు' - నా తమ్ముడు నకులుణ్ణి బ్రతికించండి - అన్నాడు. ఇప్పుడాశ్చర్యపోవడం యక్షుని వంతయింది. అదేమిటయ్యా, అమాయక చక్రవర్తీ, భయంకరమైన యుద్ధాన్ని ముందు పెట్టుకొని పదివేల ఏనుగుల బలం కలిగిన భీముణ్ణి, పాశుపతాస్త్రం పొందిన పార్థుణ్ణి వదిలి నకులుణ్ణి కోరుకొంటున్నావేమిటి? అన్నాడు.

వెంటనే ధర్మరాజు గెలుపు గుర్రాల రాజకీయం తనకు తెలియదనీ, యక్షుడు నలుగురినీ బ్రతికిస్తే తనకు పరమానందమేననీ కానీ ఒక్కరినే కోరుకోమనడం వల్ల నకులుని కోరుకోవలసి వచ్చిందనీ స్థిరంగా చెప్పాడు.

"మా నాన్నగారికి కుంతి, మాద్రి అని ఇద్దరు భార్యలు. వారిలో మాద్రి చనిపోతూ తన కుమారులిద్దరినీ మా అమ్మ చేతిలో పెట్టి వెళ్లిపోయింది. కుంతి సంతానంలో పెద్దవాణ్ణి నేను బ్రతికే ఉన్నాను. మా పినతల్లి సంతానంలో పెద్దవాడు నకులుడు కాబట్టి అతను బ్రతకాలి. ఇంతకుమించి నాకు రాజకీయ సమీకరణాలు తెలియవు. నకులుణ్ణి నేను బ్రతికించగలిగితే మా తల్లులిద్దరికీ సమానంగా న్యాయం చేసినవాణ్ణవుతాను. రేపు మా అమ్మ ఏ సందర్భంలో కూడా మా పినతల్లి ముందు తలవంచుకోవలసిన పరిస్థితి రాదు. మా అమ్మ నా వల్ల ఈ లోకంలోనైనా, ఏ లోకంలోనైనా తలెత్తుకొని బ్రతకాలి గానీ తలదించుకొని బ్రతకకూడదు" అని ధర్మరాజు నిశ్చయంగా చెప్పేసరికి ఆశ్చర్యపడి, ఆనందించి యక్షుడు భీమార్జున నకుల సహదేవులు నలుగురినీ బ్రతికించాడు.

అంటే ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడి మన కర్తవ్యం ఏదో మనం చేస్తే ఆ పైన దైవానుగ్రహం సంపూర్ణంగా ఉంటుందన్నమాట. ఇదీ ధర్మరాజుని యుధిష్ఠిరుని చేసిన ఘట్టం.

ఈ వేళ పరీక్షల్లో నాలుగు జవాబులు ముందుండగా సరైన జవాబు గుర్తించడానికి ఒత్తిడికి లోనై, ఆందోళనకు గురై, విజయం సాధించలేక ఆత్మహత్యలకు సహితం సిద్ధపడుతున్న మన యువతరం యక్ష ప్రశ్నలు చదివి తీరాలి. ధర్మరాజు ముందు నాలుగు సమాధానాలు లేవు. నలుగురు తమ్ముళ్ల శవాలున్నాయి. అయినా తట్టుకొని నిలబడి అన్నింటికీ సమాధానాలు చెప్పి సమాచారంలోను, సదాచారంలోనూ కూడా తనకు సాటిలేరని నిరూపించుకొన్న జీవన యుధిష్ఠిరుడు, ఆదర్శ నాయకుడు ధర్మరాజు.



# 4. విరాటపర్వం - వేదాంత దర్శనం

క్రీ.శ. 11వ శతాబ్దంలో ప్రారంభమైన ఆంధ్ర మహాభారత రచన ఆంధ్రదేశంలో రెండు వందల ఏండ్లు ఆగిపోవడం ఆశ్చర్యకరమే కాదు, ఆందోళన కారకం కూడాను.

**"రెండు శతాబ్దముల్ హరిహరీ ! మృదులాక్షర మొందు వ్రాయలే**
**కుండిన దాంధ్రజాతి; మనమున్నది ఉన్నటులొప్పుకో వలెన్**
**పండిన పంట భారతము పట్టదుగా కవి వీరు లేరికిన్**
**గుండెలు తీయు బంట్లు మత కూటములన్ ఘటియించి నందునన్"**

**- (సాగర ఘోష - గరికిపాటి)**

ఒక ప్రక్క వీరశైవులు మరో ప్రక్క వీర వైష్ణవులు పోగై శివకేశవులకి ఎంత అప్రతిష్ఠ తేగలరో అంతా తెచ్చారు. అటు శివపారమ్యాన్నో, ఇటు విష్ణు పారమ్యాన్నో బోధిస్తూ కవిత్వం రాయాల్సిందే తప్ప, ఈ ఇద్దరు సమానమని ఎవడైనా అంటే ఇరువర్గాల వారు సమానంగా వచ్చి ఆ కవిని చితకగొట్టేసే పరిస్థితులవి.

**"చక్కనిమాట చెప్పగల సాహసి లే డొకవేళ చెప్పుచో**
**దక్కదు జీవితమ్ము; సరదాకయినన్ మత సామరస్యమన్**
**వాక్కు వినంబడంగ కరవాలము లాలము చేయు; నట్టిచో**
**తిక్కన పుట్టినాడు ఋషి తీర్థము పంచినవాడు జాతికిన్"**

**- (సాగర ఘోష - గరికిపాటి)**

ఆయన పంచిన ఋషి తీర్థమే హరిహరాద్వైతం. నిజానికి ఆయన సిద్ధాంతం శివకేశవుల మధ్య అద్వైతం మాత్రమే కాదు. సమస్త సృష్టిలోనున్న అద్వైతాన్ని

దర్శించడమే. మన దృష్టిలో భేదం ఉంది కానీ సృష్టిలో భేదం లేదన్న విషయాన్ని అనేక సందర్భాల్లో తన పద్యాల ద్వారా నిరూపించాడు.

విరాట పర్వంలో కీచకుడు తనను ఘోరంగా అవమానించిన తరువాత ద్రౌపది రాత్రికి రాత్రి నర్తనశాలలో భీముణ్ణి కలుసుకొంటుంది. తన బాధలు ఏకరువు పెట్టేముందు పాండవుల ఔన్నత్యాన్ని ప్రశంసిస్తూ మాట్లాడుతుంది. "ఎటువంటి వాళ్లు ఎలా బ్రతుకుతున్నారు" అన్నట్లుగా ఉంటుందా ఓదార్పు. ఆ మాటల్లో మాటగా అంతకుముందెప్పుడో పన్నెండేళ్ల క్రితం అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు కుంతి సహదేవుణ్ణి గురించి తనతో చెప్పిన మాటను గుర్తు చేస్తుంది.

**"కడు బసిబిడ్డ వీడొకటి గాదవునా నెరుగండు ముందరె**
**య్యెడ నొక పాటెరుంగ, దెద యెంతయు గోమల మెప్పుడైన నే**
**గుడువగ బిల్తు గాని తనకుంగల యాకటి బ్రొద్దెరుంగ డీ**
**కొడుకిటు వోకకున్ మనము గుందెడు నిన్గని యూరడిల్లెడున్"**

***(విరాట - 2-213)***

ఇవి ఒక తల్లి అందరిలోకి చిన్నవాడైన కొడుకుని విడిచిపెట్టి ఉండలేక అంటున్న మాటలు. అందుకే పద్యం అంతా కరుణరసమయంగా నడిచింది. అన్నీ అచ్చ తెలుగు మాటలే. 'కోమలం' అనే ఒకే మాట తత్సమం. అదీ మృదువైన మాటే. ఎక్కడా సంస్కృత పదాలే లేవు. ఇదీ తల్లి ప్రేమను వ్యక్తం చెయ్యాలంటే ఏ కవియైనా వాడవలసిన భాష. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అంటారు. అందుకే పెద్దవాడై పెళ్లయి కాపురం చేస్తున్న కొడుకును కూడా చాలా అమాయకుడనీ, ఏదైనా అడిగితే అవును, కాదు అనడం కూడా తెలియదనీ, ఇంతకు ముందెప్పుడూ ఎటువంటి కష్టమూ ఎరగడనీ, తాను పిలిచి పెట్టే వరకు కనీసం 'అన్నం పెట్టమ్మా' అని అడగడం కూడా చేతకాని వాడనీ



విచిత్రంగా మాట్లాడుతోంది. అంతలోనే కోడలితో మాట్లాడుతున్నాననే విషయం గుర్తుకు వచ్చిందేమో! అందుకే "ఇటువంటి పసివాడు అడవులు పట్టుకొని పోతూ ఉంటే మనస్సు అతలాకుతలమైపోతోంది. అయినా నువ్వున్నావు కాబట్టి కొంత నిశ్చింతగా ఉంది. అని ద్రౌపది పట్ల అఖండమైన విశ్వాసం ప్రకటించింది. ఇదీ సంభాషణా నైపుణ్యం.

అదే సహదేవుణ్ణి గురించి అదే సందర్భంలో ద్రౌపది తన సొంత అభిప్రాయాలు చెబుతుంది. పై పద్యానికి నాలుగు పద్యాల వెనుకనే ఆ పద్యం కూడా ఉంది.

**"ఆ రూపం బవికార, మాభుజబలం బత్యంత నిర్గర్వ, మా**
**శూరత్వంబు దయారసానుగత, మా శుంభత్క్రియాజ్ఞాన మా**
**ర్యారంభ ప్రతికూల వాదరహితం, బాయీగి సమ్మాన వి**
**స్తారోదాత్తము మాద్రి పిన్నకొడు కేతన్మాత్రుడే చూడగన్"**

***(విరాట - 2-209)***

ఈ పద్యాన్ని కుంతి పలికిన పద్యంతో పోల్చి చూడండి. పూర్తిగా భిన్నంగా ఉంటుంది. భావాలు, భాష కూడా చాలా తేడాగా ఉన్నాయి. ఎందుకంటే అది కుమారుని గురించి తల్లి భావన. ఇది భర్త గురించి భార్య భావన. ఏ భార్యయైనా తన భర్తని అమాయకుడని, వెర్రిబాగులవాడని అంటే ఒప్పుకోదు. అలా ఉండాలని కోరుకోదు. భార్యకు కావలసింది భర్త రూపం. అందుకే 'ఆ రూపం బవికారము' అని సహదేవుని రూపం బాగుంటుందని చెప్పింది. తల్లికి రూపంతో నిమిత్తం లేదు. అందుకే అక్కడ 'కడు పసిబిడ్డ'. భార్య భర్తలో గొప్ప నాయకత్వ లక్షణాలన్నీ ఉండాలని కోరుకొంటుంది. అందుకే అతని భుజభలం గురించి ప్రశంసించింది. బలం ఉంటే మంచిదే కానీ గర్వం ఉండ కూడదని భార్య కోరుకొంటుంది. ఉంటే తనకీ ప్రమాదమే. అందుకే సహదేవుని

నిగ్రహాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పింది. భర్త శూరుడు కావాలని కోరుకున్నా భార్య కూడా మరీ రౌడీలా ఉంటే సహించలేదు. అందుకే అతడు శూరుడే కానీ దయారసానుగతుడని చెప్పింది. తన భర్త పదిమందీ మెచ్చుకొనేలా అన్ని పనులు నిర్వహించగలగాలని (Managing Ability) కోరుకొంటుంది. అంతేకానీ 'మా ఆయనకి ఔను, కాదు అనడం కూడా తెలియదు, బొత్తిగా నోట్లో వేలు పెడితే కొరకలేదు" అని ఏ భార్యా చెప్పదు. అలా చెబితే 'వెర్రాడి పెళ్లాం వాడకెల్లా వదిన' అన్నట్లుగా చుట్టుప్రక్కల వాళ్లకి ఆమె లోకువై పోతుంది. అందుకే సహదేవుని క్రియాజ్ఞానం (Working Knowledge) గొప్పదని చెప్పింది. మొత్తం మీద సహదేవుడు అసాధారణ ప్రజ్ఞాశాలి అని తేల్చింది. తల్లి మాటలకీ, భార్య మాటలకీ ఎంత తేడా ఉందో చూడండి. ఆ తేడా ఆ స్థానాల్లో ఉన్న స్త్రీల మనోభావాలను బట్టే ఏర్పడుతుంది. ఈ భేదాన్ని భావంలోనే కాదు, భాషలో కూడా చూపించడం తిక్కన గొప్పదనం. పద్యం మొత్తం సంస్కృత సమాస భూయిష్ఠంగా నడిచింది. 'ఈగి, పిన్నకొడుకు, చూడగన్' వంటి మాటలు తప్ప మిగిలిన పద్యమంతా సంస్కృత సమాస బంధురమై గంభీరమైన శైలిలో నడిచింది. ఈ శైలి భార్య భర్తను గురించి వ్యక్తం చేసే ఉదాత్త గంభీర భావాలకు సరిగ్గా తగినది. సందర్భాన్ని బట్టి భాషలో ఈ భేదాన్ని అడుగడుగునా చూపించి సంస్కృత ప్రేమికులైన కవి పండితులను, ఆంధ్రాభిమానులైన రసజ్ఞులను ఇద్దరినీ మెప్పించబట్టే తిక్కనను ఉభయకవి మిత్రుడన్నారని పెద్దలు పేర్కొన్నారు.

ఈ ఉభయ భాషా ప్రావీణ్యం ఇంతటితో ఆగలేదు. రెండు భాషల పదాలు సమానంగా కలిసిన మిశ్రశైలిలో కూడా ఈయన సహదేవుని గుణగణాలు చెప్పించాడు. అలా చెప్పడానికి తగిన పాత్రగా అన్నగారైన ధర్మరాజుని ఎంచుకున్నాడు. విరాటపర్వంలోనే ఈ పద్యం కూడా ఉండటం విశేషం. అజ్ఞాతవాసానికి ముందు చిన్నవాడైన సహదేవుడు ఇతరుల దగ్గర సేవకునిగా ఎలా బ్రతకగలుగుతాడోనని ధర్మరాజు చింతిస్తూ పలికిన సందర్భం అది.



**"అకుటిలుడార్య సమ్మతుడహంకృతి దూరుడు నీతినిర్మలా**
**త్మకు డనవద్య శీలుడు సధర్ముడు దాంతుడు గొంతి పెద్దసే**
**యు కొడుకు, మేనులేత, దనయుల్లము మెత్తన యిట్టి యీతడె**
**ట్లొకొ యొరు నాశ్రయించు విధి యోపదె యెవ్వరి నెట్లు సేయగన్"**

**(విరాట - 1-98)**

ఈ పద్యంలో ఒక అన్నగారు తమ్ముడి నుండి ఏ లక్షణాలు ఆశిస్తాడో అవన్నీ ఉన్నాయి. తమ్ముడి బుద్ధి మంచిదై ఉండాలి. అందుకే 'అకుటిలుడు' అనే మాట. తమ్ముడు పదిమందిలో ఔననిపించుకోవాలి. అందుకే 'ఆర్య సమ్మతుడు' అనే మాట. ఏ మనిషయినా ఇంట్లో 'భార్యసమ్మతు'డవడం ఎంత ముఖ్యమో బయట ఆర్య సమ్మతుడవడం అంత ముఖ్యం. తమ్ముడు ఎంత గొప్పవాడయినా గర్వం ఉండకూడదనీ అన్నగారుగా తనను గుర్తించి గౌరవిస్తూనే ఉండాలని ప్రతి అన్నగారు కోరుకొంటాడు. మనం మన అన్నగారి కంటే ధనవంతులం కావచ్చు. అందమైన వాళ్లం కావచ్చు. పండితులం కావచ్చు. పదవుల్లో ఉండవచ్చు. కాని వయస్సులో ఆయన్ని మించలేము. అది అసాధ్యం. అందుకే సందర్భం వస్తే మనమే అన్నగారి కాళ్లకి నమస్కారం చెయ్యాలి కానీ ఆయన మనకు నమస్కారం చెయ్యకూడదు కదా! (అది ఆయుక్షీణం కూడాను!) ఇందుకోసమే 'అహంకృతిదూరుడు' అని ప్రయోగించాడు. ఇలాంటివే 'నీతి నిర్మలాత్మకుడు, అనవద్యశీలుడు, సధర్ముడు, దాంతుడు మొ॥నవన్నీ. ఇంతవరకు సంస్కృత పదాలు ఉపయోగించిన తిక్కన ఒక్కసారిగా అచ్చ తెలుగులోకి దిగి 'గొంతి పెద్ద సేయు కొడుకు, మేను లేత, తన యుల్లము మెత్తన' అంటూ సుతిమెత్తగా మాట్లాడాడు. వాళ్ల అమ్మకు సహదేవుడి మీదే ఎక్కువ ప్రేమ అని ప్రత్యేకంగా చెప్పాడు. ఇంక 'మా వాడి శరీరమూ మెత్తనే, మనస్సు మెత్తనే' అనడం 'మనసః శిఖరాణాంచ సదృశీ తే సమున్నతిః' అనే కుమార సంభవ ప్రయోగం లాంటిది.

ఈ పద్యంలో గంభీర భావ వ్యక్తీకరణకు తత్సమపదాలు వాడి సుకుమార భావాలు చెప్పడానికి అచ్చ తెలుగు పదాలు వాడటం కూడా ఆయనలోని ఉభయ కవితా ప్రౌఢినే సూచిస్తుంది. సరిగ్గా పద్యంలో రెండు పాదాలు ఒక శైలిలో, రెండు పాదాలు మరో శైలిలో నడపడం దృష్టి భేదానికి తగినట్లుగా కవితా సృష్టి భేదాన్ని చూపించడమే.

ఒకే సహదేవుడు ముగ్గురికి మూడు విధాలుగా ఎందుకు కనిపించాడు? ఈ విషయం కాస్త లోతుగా ఆలోచిస్తే భారతంలో తిక్కన దర్శింపజేసిన అద్వైతం అర్థమవుతుంది. వ్యక్తి ఒక్కడే. అతన్ని చూసినవాళ్లు మాత్రం ముగ్గురు. ముగ్గురికీ మూడు విధాలుగా ఎందుకు కనబడ్డాడు? అది వాళ్ల దృష్టిలో భేదం. అసలు అతనిలో వీళ్ల ముగ్గురూ చెప్పిన లక్షణాలు అన్నీ ఉన్నాయా? అన్నీ ఉన్నాయి. పరస్పర వ్యతిరేకమైన లక్షణాలు కూడా ఉన్నాయి. అతడు ఔను, కాదు అని చెప్పలేనంత అమాయకంగానూ ఉండేవాడు. పెద్దలందరు భేష్ అనేంత కార్యజ్ఞానమూ కలిగి ఉండేవాడు. కాకపోతే ఎవరి దగ్గర ఏ లక్షణం ఏ మోతాదులో ప్రదర్శించేవాడో అంతే ప్రదర్శించేవాడు. అందుకే అందరికీ ప్రేమపాత్రుడయ్యాడు. ఇదే యోగి లక్షణం. ఏ లక్షణాన్ని అతిగా ప్రదర్శించకుండా (ఓవర్ యాక్షన్) నిగ్రహంగా ఉంటే జీవితంలో నెగ్గుకు రాగలుగుతాం. ఆత్మ సాక్షాత్కారం కూడా పొందగలుగుతాం. మొత్తం మీద కుంతి, ద్రౌపది, ధర్మరాజులు ఏ దృష్టితో సహదేవుణ్ణి చూశారో ఆ రకమైన అభిప్రాయాలే చెప్పారు. ఈ దృష్టితో చూస్తే ప్రపంచంలోని ప్రతి వస్తువు మన దృష్టి భేదం వల్లనే వేర్వేరుగా కనిపిస్తోందని అర్థమవుతుంది. ఇంకొకరికి మంచిగా కనిపించినవాడు మనకి చెడ్డగా కనిపిస్తున్నాడంటే మన దృష్టిలోనైనా భేదం ఉండాలి. అతడు మన పట్ల భిన్నంగానైనా ప్రవర్తిస్తూ ఉండాలి. అంటే అతని దృష్టిలోనైనా భేదం ఉండి ఉండాలి. మొత్తం మీద మన దృష్టి భేదం వల్లనే ఇంత సృష్టి ఇన్ని రకాలుగా



కనబడుతోందనీ నిజానికది ఒక్కటే అనీ తెలియజేయడమే మన మహాకవుల ఆశయం.

ఇదే రకమైన దృష్టిభేదం విరాటపర్వం చివరలో కూడా తిక్కనగారు కౌరవ సైన్య వర్ణన రూపంలో ప్రదర్శించారు. బృహన్నల సారథ్యంలో బయలుదేరిన ఉత్తరుడు ప్రగల్భాలు పలికాడు కానీ భయపడుతూనే బండెక్కాడు. అతని మనస్సు నిండా భయమే. మన మనస్సును బట్టే ప్రపంచంలోని దృశ్యాలు మనకి కనిపిస్తూ ఉంటాయి. అతని మనస్సులో ఉన్న భయమే కౌరవ సైన్యాన్ని భయంకరంగా చూపించింది. ఉత్తరుడు దర్శించిన కౌరవ సైన్యాన్ని కవిబ్రహ్మ ఏ విధంగా వర్ణించాడో చూడండి.

**"భీష్మద్రోణకృపాది ధన్వి నికరాభీలంబు, దుర్యోధన**
**గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకీర్ణంబు శస్త్రాస్త్రజా**
**లోష్మస్ఫార చతుర్విధోజ్వల బలాత్యుగ్రం బుదగ్రధ్వజా**
**ర్చిష్మత్వాకలితంబు సైన్యమిది యే జేరంగ శక్తుండనే" !**

**(విరాట - *4-52*)**

భీష్మద్రోణకృపాశ్వత్థామాది విలుకాండ్రతో, దుర్యోధనుడనే గ్రీష్మాదిత్యుని చండప్రచండ ప్రతాపంతో, వేడి ఆవిరులు గ్రక్కే ఆయుధాలతో, కళ్లు మిరుమిట్లు గొలిపే జెండాల కాంతులతో భయంకరంగా ఉందట. ఇంత భయంకరమైన సైన్యాన్ని వర్ణించాలి కాబట్టే సోమయాజిగారు ష్మకార ప్రాసతో పద్యం ఎత్తుకున్నారు. సుదీర్ఘ సంస్కృత సమాసాలతో ఎత్తుగడ నుండి క్రిందికి దింపే వరకు ఒకే రకమైన నారి బిగింపులా పద్యం నడిపించారు. ఇలాంటి రచన ఒక్క ఉభయ కవి మిత్రునకే సాధ్యమేమో!

ఉత్తరుడి దృష్టికి ఇంత బీభత్సంగా కనబడిన కౌరవసైన్యం అసలైన బీభత్సుని దృష్టికి మరో రకంగా కనబడింది. అక్కడ తిక్కనగారి పద్యనిర్మాణ ధోరణే వేరు.

**"ఇది యొక పెద్దగట్టిమొన, ఈ మొన ముందట గోగణంబుతో**
**నది యొక యల్పసైన్యమట - యాతల వేరొక కొంతసేన, య**
**ల్లదె యిటుపంచి పెట్టజను, నంతటిలోన వృథాభిమాన దు**
**ర్మద బహుభాషియైన కురురాజెచటన్ జనుచున్న వాడొకో!"**

**(విరాట - 4-245)**

ఇది అర్జునుని దృష్టి. మాములు అర్జునుని దృష్టి కాదు. మాయాబజార్ లక్ష్మణుడు చెప్పినట్లు 'అర్జున ఫల్గుణ పార్థ కిరీటి బీభత్స బాబాయి'గారి దృష్టి. ఆయన ఇదివరకే ఆ సైన్యాన్ని మూడు నాలుగు సార్లు ఎదుర్కొని మట్టిగరిపించిన వాడు. అందుకని ఆయన దృష్టిలో అది అల్పసైన్యం. పెద్దలెక్కలోది కాదు. అందుకే తిక్కనగారు పద్యం మొదట్లో చాలా మాములు పదాలను 'ఇది యొక పెద్ద గట్టిమొన' అంటూ ప్రయోగించాడు. 'భీష్మద్రోణకృపాది ధన్వి' అనేంతటి బీభత్సం ఇక్కడేమీ లేదు. అంతేకాదు, అర్జునుడు ఆ సైన్యాన్ని మొత్తంగా ఒక్కసారి చూడలేదు. ముక్కలు ముక్కలుగా చూస్తున్నాడు. అందుకే అతనికి భయం వెయ్యకపోగా ఆ ముక్కల్ని ఇంకా ముక్కముక్కలు చేసెయ్యగలననే ధైర్యం పెరిగింది. జీవితంలో ఎదురయ్యే ఏ సమస్యలయినా అంతే. సమస్యను భాగాలుగా చేసి చూస్తే ఏ ముక్కకు ఆ ముక్కనే విడిగా సులభంగా ఛేదించవచ్చు. మనలో చాలా మందిమి అలా చూడం. సమస్య ఏర్పడగానే దానికి చిలవలు పలవలు కల్పించి దాన్ని భూతద్దంలో చూస్తాం. ఎన్నడో మరుగున పడిన



గతకాల ఘట్టాలతో ఆ సమస్యను ముడిపెట్టి మరింత పెద్దది చేసేస్తాం. మన మనస్సులో ఉండే భయాల కారణంగా అది పరిష్కరించలేనంత పెద్దదిగా మనకి కనిపిస్తుంది. దాంతో భయం మరింత ఎక్కువవుతుంది. ఉత్తరుని పరిస్థితి సరిగ్గా అదే. అంతఃపురంలో ఉండగా గవాధ్యక్షుడు వచ్చి కౌరవసైన్యం గోవర్గాన్ని ముట్టడించింది అన్నప్పుడు ఉత్తరుడు ఆ సైన్యాన్ని తక్కువ అంచనా వేశాడు. అదొక భ్రమ. ఆ భ్రమలో పడి అనవసరపు గర్వం ప్రదర్శించాడు. తీరా యుద్ధరంగానికి వచ్చేసరికి సైన్యాన్ని దూరంగా మొత్తంగా చూసి ఎక్కువ అంచనా వేశాడు. కాబట్టి అధైర్యానికి లోనయ్యాడు. కాని పార్థుడు అంతఃపురంలో బృహన్నలగా గాని, ఆహవరంగంలో అర్జునునిగా గాని భ్రమల్లో పడలేదు. అందుకే అక్కడ గర్వమూ లేదు. ఇక్కడ అధైర్యమూ లేదు. అందుకే సైన్యాన్ని భాగాలు భాగాలుగా చూసి "ఇదొక పెద్ద సైన్యమే, కాని ముక్కలు ముక్కలుగా విడిపోయినట్లుంది. అదిగో! గోవులను తీసుకొని పోతున్నదో భాగం. ఆ మూల మరో భాగం. ఆ భాగంలోంచి కొంత భాగాన్ని మనల్ని ఎదిరించడానికి ఇటు పంపిస్తున్నారు" అంటూ శత్రువుల బలహీనతను గుర్తించి నవ్వుకున్నాడు. ఇదంతా ఉత్తరార్జునుల దృష్టిలో భేదమే తప్ప మరోటి కాదు. దాడి చేసినప్పుడు, అంతఃపురంలో చర్చలప్పుడు, ఉత్తర బృహన్నలు బయలుదేరినప్పుడు, ఉత్తరుడు చూసినప్పుడు, అర్జునుడు చూసినప్పుడు అక్కడ ఉన్న కౌరవసైన్యం ఒక్కటే. క్రొత్తగా ఒకడు చేరిందీ లేదు. పాతవాడొకడు పోయిందీ లేదు. కాని అదే సైన్యం విషయంలో ఒకడు ఒకసారి నిర్లక్ష్యం చూపడానికి, ఇంకోసారి భయపడడానికి, మరొకడు ఒకసారి ఉదాసీనంగా ఉండటానికి, మరోసారి ఉత్సాహపడటానికి కారణం ఆయావ్యక్తుల దృష్టిలో భేదమే తప్ప సృష్టిలో భేదం కాదు. ఇదే వేదాంత దృష్టి. ఆ దృష్టిని కలిగించడమే కవిబ్రహ్మ లక్ష్యం.

'ఇది యొక పెద్ద గట్టి మొన' అనే పద్యంలో చివరివరకు తేలికైన తెలుగు పదాలు వాడిన ఉభయకవి మిత్రుడు నాలుగో పాదంలో ఒక్కసారిగా శైలి మార్చేసి "వృథాభిమాన దుర్మద బహుభాషియైన కురురాజెచటన్ జనుచున్న వాడొకో" అంటూ తక్కున సంస్కృత సమాసం అందుకొన్నాడు. ఇది గొప్ప మనోవిశ్లేషణాత్మకమైన ప్రయోగం. కౌరవ సైన్యాన్ని ముక్కముక్కలుగా చీల్చి చెండాడాలనే దృష్టిలో ముక్కముక్కలుగానే చూస్తూ చిద్విలాసంగా ఉత్తరునికేసి చూస్తూ నవ్వుతున్న అర్జునునికి ఒక్కసారిగా ఈ యుద్ధానికి కారణమైన దుర్యోధనుడు గుర్తు వచ్చాడు. అంతే! ఒక్కసారిగా ఒళ్లు మండిపోయింది. తోకత్రొక్కిన త్రాచులా కస్సుమని బుసకొట్టింది మనస్సు. అలా పైకి లేచి బుసకొట్టిన మనస్సుకి వాగ్రూపం కల్పిస్తే పై వాక్యంలా ఉంటుంది. అదీ కవిబ్రహ్మ పలుకుబడి. ఇదే నాటకీయత అంటే. ఎప్పటికప్పుడు పాత్రల మనఃప్రవృత్తులలో కలిగే మార్పుల్ని చురుకుగా పసిగట్టి దానికి తగిన పద్యనిర్మాణం చెయ్యడం ఆయనకు గంటంతో పండించే పంట.

ఒకే అర్జునునికి ఒకే సైన్యం ఒక సమయంలో చాలా లోకువగా ముక్కముక్కలుగా కనిపించడం, ఒక్క క్షణం కాగానే దుర్యోధనుడు గుర్తు రాగానే ఆ సైన్యం అంతా దృష్టిపథంలోంచి చెదిరిపోయి మొత్తం సైన్యం ఒక్క దుర్యోధనుడి రూపమే ధరించినట్లయి అతన్ని రెచ్చగొట్టడం, అలా రెచ్చిపోయిన ఫల్గుణుడు కస్సుమని లేవడం ఇదంతా దృష్టిభేదమే.

విరాటపర్వమే కాదు, మొత్తం భారతాన్ని ఈ దృష్టితో పరిశీలిస్తే ఆ గ్రంథం ఒక అద్భుత అద్వైత దర్శనంగా కనబడుతుంది. అందుకే ఆదికవి ఆదిలోనే 'అధ్యాత్మవిదులు వేదాంతమనియు' భారత మహేతిహాసాన్ని భావిస్తారని పేర్కొన్నాడు. సృష్టిలో భేదం లేదనీ, మన దృష్టిలోనే అంతా ఉందనీ



గ్రహించగలిగితే ఆ దృష్టిని మార్చుకోవడం మన చేతిలో పనే.

అలా దృష్టిని మార్చుకోగలిగితే కొన్నాళ్లకి ద్రష్ట-దృశ్యము-దర్శనం ఒక్కరే అని అర్థమవుతుంది. అదే ఆత్మసాక్షాత్కారం. అందుకే ఈ కావ్యాలు, కథలు అన్నీను.

**"చూచెడి దెల్ల మిథ్య, కనుచూపును మిథ్యయె; నిన్ను నీవుగా**
**చూచెడిదాక ఈ జగతి జూచెడిదెల్ల వృథా, వృథా, వృథా**
**చూచెడి చూపు వెన్కగల చూపును శోధన చేయు మయ్యదే**
**చూచిన నింకలోకమున చూచెడిదేమి? సమస్త మయ్యదే.**

**(సాగరఘోష - గరికిపాటి)**

## 5. అర్జునుడే కాదు; అశ్వాలూ విన్నాయి!

పోతన గారి భాగవతంలో ఒక చిత్రమైన పద్యం ఉంది. అది ప్రథమ స్కంధంలో భీష్మ స్తవంలో ఉంది. భీష్ముడు అంపశయ్య మీద ఉండి శ్రీ కృష్ణుని స్తుతిస్తూ చెప్పిన పద్యం అది.

**"హయరింఖాముఖ ధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై**
**రయజాత శ్రమతోయ బిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో**
**జయమున్ పార్థునకిచ్చు వేడ్క నని నాశస్త్రాహతిన్ చాలనొ**
**చ్చియు బోరించు మహానుభావు నెదలో జింతింతు నశ్రాంతమున్"**

ఈ పద్యంలో శ్రీ కృష్ణుని ముఖారవిందాన్ని వర్ణిస్తున్నాడు భీష్ముడు. యుద్ధరంగంలో తొమ్మిదో రోజు యుద్ధ దృశ్యాల్ని మళ్లీ ఒక్కసారి ఊహించుకొంటున్నాడు. ఆ రోజు భీష్ముడు విజృంభించి యుద్ధం చేశాడు. యుద్ధరంగంలోకి శూలం ధరించి వచ్చిన ప్రళయకాళరుద్రుడిలా ఉన్నాడు. పార్థసారథి అతివేగంగా రథం నడుపుతున్నాడు. అర్జునుడు యథాశక్తి భీష్మునితో పోరాడుతూ, సారథియైన కృష్ణుణ్ణి కాపాడుతూ తనని తాను కాపాడుకొంటున్నాడు. ఆ స్థితిలో శ్రీకృష్ణుణి ముఖపద్మం ఎలా ఉందో గమనించిన భీష్ముడు ఆ దృశ్యాన్ని మరచిపోలేక మళ్లీ గుర్తు చేసుకొంటున్నాడు.

అతివేగంగా పరిగెడుతున్న అర్జునుని గుర్రాల కాలిగిట్టల నుండి రేగిన ధూళి గోవిందుని నుదుటి మీద పడుతోందట. అప్పటికే బాగా చెమట పట్టిన ఆ నుదుటి మీద ముంగురులు (అలకలు) గుండ్రం, గుండ్రంగా గిరజాలు గిరజాలుగా అతుక్కొని ఆ ఫాలభాగం ఎంతో అందంగా ఉందిట! అటువంటి నుదుటి మీద గుర్రాల గిట్టల దుమ్ము పడి ఆ ముఖానికి అదో అలంకారంలా ఉందట!



ఇక్కడే కాస్త ఆగి ఆలోచించాలి. అసలే యుద్ధరంగం, బీభత్స దృశ్యాలు. భయంకర స్థితి. వేగం, గాలి, ధూళి కళ్లు కప్పేస్తూ ఉంటాయి. ఈ స్థితిలో చెమటతో దుమ్ము కొట్టుకొని ఉన్న ముఖం - ఎంత భగవంతుడిదైతే మాత్రం అంత అందంగా ఉంటుందా? పైగా ముఖం మీద పడిన దుమ్ము ఆ ముఖం అందాన్ని పెంచే ఆభరణం కావడమేమిటి? అనౌచిత్యంగా లేదూ?

మనకి అలా ఉండవచ్చు. కాని పరమాత్మకు అలా ఉండదు. ఎందుకంటే ఆయన ఆ ధూళిని అలంకారంగానే భావించాడు. మన మనోభావాలను బట్టే మన ముఖం ఉంటుంది. మనం విపరీతమైన ఆనందంతో నవ్వుతుంటే కూడా కళ్ల వెంట నీళ్లొస్తాయి. అవి దూరం నుండి చూసే వారికి కన్నీళ్లలా కనిపించవచ్చు. కాని మన ఆనందబాష్పాలు మనకి తెలుసు. ఎందుకంటే ఆ సమయంలో మన మనస్సులో ఉన్నది ఆనందమే కాని దుఃఖం కాదు. అలాగే గుర్రాలు గిట్టల ద్వారా పరమాత్మ నుదుటి మీద దుమ్ము చిమ్ముతుంటే ఆయన ఆ ధూళిని నవ్వుతూ స్వీకరించాడు. అందుకే అది అలంకారమయింది.

ఎందుకలా స్వీకరించాడని ఆలోచిద్దాం. ఆయన భగవద్గీతలో ఏం చెప్పాడు? **"కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన"** అన్నాడు. అంటే మనం పనిచేస్తూనే ఉండాలి. కాని ఆ పని వల్ల వచ్చే ఫలితం ఏదయినా భగవదర్పణ బుద్ధితో ఆ పని చెయ్యాలి. సరిగ్గా ఆశ్వాలు అదే పని చేశాయి. ఆశ్వాల పని ఏమిటి? సారథి చెప్పినట్లు విని పరుగు పెట్టాలి. అవి పాండవుల పక్షంలో ఉన్నా, కౌరవ పక్షంలో ఉన్నా వాటిపని పరుగు పెట్టడం మాత్రమే. ఒకవేళ రథికుడు యుద్ధం మధ్యలో వెనక్కి పారిపోదలిస్తే, సారథి అలాగే నడిపిస్తే, అశ్వాలు ఇంటికే పరుగెత్తాలి కాని సారథి అటులాగితే, అశ్వాలు ఇటు లాగితే ఇక కథ నడిచేదెట్లా? అర్జునుడి అశ్వాలు శ్రద్ధగా, భక్తిగా పార్థసారథి ఎలా నడిపిస్తే అలా నడిచాయి. తత్ఫలితంగా రేగిన దుమ్మును ఆయనకే అర్పించాయి. అంటే కర్మఫలాన్ని భగవదర్పితం చేశాయి. కాబట్టే భగవంతుడు దాన్ని అలంకారంగా భావించి

స్వీకరించి వాటిని అనుగ్రహించాడు. అందుకే ఆయన ఫాలభాగం దుమ్ముతో ఉన్నా ప్రకాశించింది. అంటే మన శక్తి కొలది మనం జీవితంలో ధర్మనిర్వహణ చేస్తూ తప్పులాన్ని భగవంతుడికి అర్పిస్తే ఆయన దాన్ని అలంకారంగా భావించి స్వీకరించి మనల్ని ఆశీర్వదిస్తాడన్నమాట.

ఇంతకీ అశ్వాలకి ఇంత అవగాహన ఎక్కడిది? అర్జునుడితో పాటు గీతోపదేశ సమయంలో అశ్వాలు కూడా అక్కడ ఉన్నాయి. అవీ విన్నాయి. మరి వాటికి గీతలో భాష అర్థమవుతుందా? మన భాష అర్థం కాదు. కాని భగవంతుడి భాష అన్ని జీవులకి అర్థం అవుతుంది. అది హృదయాల మధ్య సాగే మౌన మహాప్రవాహం.



## 6. 'అహం' పోయేవరకు అంపశయ్య తప్పదు

కొద్దో గొప్పో దేవుడిపట్ల ఆసక్తి, రక్తి, భక్తి కలగగానే కొంతమంది తమకేవో ప్రయోజనాలు కలుగుతున్నట్లు, తమ ఇంట్లో ఏవో మహిమలు జరుగుతున్నట్లు, తాము ఏది అంటే అది అయిపోతున్నట్లు ప్రక్కవాళ్ళతోనూ (వీలయితే) పత్రికల వారితోనూ చెప్పేసి ప్రచారం చేసేసుకోవడం మొదలుపెట్టేస్తారు. కానీ దైవానుగ్రహం మనమీద ప్రసరించడం ఎంత కష్టమో భాగవతంలో 'భీష్మస్తుతి'లో ఏ పద్యం చదివినా అర్థం అవుతుంది.

**కుప్పించి యెగసిన గుండలంబుల కాంతి**
**గగన భాగంబెల్ల గప్పికొనగ**
**ఉరికిన నోర్వక నుదరంబులో నున్న**
**జగముల వ్రేగున జగతి కదల**
**చక్రంబు దోతెంచి చనుదెంచురయమున**
**బైనున్న పచ్చని పటముజార**
**నమ్మితి నాలావు నగుబాటు సేయక**
**మన్నింపుమని క్రీడి మరల దిగువ**

**కరికి లంఘించు సింగంబు కరణి మెరసి**
**నేడు భీష్ముని చంపుదు నిన్నుగాతు**
**విడువు మర్జున" యనుచు మద్విశిఖవృష్టి**
**దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు**

ఈ పద్యంలో ఎంత లోతైన భావం ఉందో, ఎన్ని తాత్త్విక విశేషాలున్నాయో పరిశీలిస్తే 'మతి'పోతుంది. మోక్షానికి కావలసింది ఆ 'మతి' పోవడమే కదా!

శ్రీకృష్ణుడు రథం నొగలు మీంచి కుప్పించి క్రిందికి దూకాడట. అప్పుడు ఆయన కుండలాల కాంతి ఆకాశమంతా క్రమ్మేసిందట. ఇది కేవలం కవితామయమైన అతిశయోక్తి కాదు. శ్రీ కృష్ణుడెవరో కాదు; సాక్షాత్తు లలితాదేవి. శ్రీ మహావిష్ణువు యొక్క స్త్రీ రూపమే పార్వతీదేవి. పార్వతీ దేవి యొక్క పుం రూపమే విష్ణువు. ఇందుకు ప్రమాణం లలితా సహస్ర నామాలే. 'నారాయణీ నాదరూపా నామరూప వివర్జితా' అనే నామాల్లో 'నారాయణి' అనే పేరు ఈ ఏకత్వాన్నే సూచిస్తుంది. అంతే కాకుండా 'గోప్త్రీ గోవింద రూపిణీ' అని కూడా ఉంది. 'గోవిందుడు' అనే పేరు దశావతారాల్లో ఒక్క శ్రీ కృష్ణునికే వాడేరు. అందువల్ల లలితాదేవియే శ్రీ కృష్ణుడు. శ్రీ కృష్ణుడే లలితాదేవి. ఆ జగన్మోహన సౌందర్యానికి కారణం ఈ సౌందర్యలహరియే.

లలితాదేవి కుండలాలెలా ఉంటాయో సహస్ర నామాల్లో స్పష్టంగానే ఉంది. 'తాటంక యుగలీభూత తపనోడుపమండలా' అని అమ్మవారి కుండలాలను వర్ణించాడు. తపన మండలం అంటే సూర్యమండలం. ఉడుప మండలం అంటే చంద్రమండలం. సూర్యచంద్రుల కాంతి ఆకాశాన్ని కప్పివేయడం మనం అహర్నిశలూ చూస్తున్నదే. శ్రీకృష్ణుడు ఆ ఆదిపరాశక్తి యొక్క పుంరూపమే కాబట్టి ఆయన కుండలాల కాంతి కూడా గగన భాగమంతా కప్పివేసిందని కవి అంతర్దృష్టితో చమత్కరించాడు. ఇదీ ఇందులోని తాత్త్వికత.

అదలా ఉంచితే రెండవ పాదంలో **'ఉరికిన నోర్వక ఉదరంబులో నున్న జగముల వ్రేగున జగతి కదల'** అని వర్ణించడంలో మరో విశేషం ఉంది. క్రిందికి ఒక్కసారిగా దూకేసరికి పరమాత్మ గర్భంలో ఉన్న లోకాలు కదిలి పోయాయట. ఆ బరువుకి, ఆ కుదుపుకి బయటిలోకం కూడా కదిలి పోతున్నట్లుందట. అంటే బయట ఉన్న లోకం పోను మిగిలిన పదమూడే లోపల ఉన్నాయా? ఈ అభిప్రాయం నవ్వు తెప్పించినా - బయట లోకం ఏమిటి? లోపలి లోకాలేమిటి? అన్ని లోకాలు గర్భంలో ఇముడ్చుకొన్న పరమాత్మ మళ్ళీ ఒక రూపం ధరించి ఉపాధిగతుడై తన లోపలనున్న లోకాల్లో తానే



సంచరిస్తూ బయట ప్రత్యేకంగా సంచరిస్తున్నట్లు కనిపించడమేమిటి? - ఇవన్నీ సందేహాలే. ఈ సందేహాలు పోయి అద్వైత స్థితిని అవగాహన చేసుకొంటే తప్ప మోక్షం రాదు. మోక్షాన్ని పొందకుండా మాములుగా చనిపోవడం, మరో జన్మ ఎత్తడం భీష్మునికీ ఇష్టం లేదు. కృష్ణునికీ ఇష్టం లేదు. అందుకే చక్రాయుధుడు ఎత్తిన చక్రాన్ని వెనక్కి తీసేసుకున్నాడు.

ఇది కూడా అలా ఉంచితే చివర ఎత్తు గీతిలో అసలు రహస్యం దాగి ఉంది. **"మద్విశిఖవృష్టి తెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు"** అంటున్నాడు భీష్ముడు. అంటే 'నా బాణాల దెబ్బలకు తట్టుకోలేక ఆయుధం పట్టాడని' అర్థం. దీనికంటె కొంచెం ముందు పద్యంలో కూడా 'అని నా శస్త్రాహతింజాల నొచ్చియు' అనే అంటాడు. అంటే ఇన్నేళ్లు బ్రహ్మచర్యం పాటించినా, ఇంతగా ధర్మ నిర్వహణ చేసినా, ఎంత నిస్వార్థంగా బ్రతికినా, ఇంకా ఈ గాంగేయునికి 'నేను, నాది, నా ప్రతిభ, నా శక్తి' అనే భావాలు పోలేదు. ఎంతటి వారికయినా ఈ 'నేను' పోతే తప్ప అసలు 'నేను' ఏమిటో తెలియదు. పైగా ఆ అస్ఖలిత బ్రహ్మచారి ఆయుధం పట్టింది ఈ ఆజన్మ బ్రహ్మచారి దెబ్బలకు తాళలేక కాదు. కేవలం 'కృష్ణుడి చేత ఆయుధం పట్టిస్తాననే' భీష్ముని ప్రతిజ్ఞ నెరవేర్చడం కోసం మాత్రమే ఆయన ఆయుధం పట్టాడు. సైంధవుణ్ణి చంపుతాననే అర్జునుని ప్రతిజ్ఞ నెరవేర్చడం కోసం మరోసారి చక్రం అడ్డువేశాడు. మొత్తం మీద భక్తుల శపథం నెరవేరడం కోసం తన శపథాన్ని సైతం వదిలి పెట్టేశాడు. భక్తులంటే ఆయనకు అంత ప్రేమ! **'కౌంతేయ ! ప్రతి జానీహి, నమే భక్తః ప్రణశ్యతి'** అని భగవద్గీతలో తానన్న మాట ప్రకారం భక్తుల ప్రతిజ్ఞలనే నెగ్గనిచ్చి తానే ఓడిపోయి భగవంతునిది 'తల్లి ప్రేమ' అని నిరూపించాడు.

అటువంటి పరమాత్మ దర్శనం కావాలన్నా, మనలో ఆత్మ రూపంలో ఉన్న 'ఆయన' సాక్షాత్కరించాలన్నా మనలో ఉన్న కృత్రిమమైన 'నేను, నాది' తొలగిపోవాలి. అంతవరకు భీష్మునకైనా సరే అంపశయ్య, ఆవేదన తప్పవు.

# 7. కరి - మకరి - శ్రీహరి

"పాద ద్వంద్వము నేలమోపి పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మారాకు హత్తించి ని
ష్ఖేద బ్రహ్మ పదావలంబన గతిన్ గ్రీడించు యోగీంద్రు మ
ర్యాదన్ నక్రము విక్రమించె కరి పాదాక్రాంత నిర్వక్రమై"

ఇది భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలో పద్యం. "చంపేవాడు, చనిపోయేవాడు అంటూ విడివిడిగా ఎవరూ లేరు. అంతా నేనే" అంటూ పరమాత్మ భగవద్గీతలో చెప్పిన మాటల సారాంశం పై పద్యంలో ఉంది.

ఈ ఘట్టంలో మొసలిబారిన పడ్డ గజేంద్రుడు రక్షణ కోసమో, శ్రీ మహావిష్ణు దర్శనం కోసమో పరితపించి కుయ్యోమొర్రో అన్నాడంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఏనుగును పట్టుకొని చంపడానికి సిద్ధపడిన మకరం కూడా ఆ శ్రీహరి దర్శనం కోసమే పరితపించడం చిత్రాల్లోకెల్లా చిత్రం. బాధపెట్టేవాడూ, బాధపడేవాడూ ఇద్దరిదీ ఒకే ఆవేదన, ఒకే తపన. అదే ఆశ్చర్యం. అదే అసలు రహస్యం.

ఆ మొసలి అసలు మొసలి కాదు. హూహూ అనే గంధర్వుడు శాపగ్రస్తుడై అలా మారాడు. ఆయనకు శ్రీహరి దర్శనం ద్వారానే శాపవిముక్తి. ఆ దర్శనమే సుదర్శన చక్రప్రయోగం. ఆ ప్రయోగం కోసమే ఏనుగును పట్టుకోవడం. పూర్వజన్మను పునర్జన్మగా పొందడం కోసం ఇంత సాహసం చెయ్యక తప్పలేదు. అపూర్వమైన జన్మ వచ్చినపుడు దాన్ని భగవద్దర్శనం ద్వారా సార్థకం చేసుకోకుండా పొగరుబోతు పనులు చేస్తే నీచజన్మలు తప్పవు. తిరిగి ఆ పూర్వజన్మ పొందడానికి



ఎవరి 'కాళ్లో' పట్టుకోవడమూ తప్పదు. అందుకోసమే ఈ పద్యంలో మకరం కరిపాదం పట్టుకోవడాన్ని ఒక మహాయోగి చేసే యోగసాధనగా వర్ణించాడు పోతన.

రెండు పాదాలు నేలమీద గట్టిగా మోపాడట. గాలిని బిగపట్టాడట. అయిదు ఇంద్రియాలను వశం చేసుకొని ఏకోన్ముఖంగా వాటిని సాగించాడట. అప్పుడే మనస్సులో పుట్టిన బుద్ధి అనే తీగకు చిగురాకుపైన మారాకు హత్తించాడట. ఒక్క చిగురాకుతోనే ఉంటే ఆ లత బతుకుతుందో లేదో చెప్పలేం. మారాకు వేసిందంటే ఇక బతికినట్లే. అంటే మనస్సులో కలిగే భక్తి జ్ఞాన వైరాగ్యాలు - పురాణ వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యంలా తాత్కాలికం కాకుండా దినదినం వృద్ధి చెందుతూ శాశ్వతం కావాలి. అదీ యోగాభ్యాస ఫలం. ఇంతకీ మకరం చేసే ఈ ప్రయత్నం ఎలా ఉందంటే 'బ్రహ్మపదం' అందుకోవడం కోసం మహాయోగి పడే తాపత్రయంలా ఉందట. ఇదంతా ఎందుకోసం అంటే - 'కరి పాదాక్రాంత నిర్వక్రమై' అని పద్యంలో ఉంది కానీ - నిజానికి మొసలి పడే ఈ తాపత్రయం కరిపాదం కోసం కాదు. హరిపాదం కోసం. అందువల్ల పద్యంలో ఒక్క అక్షరం మార్చి **'హరిపాదాక్రాంత నిర్వక్రమై'** అని అర్థం చేసుకొంటే పరమార్థం కొంచెమైనా తెలుస్తుంది. (మొత్తం మీద మొసలికి కావలసింది హరిపాదం. కానీ పట్టుకొన్నది కరిపాదం. అది లక్ష్యం, ఇది మార్గం!))

(సృష్టిలో ఒక సంఘటన జరిగిందంటే అది ఎంతో మంది చేసిన ఎన్నో కర్మలకు ఫలితాలను అందజేస్తుంది. ఇది తెలియక మన ఒక్కరి కర్మకొద్దీ ఇది జరిగిందనుకొని అనవసరంగా దుఃఖపడుతూ ఉంటాం!)

## 8. 'నేను' పోకుండా 'తాను' రాడు

"నానానేకప యూథముల్ వనములోనన్ పెద్ద కాలంబు స
న్మానింపన్ దశ లక్షకోటి కరిణీ నాథుండనై యుండి మ
ద్దానాంభః పరిపుష్ట చందన లతాంతచ్ఛాయలం దుండకీ
నీరాశ నిటేల వచ్చితి భయంబెట్లో కదే యీశ్వరా!"

ఇది ఆంధ్ర మహాభాగవతంలో 'గజేంద్ర మోక్షం' ఘట్టంలోని పద్యం. బమ్మెర పోతన్న కవే కాదు; మహాభక్తుడు, మహాయోగి కూడాను. అందుకే ఈ పద్యంలో ఆత్మదర్శనం కావడానికి ముందు యోగిలో ఏవి నశించాలో గర్భితంగా చెప్పాడు.

గజేంద్రుడు మొసలిబారిన పడి చాలాకాలం యుద్ధం చేశాక ఇక తన వల్ల కాక భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు. నిజానికి ఈ పద్యంతో ప్రార్థించడం ప్రారంభించాడని చెప్పాలి. అందుకే ఈ పద్యంలో సంపూర్ణ శరణాగతి కనిపించదు. అహంకారచ్ఛాయలు చందనలతాంతచ్ఛాయల రూపంలో ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి.

మనిషిలో మూడు రకాల అహంకారాలుంటాయి. సాత్త్విక రాజస తామసాహంకారాలని వీటికి పేర్లు. అనేక రకాల ఏనుగులు ఆ మహారణ్యంలో తనను సేవిస్తూ ఉండగా మహారాజులా సుఖంగా ఉండకుండా ఈ చెరువులోకి ఎందుకు దిగానని బాధపడుతున్నాడు. ఇది రాజసాహంకారం. పది లక్షల కోట్ల ఆడ ఏనుగులు తనని సేవిస్తూ ఉండేవని భావించడం తామసాహంకారం. తన దానజలంతో పెరిగిన గంధపు చెట్ల నీడల్లో ఉండలేక పోయానని బాధపడటంలో కూడా అహంకారం ఉంది. తాను మహాదాతనని గొప్ప



చెప్పుకోవడమన్నమాట. దానం చెయ్యడం మంచిదే. కాని అది తానే చెప్పుకోవడం సాత్త్వికాహంకారం. ఈ మూడు అహంకారాలు ఇంకా నశించలేదు కాబట్టే గజేంద్రునికి విష్ణురూపమైన ఆత్మ సాక్షాత్కారం కలగలేదు.

మన వేదాంతులు తరచూ ప్రదర్శించే చిన్ముద్రా రహస్యం ఇదే. బొటన వ్రేలితో చూపుడు వ్రేలిని కలిపి మిగిలిన మూడు వ్రేళ్లు విడిగా (దూరంగా) ఉంచడమే చిన్ముద్ర. బొటన వేలు పరమాత్మకు ప్రతీక. చూపుడు వ్రేలు జీవాత్మ. మిగిలిన మూడు వ్రేళ్లు సత్త్వరజస్తమో గుణాలకు ప్రతీకలు. జీవుడు సహజంగా ఈ త్రిగుణాలలో పడి కొట్టుకుంటూ ఉంటాడు. ఆ జీవుణ్ణి వాటికి దూరం చేసి పరమాత్మతో కలపడమే చిన్ముద్ర. అదే మోక్షం. ఆ స్థితి గజేంద్రునికి కలగడానికి చాలా సమయం పట్టింది. 'శరణార్థిని నన్నుగావవే' అనేంతవరకు హరి రాలేదు. కరి బాధపోలేదు. ఆ శరణాగతి తరువాతే గజేంద్రునికి 'మోక్షం' లభించింది.

# 9. అతడుంటే అన్నీ ఉన్నట్లే

"తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుడు, దాని వెన్కను ధనుః కౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీ కాంతుండునై వచ్చి రొ
య్యన వైకుంఠ పురంబునం గలుగు వా రాబాలగోపాలమున్"

ఈ పద్యం ఆంధ్ర మహాభాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలోది. దీని అర్థమే పోతన జీవన విధానం.

గజేంద్రుడు మొసలిబారి నుండి తనను కాపాడమని ఎవరిని ప్రార్థించాడు? భాగవత పద్యాలలో చూస్తే 'ఈశ్వరా, ఈశ్వరా' అనే సంబోధనలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడ ఈశ్వరుడంటే శివుడు కాదు, విష్ణువూ కాదు. బ్రహ్మ అసలే కాదు. మొత్తం అనంతకోటి బ్రహ్మాండాలకు అధిపతియైన పరమేశ్వరుడన్న మాట. అందుకే 'పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం బెవ్వడు' అని పేర్కొన్నాడు. మరి సర్వలోకాధిపతి, ఆత్మచైతన్య స్వరూపుడు అయిన భగవంతుణ్ణి ప్రార్థిస్తే విష్ణువు చక్రాయుధుడై వచ్చి కాపాడమేమిటి? అంటే మనం భగవంతుణ్ణి 'ఫలానా రూపంలో వచ్చి నన్ను కాపాడు' అని ప్రార్థిస్తే అలాగే వస్తాడు. ఏ రూపమో ప్రత్యేకించి చెప్పకపోతే - స్థితికర్త, పాలన, పోషణ చూసే బాధ్యత కలవాడు విష్ణువు కాబట్టి ఆయన వస్తాడు. లోకంలోనూ అంతే. మనకు ఆపద వచ్చినప్పుడు ఎవరినైనా పేరుబెట్టి పిలిచి, లేదా వారింటికి వెళ్లి అర్థిస్తే వారే కాపాడతారు. అలా కాకుంటే 'కాపాడండి, కాపాడండి' అని అరిస్తే దగ్గరలో ఉన్న రక్షకభటులు వచ్చి కాపాడతారు. రక్షణ బాధ్యత వారిది కాబట్టి. అందుకే విష్ణురూపంలో సర్వేశ్వరుడు వచ్చాడు.



అది సరే. గజేంద్రుడు కేవలం భగవంతుణ్ణి వచ్చి తన ప్రాణాలు కాపాడమని మాత్రమే కోరాడు. కాని అడగకపోయినా ఆయన వెంట లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపుర స్త్రీలు, వారి వెంట గరుత్మంతుడు, అతని వెనుక విల్లు, గద మొదలైన ఆయుధాలు, ఆ పైన వైకుంఠానికి విష్ణుదర్శనం కోసం వచ్చిన నారద మహర్షి ఇంకా సర్వసైన్యాధిపతియైన విష్వక్సేనుడు.. ఒకరేమిటి వైకుంఠంలో ఉండే బాలుర నుండి గోపాలుర వరకు అందరూ గజేంద్రుని వద్దకు వచ్చేశారు. అంటే మనం భగవద్దర్శనం కోసం ప్రార్థిస్తే చాలు. ఆ దర్శనంతోనే సిరిసంపదలు వస్తాయి. దాసదాసీజనం సమకూరుతారు. వస్తువాహనాలు కొనగలిగే శక్తి కలుగుతుంది. మన రక్షణ కోసం సర్వాయుధాలూ వస్తాయి. మహాత్ములు, మహాయోగుల సాంగత్యమూ కలుగుతుంది. అత్యున్నత అధికారులు అందరూ మన చుట్టూ తిరుగుతారన్న మాట. ఈ రహస్యం తెలిసినవాడూ కాబట్టే పోతన మహాకవి రాజుల చుట్టూ, మంత్రుల చుట్టూ, వ్యాపారుల చుట్టూ తిరగడం మానేసి ఒక్క విష్ణువు చుట్టూ మాత్రమే మనస్సుని ప్రదక్షిణం చేయిస్తూ భాగవతం రచించాడు. అందుకే ఆయన ఇహలోక జీవితమూ సుఖంగా ముగిసింది. (శ్రీనాథునిలా కాకుండా) పరలోకంలో మోక్షమూ దక్కింది. ఆయన రచించిన భాగవతం ఇవ్వేళ ప్రపంచమంతా ప్రశంసలందుకొంటోంది. ఈనాటి కవులూ, పండితులూ ఈ రహస్యం గ్రహించి మంత్రుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా భగవంతుని యందు విశ్వాసంతో ఆత్మవిశ్వాసంతో తమ పని ఏదో తాము చేస్తే దక్కవలసిన గౌరవాలు అవే దక్కుతాయి.

# 10. కడుపులో కమలాక్షుడుంటే...?

కథని కథలా నడిపిస్తూనే అంతర్భాగంగా పరమార్థాన్ని బోధించడం మనం పురాణాలలోని కథాకథనంలో అంతఃసూత్రం. పైకి చూస్తే మాములుగా కథలో భాగమైన ఒక పాత్రనో, ఒక దృశ్యాన్నో, ఒక సందర్భాన్నో వర్ణిస్తున్నట్లుంటుంది. 'లోనారసి' చూడగలిగితే మనస్సు ప్రసన్నమై భగవద్భక్తి పూరితమై పోతోంది.

వామన చరిత్రలో వామనుని గర్భంలో ధరించిన అదితిని వర్ణిస్తూ పోతన గారు రచించిన పద్యం అటువంటిదే.

**"నిలిపెన్ తెప్పల బృందిమన్, విశదిమన్ నేత్రంబులన్, చూచుకం**
**బుల నా కాళిమ, మేఖలన్ ద్రఢిమ, వెమ్మోమున్ సుధాపాండిమన్**
**బలిమిన్ జన్నుల శ్రోణిపాళి గరిమన్ మధ్యంబునన్ బృంహిమన్**
**లలితాత్మన్ లఘిమన్ మహామహిమ మేనన్ గర్భ దుర్వారయై**

**(భాగ - 8-498)**

మాములుగా చూస్తే అందరు గర్భిణుల లక్షణాలే ఇందులో ఉన్నాయి. రెప్పలు దట్టమయ్యాయి. కనుగ్రుడ్లు మరింత తెల్లబడ్డాయి. స్తనాగ్రాలు మరింత నల్లబడ్డాయి. నడుము దృఢమయ్యింది. ముఖంలో స్వచ్ఛత పెరిగింది. వక్షోజాలు పెద్దవయ్యాయి. కటిభాగం విస్తృతమైంది. పొట్ట పెద్దదయ్యింది. కానీ మనస్సు మాత్రం దూదికన్న తేలికైపోయింది. మొత్తం మీద శరీరంలో ఒక 'మహామహిమ' దర్శనమిస్తోంది.

ఆ మహిమ ఏమిటో పోతన చెప్పడు. మనం ఆలోచించి తెలుసుకోవాలి. పద్యంలో మూడు, నాలుగు పాదాలలో 'గరిమ, మహిమ, లఘిమ' అనే పదాలకేసి ఒకసారి పరిశీలనగా చూడండి.



ఇవి అష్టసిద్ధుల్లో మాటలు కాదూ?

"అణిమా మహిమాచైవ గరిమా లఘిమా తథా
ప్రాప్తిః ప్రాకామ్యమీశత్వం వశిత్వంచాష్టసిద్ధయః"

అంటారు కదా! మహాయోగులకు మాత్రమే ప్రాప్తించే అష్టసిద్ధులు అదితిగా అలవోకగా లభించడమేమిటి? దేవత కాబట్టి అలా సిద్ధించినట్లు ఆధారాలు లేవే !

ఇక్కడ మనకు స్ఫురించి తరింపజేసే రహస్యం ఒక్కటే. ఆమె శ్రీమన్నారాయణుని గర్భంలో ధరించింది. భగవంతుడు మన ఇంట్లోగానీ, అదృష్టం బాగుంటే ఒంట్లో గానీ ప్రవేశిస్తే అణిమ మహిమ వంటి మహాయోగ సిద్ధులన్నీ అలవోకగా మనకు వశమై పోతాయని ఆమె గర్భిణి రూప వర్ణన ద్వారా తెలియజేస్తున్నాడు పోతన. అష్టసిద్ధులకు సంబంధించిన 'గరిమ, మహిమ, లఘిమ' అనే మహిమాన్వితమైన మాటలు చివరలో ప్రయోగించడం ఎందుకంటే ఎంతో కాలం కష్టపడి యోగాభ్యాసాలు, ధ్యానధారణలు, తత్త్వవిచారణలు చేస్తే చిట్టచివరలో ఈ సిద్ధులు లభిస్తాయనీ, వాటి ప్రభావంలో పడి మోసపోకుండా 'లలితాత్మను' కాపాడుకొంటూ సాగితే తుట్టతుదకు ఎట్టకేలకు మహామాన్వితుడైన భగవంతుని దర్శనం అవుతుందని మనకు తెలియజేయడమన్నమాట. అందుకే చిట్టచివర 'మహామహిమ' అనే పదం వాడాడు సహజ పాండిత్యుడు.

ఏదో ఒక రూపాన్ని ప్రేమించి, ఏదో ఒక నామంతో నిరంతర స్మరణ చేస్తూ ఉంటే మన మనస్సులో ఆయన కొలువుండటం ఖాయం. ఆయనే స్వయంగా వచ్చి కొలువున్నాక అష్టసిద్ధులేమిటి? అండపిండ బ్రహ్మాండాలన్నీ మన ఒంట్లోనే కనిపిస్తాయి. దాన్నే మంత్రపుష్పంలో "అధోనిష్ట్యావితస్త్యాంతే నాభ్యాముపరితిష్ఠతి" అని మొదలుపెట్టి తస్యాః శిఖాయామధ్యే పరమాత్మా

వ్యవస్థితః" అని ముగించి నీ శరీరంలోనే బ్రహ్మ, విష్ణువు, శివుడు మొ॥న సమస్త దేవతలూ ఉన్నారు చూసుకో అన్నారు.

అదే విషయాన్ని గజేంద్రమోక్షంలో పోతన్నగారు 'తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్' అనే పద్యంలో పరోక్షంగా కవితాత్మకంగా చెప్పాడు. ఎవరు ఎన్ని చెప్పినా, ఎవరు ఎన్ని చదివినా, ఎవరు ఎన్ని విన్నా కావలసింది ఆచరణ. ఆచరణ ఉంటే 'ఆచరణాలు' అందుకోవడం మరీ అంత కష్టమేం కాదు.



## 11. భగవంతుని చిరునామా

మనలో చాలామందికి భగవంతుడి మీద విశ్వాసం లేదు. ఉన్నట్లు మాట్లాడతాం. అంతే. నిజమైన విశ్వాసం ఉన్నవాడెవడూ భగవంతుని తప్ప వేరొకరినాశ్రయించడు. ప్రగాఢమైన భగవద్విశ్వాసంతో బమ్మెర పోతనలా జీవిస్తాడు. అలా జీవించడం మనకిష్టం లేదు. ఈ భోగాలేవీ వదులుకోకుండానే దేవుడు మనకు కనిపించి రోజూ హాజరు వేయించుకోవాలని మన ఆలోచన. అలా రావడానికి పోవడానికి ఆయన ఒక చోట ఉండి మరోచోట లేకపోతే గదా! కాశీలో ఉన్నాడని ఉత్తర దిక్కంతా తిరిగి, రామేశ్వరంలో ఉన్నాడని దక్షిణ దిక్కంతా తిరుగుతూ కూర్చుంటే చివరకు తూర్పు తిరిగి దండం పెట్టాల్సిందే.

ఆయన ఎక్కడ ఉన్నాడో మన పూజాపురస్కారాల్లో ముఖ్యభాగమైన మంత్రపుష్పంలో పటం గీచి భాగాలు గుర్తించినంత స్పష్టంగా ఉంది.

"పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖం
అధో నిష్ట్యా వితస్త్యాంతే నాభ్యాముపరి తిష్ఠతి"

మన శరీరంలోనే గొంతుకు దిగువ, నాభికి పైనగల ప్రదేశంలో పన్నెండు అంగుళాల ఎడంగా హృదయకమలం ఉంది. అది ఆయన నివాస స్థానమని వేదం స్పష్టం చేస్తోంది.

"జ్వాలా మాలా కులంభాతి విశ్వస్యాయతనం మహత్
సంతతగ్ం శిలాభిస్తు లంబత్యాకోశ సన్నిభం"

సృష్టికి మూలమైన ఆ మహాశక్తి అగ్నిమాలికలా ప్రకాశిస్తోందనీ, ఎల్లప్పుడూ అనేక నాడీ సమూహంతో వేలాడుతూ అమిత తేజోవంతంగా ఉందనీ దాని

స్వరూపాన్ని విస్పష్టం చేస్తోంది.

**"తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం**
**తస్య మధ్యే మహానగ్నిః విశ్వార్చిర్విశ్వతో ముఖః"**

ఆ జ్వాలా మాలిక చివర్లో అతిసూక్ష్మమైన రంధ్రం ఉంది. దానిలోనే ఈ విశ్వరహస్యమంతా ఇమిడి ఉంది. ఆ రంధ్రం మధ్యలో గొప్ప అగ్ని ఉంది. అదే విశ్వాన్ని వెలిగింపజేస్తోంది. అదే విశ్వమంతా వ్యాపించి ఉంది.

దాని మధ్యలో అపూర్వమైన వహ్నిశిఖ ఉంది. అది ఊర్ధ్వముఖంగా ప్రకాశిస్తోంది.

**"నీలతోయద మధ్యస్తాత్ విద్యుల్లేఖేవ భాస్వరా**
**నీవారశూకవ త్తన్వీ పీతాభాస్వ త్యణూపమా"**

ఆ అగ్నిశిఖ నీలమేఘం మధ్యలో ఉండే మెరుపుతీగలా ప్రకాశిస్తోంది. నివ్వరి ధాన్యపు ముల్లులా బంగారు రంగులో కాంతులు విరజిమ్ముతోంది. అది అణువు వలె అతి సూక్ష్మమైంది.

**"తస్యాః శిఖాయాః మధ్యే పరమాత్మా వ్యవస్థితః**
**సబ్రహ్మ సశివః సహరిః సేంద్రః సోక్షరః పరమః స్వరాట్"**

అతి సూక్ష్మమైన ఆ అగ్నిశిఖ కొస నడుమ భగవంతుడున్నాడు. అతడే బ్రహ్మ. అతడే శివుడు, విష్ణువు, ఇంద్రుడు. అతడే అక్షరుడు. అతడే సర్వస్వం.

ఇంత స్పష్టంగా ఇంటి నెంబరు, వీధి పేరు చెప్పినంత వివరంగా మన దేహంలోనే భగవద్దర్శనం చేయిస్తోంది వేదమాత మంత్రపుష్పం రూపంలో. శరీరం అంటే కాలకృత్యాలకో, కామ కృత్యాలకో ఉపయోగపడే భోగసాధనం అనుకొని వృథాగా ఇంత కాలం గడిపేశాం గానీ దీని వెనుక ఇంత కథ ఉందని తెలీదే. పూజానంతరం మంత్రపుష్పం చదవడం అంటే అదేదో



మొక్కుబడిగా పదిమంది అటూ, పదిమంది ఇటూ నిలబడి కంఠస్వరం పెంచేసి ఒకరిమీద ఒకరు పోటీపడి చదివేయడమే అనుకున్నాం కానీ ఆ మంత్రపుష్పం అర్థం ఇంత లోతుగా ఉంటుందని మనం ఊహించలేకపోయాం కదా!

(అందుకే పుణ్యం కోసం పూజలు చెయ్యకూడదు. పురుషార్థం కోసం చెయ్యాలి. పరమార్థాన్ని అందుకోవడం కోసం చెయ్యాలి. అప్పుడుగాని మనలో దాగిన 'అమూల్యాన్ని' కనిపెట్టలేం.)

ఇప్పుడీ సారాంశాన్ని భాగవతంలోని వామన చరిత్రలో ఒక పద్యానికి అన్వయించి చూస్తే వామనుడు మూడు అడుగుల నేలే ఎందుకడిగాడో అర్థమవుతుంది.

**"ఒంటివాడ నాకు ఒందు రెండడుగుల**
**మేర యిమ్ము; సొమ్ము మేర యొల్ల**
**కోర్కెదీర బ్రహ్మ కూకటి ముట్టెద**
**దాన కుతుక సాంద్ర దానవేంద్ర!"**

మూడడుగుల నేల ఇస్తే దాన్ని ఆసరాగా చేసుకొని బ్రహ్మశిఖ అందుకొంటానంటున్నాడు వామనుడు. ఆ బ్రహ్మశిఖయే మంత్రపుష్పంలో పేర్కొన్న అతిసూక్ష్మమైన అగ్నిశిఖ. అది మన శరీరంలోనే ఉంది. దాన్ని అందుకోవడానికి ఏకాగ్రతతో తపస్సు చేయాలి. కాళ్లు ముడుచుకొని కూర్చొని చేసే తపస్సుకు మూడడుగులు చాలు. మనిషి చనిపోవాలన్నా అరడుగుల నేల కావాలి. కాని బతికి బాగుపడాలంటే – ముక్తి పొందాలంటే – మూడడుగుల నేల చాలన్న మాట. ఇదే 'సూక్ష్మంలో మోక్షం' అంటే.

(అందుచేత భగవంతుడి గురించి ఆ గుళ్లో ఈ గుళ్లో వెతికి ఆయాసపడే కంటే అడుగడుగునా ఉన్న గుడిలో, అందరిలో ఉన్న గుడిలో వెదకడం మంచిది.)

# 12. మనస్సు మనకో వరం

ఈ శరీరం ఒక రథం. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు కలిసి మొత్తం పది గుర్రాలు ఈ రథాన్ని లాగుతున్నాయి. ఈ ఇంద్రియాశ్వాలకు, అసలు నాయకుడు మనస్సు. దాన్ని అదుపులో పెట్టుకొంటే గాని ఇవి మన మాట వినవు. అది అదుపులోకి రావడం చాలా కష్టం. కష్టమైనా దాన్ని సాధించక తప్పదు. ఎందుకంటే కనిపించేవన్నీ ఒకనాటికి కనిపించకుండా పోతాయి. అన్నీ పోయాక మిగిలేది ఆత్మ ఒక్కటే. బమ్మెర పోతన భాగవతంలో చెప్పిన విధంగా **"లోకంబులు, లోకేశులు, లోకస్థులు, తెగిన తుదిని అలోకంబగు పెను చీకటికి అవ్వల ఎవ్వడు ఏకాకృతిని వెలుగునో"** అదే ఆత్మ. అది నిత్యం, అది సత్యం. దాన్ని చేరుకోవాలంటే ముందు దాన్ని గురించి తెలుసుకోవాలి. దాన్ని గురించి తెలుసుకోవాలంటే అందుకు సాధనమైన మనస్సు **"ఎక్కడ దొంగలు అక్కడే గప్‌చిప్"** అన్నట్లుగా ఆగిపోవాలి. అదే మనోనిగ్రహం. ఈ మనోనిగ్రహాన్ని సాధించడానికే ఇన్ని వేల విగ్రహాలు, దేవాలయాలు మన దగ్గర ఉన్నాయి.

మనో నిగ్రహాన్ని సాధించాలంటే మహాతత్త్వవేత్తల సలహాలు పాటించాలి. అటువంటి తత్త్వవేత్తలలో ఆదిశంకరాచార్యులు ప్రధానులు.

ఆయన తాను రచించిన శివానందలహరి స్తోత్రంలో మనస్సు చేసే విన్యాసాల గురించి, దాని వెకిలి చేష్టల గురించి, దాని చంచల స్వభావాన్ని గురించి మరెవ్వరూ చెప్పలేనంత రసభరితంగా చెప్పారు. ఆయన దృష్టిలో మనస్సు ఒక కోతి, ఈ కోతి నిరంతరం మోహారణ్యంలో సంచరిస్తూ ఉంటుంది. ఆశల కొమ్మల్ని పట్టుకొని వేళ్లాడుతూ కొతి కొమ్మచ్చులు ఆడుతుంది. మొత్తం మీద దాని ఇష్టం వచ్చినట్లు సంచరించే ఈ కోతిని ఎవరు అదుపు చేయగలరు?



లోకంలో భిక్షకులు కోతుల్ని పట్టి ఆడించి, ప్రదర్శించి సొమ్ము చేసుకోవటం మనం చూస్తూనే ఉన్నాము. అందుకనే ఆయన ఆదిభిక్షువు అయిన పరమ శివుణ్ణి ఈ మనోవానరాన్ని తన వశం చేసుకోమని ప్రార్థించాడు.

మరో శ్లోకంలో మనస్సును దొంగతో పోల్చాడు. ఎందుకంటే దొంగలాగే సగటు మానవుల మనస్సు – ముఖ్యంగా పండితుల మనస్సు – నిత్యం ధనవంతుల ఇళ్లల్లో ప్రవేశించి వారి సొమ్మును సన్మానాలు, సత్కారాల రూపంలో హరించాలని చూస్తూ ఉంటుంది. ఇదీ దొంగతనమే. కాకపోతే కాస్త ఘరానా దొంగతనం. దొంగని ఎప్పుడైనా దొంగల నాయకుడే సరిగ్గా అదుపు చేయగలడు. అతడే శివుడు. ఆశ్చర్యంగా ఉండవచ్చు కానీ, **"తస్కరాణాం పతయే నమో నమః"** అని శ్రుతులు పేర్కొంటున్నాయి కదా! అందువల్ల తన మనశ్చోరుణ్ణి పట్టగలవాడు భగవంతుడు ఒక్కడే అని స్వామి మనకు బోధిస్తున్నారు.

మరో సందర్భంలో ఆచార్య స్వామి మనస్సు మహారణ్యంగా పేర్కొన్నారు. అరణ్యంలో క్రూరమృగాలు ఉంటాయి కదా! అలాగే మన మనస్సులో కూడా కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యము అనే మృగాలున్నాయట. ఇవి అడవుల్లో మృగాల కంటే ఘోరమైనవి, క్రూరమైనవి. అడవుల్లో మృగాలను ఒకసారి భారీ ఎత్తున చంపేస్తే మళ్లీ వాటి సంతతి పెరిగి పెద్ద కావడానికి చాలా కాలం పడుతుంది. ఈ అరిషడ్వర్గ మృగాలను చంపుతూ, మన మనస్సులోనే స్థిరంగా ఉంటే అంతకంటే మానవ జన్మకు సార్థకత ఏముంటుంది?

మరోచోట ఈ తత్త్వకవి మనస్సును మత్తేభంతో పోల్చారు. దాన్ని ధైర్యమనే అంకుశంతో లొంగదీసుకోవాలట. భక్తి అనే గొలుసులతో కట్టి పారెయ్యాలట. పరమ శివుడనే గజస్తంభానికి చిద్యంత్రాల సాయంతో ఆ మనస్సును బంధించాలట. ఇదీ స్వామి ఉపదేశం.

ఆచార్య స్వామి మనస్సుని మనం ఉపయోగించుకోవలసిన విధానం కూడా చాలా స్పష్టంగానూ, సూటిగానూ చెప్పారు. పరుగులు పెట్టే మనస్సును

ఆయన పంచకల్యాణి గుర్రంతో పోల్చాడు. అది ఈశ్వరుని వాహనమైన వృషభం కంటే చాలా వేగంగా ప్రయాణిస్తుందనీ అందువల్ల దాన్ని అధిరోహించి ప్రయాణం చేయమని చాలా చమత్కారంగా తన మనస్సులోకి భగవంతుణ్ణి ఆహ్వానించాడు. మనస్సనే అశ్వం గమనం చాలా చిత్రమైనదని, సరసమైనదని పేర్కొని పరమశివుని ఆకర్షించే ప్రయత్నం చేసారు. మరో సందర్భంలో మానవుని బుద్ధి విరహ వేదనతో పరితపించిన నాడే ఈశ్వర దర్శనం అవుతుందని సజ్జనులైన మానవులకు సలహా ఇచ్చారు. నిరంతరం ఈశ్వర స్మరణం, ఈశ్వర భావనం, ఈశ్వర కీర్తనం మొదలైన వాటి ద్వారా ఈశ్వర సాక్షాత్కారం పొందవచ్చునని సూచించారు.

మానవులు నిత్యమూ చేసే పూజా పురస్కారాలు ఆర్భాటంగానే కాదు, ఆలోచిస్తే హాస్యాస్పదంగా కూడా ఉంటాయి. వెనకటికి ఎవరో పెద్దమనిషి **"మా ఆవిడ వంట చేస్తే అన్నీ ఉంటాయి, ఒక్క రుచి తప్ప"** అన్నాడట. అలాగే మన పూజల్లో అన్నీ ఉంటాయి. ఒక్క భక్తి తప్ప. భగవంతుని పూజించడానికి ఎన్నో రకాల పువ్వులు తెస్తాం. ఆ పువ్వుల కోసం చెరువుల్లో దిగుతాం. కొండలు ఎక్కుతాం. అరణ్యాలన్నీ గాలిస్తాం. కానీ ఒక్క మనఃపుష్పాన్ని భగవంతునికి అర్పించగలిగితే వేరే పువ్వులేవీ తేనవసరం లేదని గుర్తించం. అసలు మనం చేసే రకరకాల పూజలన్నీ అర్థరహితంగాను, పరమార్థ శూన్యంగాను చేస్తున్నామేమో! పూజాపురస్కారాలలో మనస్సుకు ఉండే ప్రాధాన్యాన్ని శంకరాచార్య స్వామి ఆలంకారిక శైలిలో వివరించారు. సాధారణంగా పూజలలో ప్రదేశం పరిశుద్ధం కావడం కోసం పుణ్యాహవాచనం చేస్తారు. అక్కడ పీటపై బియ్యం పోసి దానిపై పవిత్ర కలశాన్ని స్థాపిస్తారు. ఆ కలశాన్ని దారాలతో చుడతారు. ఆ కలశంలో పరిశుభ్రమైన జలం నింపుతారు. ఆపైన మావిడాకులు చిగుళ్లు లోపలికి ఉండేలా అమరుస్తారు. ఆపైన నారికేళ ఫలం ఉంచుతారు. ఈ ప్రక్రియ అంతటిలో నిండి ఉన్న పరమార్థాన్ని స్వామి ఇలా వివరించారు.



మనిషి మనస్సే కలశం. దానికి చుట్టూ భక్తి అనే దారాలు చుట్టాలి. ఆ మనః కలశంలో సంతోషమనే జలాన్ని నింపాలి. అందులో భగవంతుని పాదములనే చిగురాకులను స్థిరంగా అలంకరించుకోవాలి. ఆపైన కొబ్బరికాయ రూపంలో జ్ఞానఫలాన్ని సాధించాలి. పూజగదిని శుభ్రం చేయడం కంటే మన శరీరం అనే గదిని భగవత్ పూజకు సిద్ధంగా, శుభ్రంగా ఉంచడమే ప్రధానం. అలా ఉంచి, అప్పుడు మంత్రోచ్చారణ చేస్తే అది నిజమైన పుణ్యాహవాచనమై భగవత్ సాక్షాత్కారం లభిస్తుంది. మనస్సుకి అనేక ఆకర్షణలు ఉంటాయి. కాబట్టి దాన్ని భక్తి దారాలతో బంధించాలని స్వామి చెప్పారు. నిత్యమూ సంతోషంతో ఉండే మనస్సులో మాత్రమే భగవంతుడు ఉంటాడని స్వామి సూక్తీకరించారు. ఇవే పూజలోని పరమార్థం.

మనస్సులోకి భగవంతుడు రావాలన్నా మనస్సు భగవంతుణ్ణి చేరుకోవాలన్నా, దానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఆ లక్ష్యాన్ని భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ద్వారా క్రమంగా సాధించాలి. అంకోల వృక్షం నేల రాలిన తన విత్తనాలను తానాకర్షించినట్టుగా భగవంతుని సాన్నిధ్యానికి చేరుకొనే ప్రయత్నం ముందు నెమ్మదిగా ప్రారంభం కావాలి. తరువాత అయస్కాంతం ఇనుమును ఆకర్షించిన విధంగా కొంత చురుకుగా ముందుకు సాగాలి. అనంతరం భార్య భర్తను ప్రేమగా చేరినట్లుగా సహజమైన ఆకర్షణ ఏర్పడాలి. ఆ పిదప తీగ చెట్టుకు అల్లుకొన్నట్లుగా భక్తుడు భగవంతునికి సహజంగా అల్లుకుపోగలగాలి. ఇక చివరిదశలో నది సాగరాన్ని చేరినట్లుగా అనివార్యంగా భగవంతుణ్ణి చేరుకోవాలి. ఈ పద్ధతిలో మనస్సును ప్రయాణం చేయించాలి. దానికి అందుకు తగినంత శిక్షణ ఇవ్వాలి. అప్పుడు మనస్సు ఉన్నందుకు మనిషికి సార్థకత. భగవంతుడు ఇతర జంతువుల్లో దేనికీ లేని ఈ మనస్సును మనిషికి మాత్రమే ఇచ్చాడని మరచి పోకూడదు. తస్మాత్ జాగ్రత్త!

# 13. నిత్యజీవితంలో వేదాంతం

లోకంలో చెప్పడం, వినడానికి సంబంధించి మూడు విషయాలున్నాయి. ఈ మూడింటికి మూడు ప్రత్యేకతలున్నాయి. 1. వ్యాకరణం 2. కవిత్వం 3. వేదాంతం. వీటిలో వ్యాకరణం చెప్పేవాడికీ కష్టం, వినేవాడికీ కష్టం. కవిత్వం చెప్పేవాడికే కష్టం. వినేవాడు సుఖంగా కూర్చొని విని బాగుందనో, బాగాలేదనో ఒక మాట విసిరేసి వెళ్ళిపోతాడు. మూడోది వేదాంతం. ఇది చాలా విచిత్రమైంది. చెప్పేవాడికీ వినేవాడికీ కూడా సుఖమైనదే. ఏదైనా చెప్పవచ్చు. ఎక్కడైనా మొదలుపెట్టవచ్చు. ఎక్కడైనా ఆపేయవచ్చు. వినేవాడు కూడా ఎంతసేపైనా వినవచ్చు. ఎప్పుడైనా వెళ్ళిపోవచ్చు. ఇదీ నేటి ప్రవచనాల పరిస్థితి.

ఈ వేదాంతాన్ని ఇలా వదిలెయ్యకుండా నిత్యజీవితంలో ఆచరణలో పెట్టే ప్రయత్నం చేస్తే అంతకంటె సుఖజీవి మరొకడుండడు. అయితే వేదాంతోపన్యాసాల్లో మనం విన్నవాటిని ఆచరణలో పెట్టాలంటే ముందు మన మనస్సు మన ఆధీనంలో ఉండాలి. ఈ మనస్సు ఒక దొంగలాంటిది. దొంగలు సామాన్య జనాన్ని భయపెడతారు. కాని పోలీసుల్ని చూసి భయపడతారు. ఎందుకంటే దొంగల మర్మాలు పోలీసులకు బాగా తెలుసు కనుక. అందుకని ముందు మనం మనోమర్మాన్ని తెలుసుకోవాలి. అది చంచలమని తెలుసుకొని దాన్ని నెమ్మదిగా తత్త్వోపదేశంతో లొంగదీసుకొని భగవంతుని స్మరించడం దానికి అలవాటు చెయ్యాలి. క్రమంగా అలా అలవాటు చేస్తే అది రుచి మరిగితే ఇంక ఆ స్మరణ మానదు. అప్పుడు అన్నీ మన ఆధీనంలోకి వస్తాయి. భారతీయ వేదాంతంలో సుప్రసిద్ధ గ్రంథమైన 'యోగవాసిష్ఠం'లో ఈ మనోజయాన్ని గురించి అధ్యాయాలకు అధ్యాయాలు వివరించారు. చివరగా ఒక మాట చెబుతారు. "మనస్సును అంతర్ముఖం చేయాలి. సర్వం తనంతతానే సంభవిస్తుంది.. జీవన్ముక్తి



కలుగుతుంది..." ఇదీ ఆ వివరణల సారాంశం. ఈ విధంగా మనోమర్మం మనం తెలుసుకొని దాన్ని అదుపులో పెట్టగలిగితే మోక్షసాధనలో ముప్పాతిక వంతు పని పూర్తయినట్లే.

సుఖానికి పొంగి బోర్లాపడటం, దుఃఖానికి క్రుంగి కృశించిపోవడం మనస్సుకు సహజం. కాని నిజమైన సుఖం ఎక్కడుందో దానికి స్పష్టంగా తెలియజెయ్యాలి.

**'సుఖము పొందుటందు సుఖము లేనే లేదు**
**సుఖము వీడుటందె సుఖము కలదు**
**కష్టమందునైన కమ్మగా సుఖపడ**
**నేర్వవలయు, బతుకు నోర్వవలయు'**

**(సాగరఘోష-గరికిపాటి)**

అది కావాలి, ఇది కావాలి అని సుఖాల వెనుక పరిగెడితే అవి మనకు దక్కవు. సుఖాలు, సంతోషాలు సీతాకోక చిలుకల లాంటివి. వాటి వెనుక పరుగు పెట్టినంతసేపూ అవి మరింత దూరంగా ఎగిరిపోతూ ఉంటాయి. వాటితో మనకు పనేమీలేదని వదిలేసి ఒకచోట కూర్చుంటే అక్కరలేని సుఖాలన్నీ సీతాకోక చిలుకల్లాగే వచ్చి భుజం మీద వాలతాయి. సుఖం సంగతి ఇలా ఉంటే కష్టం సంగతి మరో రకంగా ఉంటుంది. మనం కష్టం అనుకొనే ప్రతిదాంట్లోనూ ఎంతోకొంత సుఖం కూడా ఉంటుంది. ఏదో ప్రమాదంలో కాలి ఎముక విరిగిందనుకుందాం. ఆసుపత్రిలో చేర్చారు. ఆపరేషన్ చేశారు. ఆరవై వేలు వసూలు చేశారు. అందరూ వచ్చి చూశారు. ఆ తరువాత మూడు నెలలు విశ్రాంతి తీసుకొమ్మని ఒక ఉచిత సలహా పారేశారు. తప్పదు కదా! ఈ మూడు నెలలో 'కాలు విరిగింది, కాలు విరిగింది' అంటూ పదిసార్లు ఏడవడం వల్ల గానీ, పది మందితో చెప్పుకోవడం వల్లగానీ విరిగిన కాలు పదిరోజుల్లో

అతుక్కోదు కదా! దాని మూడు నెలలు అది తీసుకొంటుంది. ఈలోపు మనం చెయ్యవలసింది ఒక్కటే. ఆ విరగడం వల్ల ఒనగూడే సుఖాలు కొన్ని ఆస్వాదించడమే. ఇదివరకు చదవలేకపోయిన పుస్తకాలు ఇప్పుడు చదవవచ్చు. ఇదివరలో టి.వి. చూడటానికి ఖాళీలేక బాధపడినవాళ్లు ఇప్పుడు హాయిగా గంటల తరబడి చూడవచ్చు. కావలసిన వాళ్లతో సుఖంగా కబుర్లు చెప్పుకోవచ్చు. కష్టంలో సుఖం వెతుక్కోవడమంటే ఇదే. ఇలా ఆలోచించగలిగితే మనిషి నిత్యమూ సుఖంగానే ఉంటాడు.

పైగా సుఖాలు ఎంత తాత్కాలికాలో కష్టాలూ అంతే కదా! ఏ దుఃఖానికీ నిన్నటి తీవ్రత ఇవ్వాళ ఉండదు. ఇవాల్టి తీవ్రత ఇంకో నెలదాటితే ఉండదు.

**"నిన్నటి దుఃఖమిప్పటికి నిర్మల సౌఖ్యము; రేపు సౌఖ్యమో**
**విన్నదనంబో చెప్పగల వీరులు లేరిల, జీవితంబనన్**
**నిన్నకు నిన్నయే యగును, నేటికి నేడగు, రేపు రేపగున్**
**ఉన్నది ఉన్నటుల్ గొనుము ఊహలపోహలు మానుకొమ్మికన్"**

**(సాగరఘోష-గరికిపాటి)**

ఉన్నది ఉన్నట్లు ఒప్పుకోగలిగే మానసిక పరిపక్వత సాధించగలగడమే వేదాంతం నేర్చుకొన్నందుకు నిజమైన ఫలం. కాస్సేపు కరెంటుపోతే గిలగిల్లాడి పోతామే. ఆ చీకటిలో చిందులేసి, కేకలేసి, హడావుడి చేసి కొత్త చిరాకు కొని తెచ్చుకొనే బదులు హాయిగా డాబా మీదికి పోయి కాస్సేపు చందమామను చూసి ఆనందించవచ్చుగదా! అలా అనిపించి ఆచరిస్తే జీవితంలో ప్రతి అసౌకర్యం ఒక సౌకర్యంగా మారుతుంది. అప్పుడు జీవితమంతా వేదాంతభావనా మధురమై జీవన్ముక్తులం అవుతాం.



# 14. 'అతి' వద్దు - 'అసలు' ముద్దు

సాహిత్య సృష్టి కేవలం ఆనందం కోసం కాదు. దానివల్ల సమాజానికి ఎంతో కొంత మేలు జరగాలి. అంటే కావ్యం ఉపదేశాత్మకంగా ఉండాలి. అయితే ఆ ఉపదేశం రసమయంగా ఆనందదాయకంగా కూడా ఉండాలి.

జీవితంలో మన అనారోగ్యాలకి కారణాలు ప్రధానంగా రెండు. 1. తిళ్లు 2. ఒత్తిళ్లు. ఆహారం విషయంలో కొన్ని నియమాలు పాటిస్తే సగం అనారోగ్యాన్ని తప్పించుకొన్నట్లే. ఇక ఒత్తిళ్ల విషయానికి వస్తే ఏ వ్యవహారంలోనైనా ఎంత వరకు ఆలోచించాలో అంతవరకే ఆలోచించి, ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడి, ఎంతవరకు పనిచేయాలో అంతవరకే పనిచేస్తే ఒత్తిళ్లు కూడా ఉండవు. ఆరోగ్యం చక్కగా ఉంటుంది. ఈ విషయాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు ఒక పద్యంలో ఎంత చమత్కారంగా చెప్పారో చూడండి.

**"వేసము వేసి పంపితివి వేదిక మీదకు, పాడువేళ నా**
**మీసములూడిపోయి విషమించె పరిస్థితి; ప్రేక్షకుల్ పరీ**
**హాసము చేయుచుండిరి; రహస్యముగా తెరవేయుమంచు నీ**
**కోసము చూచితిన్ కసరుకొంటి విదెక్కడి దర్శకత్వమో" !**

ఒక నాటక సమాజంలో ఒక నటుడుండేవాడు. అతను ఎప్పుడూ ప్రతినాయక (విలన్) పాత్రలు ధరిస్తూ ఉంటాడు. ఆ సమాజం వారు ఏ నాటకం వేసినా ఆయనది అదే రకం పాత్ర. అందువల్ల నాటకాలు వేసి వేసి రావణునికి, దుర్యోధనునికి తేడా తెలియకుండా పోయింది. అన్నింటికీ భయంకరంగా అరవడం, అతిగా నటించడం అలవాటయిపోయింది. ఒకసారి వారు కురుక్షేత్రం నాటకం వేస్తున్నారు. అందులో అతనిది దుర్యోధన పాత్ర.

దర్శకుడు ముందే అతనికి హితోపదేశం చేశాడు. "నాయనా! ఇది రాజరాజు పాత్ర. రాక్షసపాత్ర కాదు. అందుకని గొంతు చించుకోకు. గంభీరంగా నటించు, చాలు" అని హితోపదేశం చేశాడు. కానీ 'స్వభావో దురతిక్రమః' అన్నట్లుగా మనవాడికది ఎక్కలేదు. వేదిక ఎక్కి కృష్ణుడి సాయం అర్థిస్తూ ఒక పద్యం చదివాడు.

"కౌరవ పాండవుల్ పెనగు కాలము చేరువయయ్యె"

అనే పద్యాన్ని అనవసరంగా ఒత్తులు పెట్టి **"ఖౌరవ ఫాండవుల్ ఫెనగు ఖాలము ఛేరువమయ్యె"** అంటూ భయంకరంగా చదివాడు. దాంతో అంటీ ముట్టనట్లుగా అంటించిన మీసం కాస్తా ఊడి క్రింద పడింది. అది కూడా ఒక వైపే ఊడింది. ఇంకో పద్యం చదివితే గాని రెండో వైపు ఊడదు. దాని స్థితి అది.

ఈ పరిస్థితిలో ప్రేక్షకులు నవ్వుతున్నారనీ, తెరవేసెయ్యమనీ చెప్పడం కోసం దర్శకుని కేసి చూశాడట. ఆ దర్శకుడు 'నీకు ముందే చెప్పాను గదా! అతిచేష్టలు చెయ్యవద్దని' అంటూ కసురుకొన్నాడుట. ఇదీ ఈ పద్యం, సందర్భం, అర్థం, తాత్పర్యమూను.

దీన్ని మన జీవితానికి అన్వయించుకోవడం మన పని. ఆ పని కరుణశ్రీ గారు చేసేది కాదు. ఈ జీవితం అనే నాటకరంగం మీదికి భగవంతుడు మనకి తలో వేషం వేసి పంపించాడు. ఒకే మనిషికి ఒక జీవితం అయ్యేలోగా కొడుకు, తండ్రి, ఉద్యోగి, యజమాని, తాత, భర్త అనే రకరకాల వేషాలు మార్చి మార్చి వేశాడు. మనం ఎప్పటి పాత్రకు అప్పుడు న్యాయం చెయ్యగలిగితే చాలు. చిన్నప్పుడే పెద్ద బాధ్యతలు నెత్తికెత్తుకోవడం, పెద్దయినా చిన్నపిల్లల్లా చాపల్యం వదులుకోలేకపోవడం, ఆడవాళ్లు మగవాళ్లలా ఉండాలనుకోవడం, మగవాళ్లు ఆడవాళ్లలా విన్యాసాలు చెయ్యడం ఇవన్నీ అతిచేష్టల క్రిందే లెక్క



క్రికెట్‌లో వన్డే మ్యాచ్ పూర్తి కావాలంటే 50 ఓవర్లుండాలి. జీవితం అనే క్రీడ అర్థాంతరంగా ముగియడానికి మూడు ఓవర్లు చాలు. 1. ఓవర్ థింకింగ్ 2. ఓవర్ టాకింగ్ 3. ఓవర్ యాక్టింగ్.

ఎప్పుడో వచ్చే సమస్యలకి ఇప్పటినుండే ఆలోచించడం మానుకోవాలి. ఇంట్లోనైనా బయటనైనా అవసరానికి మించి మాట్లాడటం మానుకోవాలి. అలాగే అంతా మనమాటే వినాలనీ, మనకే అన్నీ తెలుసుననుకొని వృద్ధాప్యంలో బరువు బాధ్యతలు వదులుకోలేని 'అతి' తాపత్రయాన్ని కూడా వదులుకోవాలి. లేకపోతే మనకీ భంగపాటు ఖాయం. తోటివారు నవ్వడం ఖాయం. మనం కూడా జీవితానికి తెరదించేయమని దేవుడనే దర్శకుణ్ణి వేడుకోవడం ఖాయం. ఆయన కసురుకోవడమూ ఖాయమే.

# 15. కీర్తనం - ఆనందలహరి

శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే తొమ్మిది రకాలలో భక్తి మార్గాలలో కీర్తనం వరుసకు ద్వితీయమైనా వాసికి అద్వితీయం. మిగిలిన ఎనిమిది రకాల మార్గాల్లో పని సాగుతున్నా మనస్సు లీనమవుతోందో లేదో తెలియదు. కాని కీర్తనంలో ఉండే గానధర్మం వల్ల మనస్సు సహజంగానే ఆకర్షింపబడుతుంది. ఆ స్థితి కూడా లేని మందభాగ్యులకి కనీసం కొంతసేపు సత్కాలక్షేపం చేశామన్న సంతృప్తి అయినా మిగులుతుంది.

భగవత్సంకీర్తనలో ప్రథమాచార్యునిగా కీర్తింపబడే నారదుడు నారాయణ నామస్మరణలో పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంకీర్తనే ఆయనకి మూడు లోకాల్లో ఏడువాడలూ తిరిగే సామర్థ్యాన్ని ఇచ్చింది. ఆ తరువాత అంతటి వాడు, తనకు తెలియకుండానే నారదునికి శిష్యుడైన వాడు ప్రహ్లాదుడు. ఈయన గురువును మించిన శిష్యుడు. నారదుడు సంతోషంగా ఉండి సంకీర్తన చేస్తే ఈయన సంక్షోభంలో కూడా అదే పని అంత ఆనందంగా చేశాడు.

**"తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటికో**
**పన్నగశాయి ! యోదనుజభంజన! యో జగదీశ ! యో మహా**
**పన్న శరణ్య! యో నిఖిల పావన యంచు నుతించుగాని తా**
**గన్నుల నీరుదేఁడు భయకంప సమేతుఁడు కాడు భూవరా"**

హిరణ్యకశిపుని ఆజ్ఞ ప్రకారం రాక్షసభటులు భయంకరంగా హింసిస్తుంటే ప్రహ్లాదుడు చేసిన పని ఈ సంకీర్తనే. బాధలను భరిస్తూ భగవద్గుణగణగానం చేశాడే కానీ దీనంగా ఏడుస్తూ కూర్చోలేదని పోతనగారు మనకి సందేశం



ఇస్తున్నారు. మనోవేదనకు మందు లేదు అంటారు కానీ మనం ఒక నిశ్చయానికి రాగలిగితే మనోవేదనని మరచిపోవచ్చు. కానీ శరీర బాధ అలాంటిది కాదు. మనం తీసేద్దామంటే పోదు. దాని సమయం అది తీసుకొని క్రమంగా తగ్గుతుంది. అంతటి భయంకరమైన హింసని అనుభవిస్తూ ప్రహ్లాదుడు భగవత్కీర్తన మానలేదంటే ఆ కీర్తన అతనికి ఎంత బలాన్ని ఇచ్చిందో తెలుస్తోంది. మనకైనా అంతే.

భారత కాలంలో కేవలం సంకీర్తన ద్వారా సంతాపసమయాలను కూడా సమర్థంగా ఎదుర్కోగలిగిన ధీరభక్తురాలు స్వయంగా భగవంతునికి మేనత్తయైన కుంతి.

**"శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!**
**లోకద్రోహి నరేంద్రవంశదమనా ! లోకావనా ! దేవతా**
**నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా ! నిర్వాణ సంధాయకా !**
**నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ !"**

నిరంతరం కుంతి ఇటువంటి సంకీర్తనతో కాలం గడిపేదని పోతనగారు భాగవతంలో చెప్పారు. ఇందులో భగవంతునికి భక్తుడు క్రమక్రమంగా దగ్గరయ్యే విధానం కనబడుతుంది. ముందు పేరుతో పిలవడం, అనంతరం మా పుట్టింటి వారింటి మాణిక్యమా (యదుభూషణా) అనడం తరువాత మా అబ్బాయికి మరో ప్రాణమా (నరసఖా) అనడం - ఇవన్నీ క్రమక్రమంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని ఆత్మీయుని చేసుకునే విధానాలు. భగవంతుని బంధువుగానే కాకుండా ఆత్మబంధువుగా భావించింది కాబట్టే ఆ మహాసాధ్వి అప్పుడప్పుడూ ఆపదలు వచ్చేలా చూడమని (విపదః సంతు నః) ధైర్యంగా కోరగలిగింది. ఆపదల్లోనే మనం ఆయన్ని ప్రార్థిస్తామనే బలహీనతని అర్థం చేసుకొని మనందరి పక్షాన కుంతి దేవదేవుని ఆ కోరిక కోరింది.

కీర్తన ఫలం గురించి తెలుసుకోవాలంటే ఆముక్తమాల్యదలో మాల దాసరి కథ తెలుసుకోవాల్సిందే. ప్రమాదవశాత్తు రాక్షసుని బారిన పడ్డ దాసరి నారాయణుని ఆలయం ముందు చివరి కీర్తన పాడి మళ్లీ వచ్చి ఆహారంగా తనని తాను సమర్పించుకొంటానని వాగ్దానం చేసి వెళ్లి చెప్పిన సమయానికి తిగిరి వచ్చి మాట నిలబెట్టుకొంటాడు. ప్రాణం పోతున్నా సరే మాట తప్పకుండా ఉండేంత గుండెబలం భారతీయులకి, అందునా భక్తులకే సాధ్యమేమో! వచ్చిన దాసరిని చూసి పశ్చాత్తప్తుడైన బ్రహ్మరాక్షసునికి కళ్లు తెరచుకొని ఆ ప్రభాత కీర్తన ఫలం తనకు ధారపొయ్యమంటాడు. కీర్తన విలువ అనంతమని తెలిసినా దయాగుణంతో ధారపోసిన దాసరి ఔదార్యం వల్ల అతనిలోని రాక్షసత్వం పోయి బ్రహ్మత్వం మిగులుతుంది. అదీ హరినామ సంకీర్తన ఫలం.

అష్టదిగ్గజాలలో ఒకడైన ధూర్జటి తన శ్రీకాళహస్తీశ్వర శతకంలో శివనామ సంకీర్తన అసాధ్యాలను సుసాధ్యాలుగా చేస్తుందని నిరూపించాడు.

**“పనిపుష్పంబగు, నగ్నిమంచగు, నకూపారంబు భూమీస్థలం**
**బవు, శత్రుండతి మిత్రుడౌ, విషము దివ్యాహారమౌ నెన్నగా**
**నవనీమండలి లోపలన్ శివశివేత్యాభాషణోల్లాసికిన్**
**శివ! నీనామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహస్తీశ్వరా” !**

శివనామ సంకీర్తన నిరంతరం చేస్తూ ఉండేవారి మీద పిడుగులు పడితే అవి పూలుగా మారిపోతాయి. వారి ఇంటికంటుకొన్న నిప్పు మంచుగా మారిపోతుంది. వారు ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడితే వారికోసం ఒక ద్వీపం అప్పటికప్పుడు, అక్కడికక్కడే రూపొందుతుంది. వారి శత్రువులు వారింటిముందుకు వచ్చి స్నేహహస్తం చాపుతారు. వారి మీద ఎవరైనా విష ప్రయోగం చేస్తే అది వారికి పోషకాహారం అవుతుంది. వీటన్నింటికీ ఉదాహరణలు పురాణకాలంలోనే కాదు, నవీన కాలంలోనూ దొరుకుతాయి.



నవీన కాలంలో మనకంటె ముందు తరంలో సంకీర్తన వల్ల మహాయోగం పొందిన నాదయోగి త్యాగరాజు.

**“రాగము రామపాద, మనురాగము జానకి కాలి అందెలన్**
**మ్రోగెడి దివ్యనాద, మనుమోదిత తాళము వాయునందనుం**
**దేగిన సాగరోర్మికల నెంతయునూగెడి మిశ్రచాపమై**
**త్యాగయ పాడె సత్కృతులు ధారుణి తెల్లులవెల్లు నింపుచున్”**

***(సాగరఘోష – గరికిపాటి)***

త్యాగరాజస్వామి సత్కారాల కోసం, పురస్కారాల కోసం, పద్మభూషణాల కోసం కీర్తనలు పాడలేదు. ఆయన కీర్తనల్లో రాగం రామునిపాదం. ఆర్ద్రత సీతా మహాసాధ్వి పాదమంజీర ధ్వని. మారుతి తరించిన మహాసాగర తరంగాల మిశ్రచాప రూపమే ఆయన పాటకు తాళం. అంతిమ లక్ష్యం ఆత్మానందమని త్యాగరాజు తన కీర్తనల ద్వారా సంగీత సాహిత్యవేత్తలకు సలహా ఇచ్చాడు. పాటించడం, పాటించకపోవడం మన సంస్కార స్థాయికి సంబంధించిన విషయం.

చివరిగా ఒక చమత్కారం – ‘రామ’ అనే శబ్దాన్ని తెలిసి పలికినా, తెలియక పలికినా ఎటువంటి పలుకుల్లో భాగంగా పలికినా అవి జీడిపప్పు పలుకులై ముక్తి సుగంధాన్ని మనస్సుకి అందిస్తాయట. ఒకానొక అరణ్యంలో వేటాడుతూ తిరుగుతున్న కిరాతుల్ని ఎవరు ప్రశ్నించినా వారు వారి దినచర్యను ఈ విధంగా వివరిస్తున్నారట.

**వనే చరామః వసుచాహరామః**
**నదీం స్తరామః న భయం స్మరామః**
**ఇతీరయంతో విపినే కిరాతాః**
**ముక్తింగతా రామపదానుషంగాః**

"మేం అడవుల్లో తిరుగుతూ ఉంటాం (చరామః) జంతువుల్ని వేటాడి అమ్మి ధనం తెచ్చుకొంటూ ఉంటాం (ఆహరామః). నదీనదాలు సులువుగా దాటేస్తూ ఉంటాం (తరామః). భయం మా మనస్సులోకే రాదు (న స్మరామః)." అంటూ ఉంటే అనుకోకుండా ఆ మాటల్లో 'రామః రామః' అని పలుమార్లు రావడం వల్ల రామసంకీర్తన చేసిన ఫలం లభించి వారు మోక్షం పొందగలిగారట. ఎంత చమత్కారం! లీలామానుష వేషధారియైన భగవంతుని దృష్టిలో ఈ సృష్టియే ఒక పెద్ద చమత్కారం.

అంత శక్తి గలిగిన భగవన్నామ సంకీర్తనతో జీవుడు ఆనందలహరిగా మారి ఆత్మానందమహాసాగరంలో లీనం కావడమే జీవన పరమార్థం.



# 16. ఒకే పద్యంలో విద్యా వ్యవస్థ

సృష్టిలో ప్రతి ప్రకృతి శక్తిని దేవతగా భావించడం భారతీయ సంప్రదాయంలో విశిష్టత. ఒక్క ప్రకృతి శక్తులనే కాదు మన జీవితంలో అత్యవసరమైన ధనం మన దృష్టిలో వట్టి రూపాయి కాదు. సాక్షాత్తు లక్ష్మీదేవి. అలాగే జ్ఞానాన్నిచ్చే విద్య కేవలం చదువు కాదు. సాక్షాత్తు సరస్వతీదేవి.

అటువంటి సరస్వతిని బమ్మెర పోతన తన భాగవతంలో విశేషంగా ప్రార్థించాడు. ఆ పద్యం భారతీయ విద్యావ్యవస్థను మొత్తం ప్రతిబింబిస్తుంది.

**"క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత**
**శ్రోణికి చంచరీకచయ సుందరవేణికి, రక్షితామర**
**శ్రేణికి, తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిన్**
**వాణికి, అక్షదామశుక వారిజ పుస్తక రమ్య పాణికిన్"**

ఈ పద్యం చివరి పాదంలో సరస్వతీదేవి చేతుల్లో జపమాల (అక్షదామం), చిలుక (శుకం), పద్మం (వారిజం), పుస్తకం ఉంటాయని వర్ణించాడు. మనం ఇప్పుడు చూస్తున్న సరస్వతి చిత్రంలో జపమాల, పుస్తకం ఉండి మరో రెండు చేతుల్తో వీణ వాయిస్తూ ఉంటుంది. పోతన ఈ మూర్తినే వర్ణించి ఉంటే వీణ ఎందుకు వదిలేస్తాడు? పైగా చేతుల్లో లేని పద్మాన్ని, చిలుకను, చేతుల్లోనే ఉన్నట్లుగా 'రమ్యపాణికిన్' అని ఎందుకు వర్ణిస్తాడు? అంటే మనం చూస్తున్న సరస్వతీమూర్తి వేరనీ, పోతన వర్ణించిన మూర్తి వేరనీ అర్థమవుతోంది గదా! అయితే వీణ లేకుండా అక్షదామశుకవారిజ పుస్తకాలు చతుర్భుజాల్లో ధరించిన ఈ మూర్తి ఎవరు? ఇదే దృష్టితో వేద విద్యలోను, సంస్కృత సాహిత్యంలోను నిష్ణాతులయిన పెద్దలతో ఆలోచిస్తే వారు పోతన వర్ణించింది 'శారదామూర్తి' అనీ, ఆవిడ వైదిక విద్యలకు అధిదేవత అనీ, మనం చూస్తున్న సరస్వతీమూర్తి

లౌకిక విద్యలకు అధిదేవత అనీ వారి అభిప్రాయం చెప్పారు. ఈ వాదానికి సమర్ధనగా శృంగేరీ శారదాపీఠం వారు ప్రకటించిన శారదామూర్తిని చూస్తే ఆవిడ చేతుల్లో ఈ నాలుగు ఉండటం, వీణ లేకపోవడం కనిపిస్తుంది. మొత్తం మీద పోతన ప్రార్థించిన 'వాణి' లలితా దేవి యొక్క జ్ఞానస్వరూపంగా భావించే 'శారదాదేవి' అని బోధపడుతుంది. మొత్తం మీద కొండని త్రవ్వి 'ఎలుక'ను కాదు; 'పలుకు చిలుక'ను పట్టగలిగాం.

ఇక ఇప్పుడు – అసలీ నాలుగు వస్తువులు శారదాదేవి చేతుల్లో ఎందుకు ఉంటాయి? వాటి పరమార్థం ఏమిటి? అని ఆలోచిస్తే భారతీయ విద్యాలక్ష్యాలన్నీ బోధపడతాయి. భారతీయ జీవన విధానంలో ఒక ప్రత్యేకత ఉంది. ఏ మనిషయినా, స్త్రీ పురుషులలో ఎవరయినా ధర్మ, అర్థ, కామ, మోక్షాలు వరుసగా సాధించడమే జీవిత లక్ష్యంగా భావిస్తారు. విద్య ద్వారా ఈ చతుర్విధ పురుషార్థాలు సాధించడమే లక్ష్యమని ఆ నాలుగు ప్రతీకలు సూచిస్తున్నాయి. అమ్మవారి చేతుల్లో ఉండే పుస్తకం ధర్మానికి ప్రతీక. పుస్తకం ద్వారానే మనకు అన్ని ధర్మాలు తెలుస్తాయి. పద్మం అర్థానికి ప్రతీక. పద్మం నుండే లక్ష్మీదేవి జన్మించింది. చిలుక కామ పురుషార్థానికి ప్రతీక. మన్మథుని వాహనం చిలుకే గదా! జపమాల మోక్షానికి ప్రతీక. జపతాపాల ద్వారానే గదా సిద్ధి పొందేది. విద్య ద్వారా ఈ నాలుగు పురుషార్థాలు సాధించాలనీ, అప్పుడే మనిషికి భవబంధాల నుండి విముక్తి అనీ తెలియజేయడం కోసమే విద్యాదేవత తన చేతుల్లో ఆ నాలుగు వస్తువులనీ ధరించిందని గ్రహించవచ్చు. **'సావిద్యా యా విముక్తయే'** అని గదా ఆర్యోక్తి.

మనిషి ధర్మంగా జీవించాలి. మంచి వృత్తులు చేపట్టాలి. ఆధర్మం ద్వారా అర్థం సంపాదించాలి. ఆ అర్థం ద్వారానే సముచితమైన కామనలు (కోరికలు) తీర్చుకోవాలి. ఆ కోరికల్లో పడి కొట్టుకుపోకుండా మోక్షం కోసం ప్రయత్నించాలి. ఇదే మానవ జీవిత లక్ష్యమని భారతీయ సంస్కృతి ప్రబోధిస్తోంది. అందుకే



పోతన అమ్మవారి స్వరూపాన్ని ఆ విధంగా వర్ణించాడు. ఇదీ తెలుగు పద్యం పరమార్థం.

మనవాళ్లు ఈ విషయం ఇంతటితో వదిలెయ్యలేదు. ఒకటో తరగతి తెలుగు వాచకం మొదటి పుటలో అమ్మ, ఆవు, ఇల్లు, ఈశ్వరుడు అనే నాలుగు పదాలలో సరిగ్గా ధర్మార్థ కామమోక్షాలనే సూచించారు. అమ్మ ధర్మానికి ప్రతీక. పుస్తకం కంటె ముందుగా అమ్మనుండే మనం అన్ని ధర్మాలు తెలుసుకొంటాం. ఆవు అర్థానికి ప్రతీక. వెనకటి రోజుల్లో 'పంచగవధనం' అని గోవులను క్రయవిక్రయాలలో డబ్బుగా వాడేవారు. ఇల్లు కామ పురుషార్థానికి ప్రతీక. సమస్త కామనలకు మూలం సంసారం. ఆ సంసారానికి నిలయం ఇల్లు. ఇక ఈశ్వరుడు మోక్షానికి ప్రతీక అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు గదా. ఇప్పుడు లౌకికవాదం పుణ్యమా అని ఈశ్వరుణ్ణి తీసేసి 'ఈగ'ని పెట్టారు. అందుకే విద్యార్థుల్లో ఈశ్వరారాధన బుద్ధి పోయి, ఉద్యోగాలు లేక ఈగలు తోలుకొంటూ కూర్చునే బుద్ధి బయలుదేరింది.

తెలుగు మాధ్యమంలో ఇంత సార్థకమైన విద్య సాగుతుంటే ఇంగ్లీషు మీడియంలో దీనికి పూర్తి భిన్నంగా ఉంది పరిస్థితి. 'ఏ ఫర్ ఆపిల్' అనేది మొదటి పదం. అంటే ముందు తిండి గురించి చెబుతున్నామన్నమాట. బి ఫర్ బ్యాట్ అంటే క్రికెట్ ఆట చాలా ముఖ్యం అని చెబుతున్నాం. తరువాత సి ఫర్ క్యాట్, డి ఫర్ డాగ్ అని నేర్పుతున్నాం. అంటే పిల్లిలా కపటత్వాన్ని, కుక్కలా బానిసత్వాన్ని నేర్పుతున్నాం. పవిత్రంగా జీవిత లక్ష్యాన్ని చేర్చే పురుషార్థాలెక్కడ? ఈ పనికిమాలిన మాటలెక్కడ? సింహాలు, పులుల వంటి వీరులుగా తయారవవలసిన విద్యార్థులకి దీన హీన జంతువుల పరిచయంతో విద్యాభ్యాసం ప్రారంభిస్తే భవిష్యద్భారతం ఎలా ఉంటుంది ! ఒక్కసారి ఊహించండి ! ఆ పైన ఏ విద్య నేర్పాలో నిర్ణయించుకోండి.

# 17. నాలుగు పద్యాల్లో నాలుగు పురుషార్థాలు

భారతీయ సాహిత్యంలో – ముఖ్యంగా ఆధ్యాత్మిక సాహిత్యంలో ఒక ప్రత్యేకత ఉంది. ఏ విషయాన్నైనా ఎంతగా విస్తరించి చెప్పగలదో అంతగా కుదించి కూడా చెప్పగలదు. ఇది మహాకవుల, మహావక్తల లక్షణం. భారతీయ జీవన విధానానికి ఒక ప్రత్యేకత ఉంది. ధన, కనక, వస్తు వాహనాలను ఎంతగా సంపాదించి విస్తృతమైన సంసారాన్ని ఏర్పాటు చేసుకొంటుందో అంతగానూ తనలోకి తాను చొచ్చుకుపోయి అన్నింటినీ ఒక క్షణంలో వదిలేసి ఉండగలదు కూడా. ఇందుకు కారణం ఒక్కటే. భారతీయ జీవనం అయోమయం కాదు, బ్రహ్మమయం.

జీవితంలో ప్రతి సందర్భాన్ని పండుగగా మలచుకోవాలంటే, సృష్టిలో ప్రతి వస్తువులోను పరమాత్మను దర్శించాలంటే ఇక్కడ ప్రతి మనిషి నాలుగు పురుషార్థాల సాధనకు కట్టుబడి ఉండాలి. అవే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. వీటిని అదే వరుసలో సాధించాలి. తొందరపడి దూకకూడదు. నెమ్మదిగా నడిచి ఒక్కోమైలు రాయీ దాటాలి. అందుకు మనస్సును మన అదుపులో ఉంచుకోవడం చాలా ప్రధానం. ఇందుకు మన తెలుగు సాహిత్యంలో నాలుగు పద్యాలు మనకు దీపస్తంభాలుగా నిలిచి దారి చూపిస్తాయి.

మొదటి పురుషార్థం ధర్మం. దాన్ని సాధించాలంటే మనిషి ఎంత స్థిరంగా ఒకే చోట నిష్ఠతో ఉండాలో, 'మనుచరిత్ర' కావ్యంలో అల్లసాని పెద్దన చెబుతారు.

**"ఆపురిబాయకుండు – మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా**
**షాపర శేషభోగి, వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీ**



**క్షాపరతంత్రు, డంబురుహగర్భ కులాభరణం, బనారతా**
**ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యు డలేఖ్య తనూ విలాసుడై"**

**– మనుచరిత్ర**

ఇదంతా ప్రవరుని రూపగుణవర్ణన. ఇందులోనే ఆంధ్రకవితా పితామహుడు ధర్మ పురుషార్థ సాధనకు మార్గం చూపించాడు. ప్రవరుడు మన్మథుడంతటి సుందరాంగుడట. కాబట్టే ఆయన ఉన్న ఊరు విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్లలేదట. అంతటి అందగాడు ఇంటిని, ఇల్లాలిని విడిచిపెట్టకుండ ఉండటం ఆయన సంసారానికీ, ఇతరుల సంసారాలకు కూడా మంచిది. అనుకోని సరదాపుట్టి ఆయన హిమాలయాలకి వెళితే జరిగిందేమిటో మనకు తెలుసు కదా! అలాగే ఆయన భాషాపాండిత్యంలో ఆదిశేషుడట. ఆదిశేషుడు కూడా ఉన్న చోటునుండి కదలడు. ఆయన శ్రీ మహావిష్ణువుకి స్థిరమైన శయ్య, ఆ ప్రవరుడు ఎన్నో ధర్మకర్మలు దీక్షగా చేస్తూ ఉండాడట. కాబట్టే ఆపురి బాయకుండా ఉండాలి. దీక్షపట్టిన వాళ్లు ఇల్లు కదలరు కదా! ఆయన "అంబురుహగర్భకులాభరణం"ట. "అంభురుహం" అంటే పద్మం. అది చెరువులోంచి కదలదు. కదిలితే తెగిపడిపోవడం ఖాయం. సరస్సులో ఉంటేనే దాని అందం. చూడదలచిన వాళ్లు అక్కడికే వస్తారు. "అంబురుహ గర్భుడు" అంటే బ్రహ్మదేవుడు. ఆయనా కదలడు. అటువంటి వంశంలో పుట్టాడు. కాబట్టే ప్రవరుడు కూడా ఊరు విడిచిపెట్టని పరమనిష్ఠాగరిష్ఠుడు. పైగా ఆయన అనారత–అధ్యాపన–తత్పరుడు. అంటే ఎప్పుడూ విద్యార్థులకు వేదపాఠాలు చెబుతూనే ఉంటాడు. అటువంటి వాడు ఇల్లు విడిచిపెట్టడం ఎలా వీలవుతుంది? అందుకే ఈ పద్యంలో ప్రవరుని లక్షణాలను తెలియజేయడానికి వాడిన ఉపమానాలన్నీ, విశేషణాలన్నీ, రూపకాలన్నీ కదలనివే. ప్రవరుని సుస్థిరమైన ధర్మనిష్ఠను చిత్రించడానికి పెద్దన గారు స్థిరమైన వస్తువులనే, వ్యక్తులనే తీసుకొన్నారు. "ఆపురిబాయకుండు" అనే మాట మొదట చదివి వదిలేయకుండా ప్రతి లక్షణం తరువాత... "కాబట్టి

అపురిబాయకుండు" అని చదువుకుంటే పద్యం అన్వయం మరింత అందంగా ఉంటుంది. ప్రథమ పురుషార్థమైన ధర్మాన్ని సాధించడం అంటే నిశ్చలంగా నిశ్చయంగా స్వధర్మ నిర్వహణ చేయడమే. హిమాలయ యాత్ర పేరు మీద ఊరు వాడ విడిచి ఉత్తరంగా ఎగిరిపోయిన ప్రవరుడు ఎదుర్కొన్న ఇబ్బందులూ, మానసిక క్షోభ మనం మనుచరిత్రలో చదువుకున్నాం. చివరికి అతన్ని క్షేమంగా ఇంటికి చేర్చింది కూడా అతని స్వధర్మ నిర్వహణే. బ్రాహ్మణుని ధర్మం నిత్యాగ్నిహోత్రం. ఆ అగ్నిహోత్రుడే అతన్ని హిమాలయాల నుండి ఇంటికి చేర్చాడు. అలాగే మనం అంతా సమాజంలో అస్తవ్యస్త పరిస్థితులకు భయపడకుండా, ఆకర్షణలకు లొంగకుండా మన కర్తవ్యం మనం చేస్తే అది మనల్ని రక్షిస్తుంది.

**"ధర్మో రక్షతి రక్షితః"**

చతుర్వధ పురుషార్థాలలో ధర్మం తరువాతిది, ధర్మం చేత అదుపులో పెట్టబడవలసింది అర్థం. అంటే ధనం. ధర్మం దీనికి మూలమై ఉండాలి. ధర్మంగానే ధనం సంపాదించాలి. అధర్మంతో ఆర్జించిన విత్తం అనూహ్యంగా చేజారిపోతుంది. అర్థపురుషార్థం విషయంలో మనం మనస్సును ఎలా అదుపులో పెట్టుకోవాలో బమ్మెర పోతన భాగవతంలోని వామన చరిత్రలో వామనుని చేత చెప్పిస్తాడు.

**"వ్యాప్తింజెందక వగవక**
**ప్రాప్తించిన లేశమైన పదివేలనుచున్**
**తృప్తింజెందని మనుజుడు**
**సప్తద్వీపములనైన "జక్కంబడునే"**

**- భాగవతం - వామనచరిత్ర**



ధనం విషయంలో ఎప్పుడూ అసంతృప్తి పనికిరాదు. మరింత ప్రచారాన్ని (వ్యాప్తి) కోరుకోరాదు. లభించిన సొమ్మునే పదివేలుగా భావించగలిగినవాడు లక్ష్మీకటాక్షాన్ని సమృద్ధిగా పొందగలుగుతాడు. అటువంటి తృప్తిలేనివాడు సప్త ద్వీపాల్లో పదునాలుగు లోకాల్లో ఎక్కడ తిరిగినా ఎన్ని స్వాధీనం చేసుకొన్నా సంతృప్తిని పొందలేడు. మొత్తం మీద 'ఇక చాలు' అనుకుంటే తప్ప అర్థ పురుషార్థాన్ని సాధించి మన లక్ష్యానికి ఉపయోగపడేలా చేసుకోలేం.

మూడవది మూలమైనది కామ పురుషార్థం. నాలుగు పురుషార్థాలలో ఇది చాలా విలక్షణమైనది. ఈ కామం పురుషార్థాలలోనూ ఉంటుంది. అరిషడ్వర్గాల్లో కూడా ఉంటుంది. మానవుడు తప్పనిసరిగా సాధించవలసిన పురుషార్థాలలోనూ కామం ఉండటం, దూరంగా ఉంచవలసిన, వ్యతిరేకించవలసిన అరిషడ్వార్గల్లోను (కామక్రోద లోభ మోహ మదమాత్సర్యాలు) కామం ఉండటం ఆశ్చర్యం కదూ! అదే వైదిక ధర్మంలో సూక్ష్మం. తన జీవిత భాగస్వామి యందు కలిగిన కామవాంఛ పవిత్రమైన పురుషార్థం. ఇతరుల యందు కలిగిన కామవాంఛ భయంకరమైన శత్రువు. అందుకే ఈ కామాన్ని మొగ్గలోనే త్రుంచెయ్యాలి. ఎదగనీయకూడదు. ఇందుకు ఉదాహరణగా సారంగు తమ్మయ్య రచించిన "వైజయంతీ విలాసం" కావ్యంలోని పద్యాన్ని పేర్కొనవచ్చు. ఆ కావ్యంలో పూజారియైన విప్రనారాయణుని వేశ్యయైన దేవదేవి లొంగదీసుకొందుకు వీర ప్రయత్నాలన్నీ చేస్తుంది. ఆ ప్రయత్నాలను మొదట్లోనే త్రుంచేస్తూ విప్రనారాయణుడు చక్కని మాట చెబుతాడు.

**"కాకులు రావి పళ్లు తిని గ్రక్క శిలామయదేవ మందిరా**
**నీకము నందు రావులు జనించును, సజ్జన చిత్తవృత్తి అ**
**వ్యాకులలీల రాతి గుడి వంటిది, లోకములోని వేశ్యలున్**
**కాకుల వంటివార లటుగాన ప్రమాదము చేరనిచ్చినన్"**

**- వైజయంతీ విలాసం**

(సాధారణంగా గుడి ప్రక్కన రావిచెట్టు ఉంటుంది. దాని పుట్టుక చాలా విచిత్రం. గుడికి ప్రహరిగోడ పెద్దదే ఉంటుంది గదా! ఆ గోడ ప్రక్క రావిచెట్టు మీద వాలిన కాకులు రావిపళ్లు గోడమీద పెట్టుకొని తింటాయి. అలా తినడంలో కొన్ని గింజలు గోడమీద చెదురుమదురుగా ఉండిపోతాయి. ఆ గింజలు ఆ ప్రహరీ గోడ కుండే సన్నని బీటల్లో చేరుతాయి. ఆ పైన ఎప్పుడో వర్షం కురుస్తుంది. ఆ పగుళ్లలో నీళ్లు చేరతాయి. దాంతో ఆ గింజలు మొలకెత్తి గోడలో రావి మొక్కలు మొదలై క్రమంగా ఎదిగి ఎదిగి అంత పెద్ద ప్రహరీ గోడలని చీల్చేస్తాయి. గింజల కోసం వాలిన కాకులు ఇంతటి నష్టం కలిగిస్తాయని రాతికీ తెలియదు. గుడికీ తెలియదు. గుడిలో స్వామికి తెలిసినా మానవుల అజాగ్రత్తకు ఆయన ముసిముసి నవ్వులు నవ్వుకొని ఊరుకొంటాడు.)

అదే విధంగా మంచివారి మనస్సు రాతి గుడి లాంటిదట. వేశ్యలు, కాకుల వంటివారట. వీళ్లు నెమ్మది నెమ్మదిగా తమ వెర్రి మాటలు, వెకిలి చూపులు అనే గింజలు సజ్జనుల మనస్సులో నాటుతూ ఉంటాయి. సజ్జనులు మొదట్లో 'మనల్ని అవేం చేస్తాయిలే' అని అశ్రద్ధ చేస్తే, అవి నాటుకొనే అవకాశం ఇస్తే ఆ వెర్రి మాటలూ, వెకిలి చేష్టలే మనస్సులో కామరూప మహావృక్షాలై వారి జీవితాన్ని నిలువునా చీల్చేస్తాయి. అందువల్ల ముందునుంచే అటువంటి వారికి దూరంగా ఉండటం చాలా మంచిదని విప్రనారాయణుడు దేవదేవికి కఠినంగా సమాధానం చెప్పాడు. ఇంతా చెప్పిన పెద్దమనిషి చివరకు ఆవిడ వలలో ఎలా పడిపోయాడనేది ఆయన గ్రహస్థితికి సంబంధించిన విషయం. మన పరిస్థితికి మనం పద్యంలో ఉండే సూక్ష్మం గ్రహించి కామం విషయంలో ఎక్కడ పురుషార్థమో, ఎక్కడ పరమశత్రువో గ్రహించి జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది.

ఇక నాలుగవ పురుషార్థం మోక్షం. ఇది సాధించాలంటే జీవితంలో మన పాత్రకు మనం పరిమితం కావాలి. అంతేగాని అతిగా రాసుకోవడం,



పూసుకోవడం పనికిరాదు. ఆ రకమైన పాత్రధారణ ఎలా చెయ్యాలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి పద్యరత్నం తెలియజేస్తుంది.

**"వేసము వేసి పంపితివి వేదిక మీదకు, పాడువేళ నా**
**మీసము లూడిపోయి విషమించె పరిస్థితి; ప్రేక్షకుల్ పరీ**
**హాసము చేయుచుండిరి; రహస్యముగా తెర వేయుమంచు నీ**
**కోసము చూడగా కసరుకొంటి విదెక్కడి దర్శకత్వమో!"**

ఈ పద్యం నాటకంలో నటుడికి జీవితంలో మనకు శ్లేష సాధిస్తోంది. దుర్యోధనుడి పాత్రలో గంభీరంగా నటించే నటుడొకడు పద్యం పాడేటప్పుడు అనవసరంగా మీసాలు పదే పదే మెలివేసేసరికి అవి కాస్త ఊడిపడ్డాయి. ప్రేక్షకులు గొల్లున నవ్వసాగారు. చేసిన తప్పు దిద్దుకోవడానికి ఒకసారి తెర దించమని దర్శకుణ్ణి కోరితే కస్సుమని తారామండలం స్థాయిలో లేచాడట - అతిగా ఎందుకు చేశావని. జీవులమైన మనందరి పరిస్థితి ఇంతే. భగవంతుడనే దర్శకుడు అందరికీ తలోపాత్ర ఇచ్చి కొద్దిసేపు ఈ ప్రపంచ నాటక రంగస్థలం మీద నటించండ్రా అంటే అందరం మన పరిమితిని మరిచిపోయి ఎక్కడలేని పెత్తనాలు చేసేసి పీకల మీదికి తెచ్చుకొని ఎలా పరిష్కరించాలో తెలియక జీవితానికి తెరదించేయమని ఏడుకొండలవాడి దగ్గర ఏడుస్తున్నాం. అలా కాకుండా నిర్మలంగా, నిరహంకారంగా మన బాధ్యతలు మనం నిర్వర్తిస్తే పరిస్థితి అంతవరకూ రాదు. అది ఈ పద్యం ద్వారా మోక్ష పురుషార్థాన్ని సాధించడానికి గ్రహించవలసిన అంతరార్థం. తెలుగు పద్యాల్లో ఇంతటి ఆధ్యాత్మిక శక్తి ఉంది. అందుకే పాల్కురికి సోమన "తెలుగు మాటలనంగ వలదు, వేదములు కొలదియగా చూడుడి" అని పేర్కొన్నాడు.

# 18. గాలి చేసిన గమ్మత్తు

ఏ గూటి చిలుక ఆ గూటి పలుకు పలుకుతుందన్నట్లే ఏ నేల గాలి ఆ నేల సుగంధాన్ని వ్యాపింపజేస్తూ ఉంటుంది. భారతదేశంలో ఏ మూల గాలి వీచినా ఆ గాలి భారతీయ ధర్మ సంస్కారాన్ని ప్రతిబింబిస్తుంది. అలా వీచిన ఒక గాలి గురించి సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా పేరుపొందిన శ్రీకృష్ణ దేవరాయలు తన ఆముక్తమాల్యద కావ్యంలో ఎంత గంభీరంగా వర్ణించి చెప్పాడో చూడండి.

**“మలయపు గాలి రేల వనమాలి విమాన పతాక ఘల్లుమం**
**చలియ, పసిండి మువ్వగమి నొక్కొక మాటు కదల్ప, నుల్కి, మి**
**న్నలము తదీయ హేమ వరణాంచల చంపక శాఖలందు ప**
**క్షులు రొదసేయ వేగెనని కూడుదురల్కలు దీరి దంపతుల్”.**

ఆముక్తమాల్యద ప్రథమాశ్వాసంలో శ్రీ విల్లుపుత్తూరులోని తోటలను, భవనాలను, చెరువులను, మరెన్నో విశేషాలను వర్ణిస్తూ ఆ కవిరాజు ఈ మనోహర భావాన్ని ఆత్మీయంగా మన ముందుంచారు.

ఆ ఊళ్లో అర్ధరాత్రివేళ అందరూ ఆదమరచి నిద్రపోతూ ఉండగా ఒక గాలి వీచిందట. అది మలయపుగాలి. అంటే దక్షిణ దిశ నుండి వీచిన గాలి అన్నమాట. ఆ గాలి ఏమీ ఎరగనట్లు తన దారిన తాను వీస్తూనే ఎన్ని గమ్మత్తులు చేసిందో చూడండి. నెమ్మదిగా వీచిన ఆ మలయపు గాలి విష్ణుమూర్తి గుడి ముంగిట ఉన్న ధ్వజస్తంభపు గంటలను తాకిందట. ఆ తాకిడికి ఆ గంటలలోని బంగారు మువ్వలు సవ్వడి చేశాయట. ఆ సవ్వడికి బంగారపు ప్రహారిగోడ చివర ఉన్న సంపెంగ చెట్టుపైన నిద్రపోతున్న పక్షులు తెల్లవారిందనుకొని భ్రమపడి లేచి వేటకు బయలుదేరడం కోసం తోటి పక్షుల్ని లేపుతూ పెద్దగా



రొద చేస్తున్నాయట. ఆ రొదకు మెలకువ వచ్చి నిద్రపోతున్న దంపతులు లేచారట. ఆ దంపతులు రాత్రి పడుకోబోయే ముందు ఏదో ప్రణయకలహం కారణంగా ఎడముఖం పెడముఖంగా పడుకొన్న వాళ్లట. వాళ్లు ఈ పక్షుల రొదకి తెల్లవారిందనుకొని భ్రమపడి లేచి అనవసరంగా కోపతాపాలతో బంగారం లాంటి ఏకాంత సమయం వృథా చేసుకొన్నందుకు చింతిస్తూ, ఒకరివైపు మరొకరు తిరిగి ప్రేమగా ఏకమయ్యారట. ఇదీ కథ. ఒక్క చిరుగాలి ఇంతపని చేసిందన్నమాట.

ఇందులో నాలుగు సంఘటనలను నాలుగు పాదాల చంపకమాలలో దండగా గ్రుచ్చడం అంతరార్థం అయితే భారతీయ జీవన లక్ష్యాలయిన ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలను అన్వయింపజేయడం పద్యంలోని పరమార్థం.

గాలి వీయడం ధర్మం. అది ఎవరికోసమూ వీయలేదు. ఇన్ని పరిణామాలు జరుగుతాయని అది ఊహించనూ లేదు. మామూలుగా తన ధర్మం తాను చేసింది. పక్షులు భ్రమపడి తెల్లవారిందనుకొని లేచి వేటకు బయలుదేరడం అర్థ పురుషార్థం. దంపతులు లేచి ప్రేమగా కలవడం కామ పురుషార్థం. గుడిలోని ధ్వజస్తంభం గంటలు మ్రోగడం మోక్ష పురుషార్థం. అంటే ప్రశాంతంగా పిల్లగాలి వీచినట్లుగా మన ధర్మం మనం నిర్వహిస్తూ పోతుంటే మిగిలిన అర్థ కామ మోక్షాలనే మూడు పురుషార్థాలను అనాయాసంగా ఆ ధర్మమే సాధిస్తుందన్నమాట. ఇదీ ఉపదేశం.

ఇందులో కొసమెరుపు ఏమిటంటే – గాలి సహజంగానే వీచింది. గంటలూ సహజంగానే మ్రోగాయి. కాని పక్షులు సహజంగా లేవలేదు. భ్రమపడి లేచాయి. దంపతులు కూడా తెల్లారిందనుకొని భ్రమపడి లేచి కలిశారు. అంటే అర్థకామాలు మనల్ని భ్రమలో పడేస్తాయి. కాని ధర్మమోక్షాలు అలా కాదు. భ్రమలు పోగొట్టి సత్యదర్శనం చేయిస్తాయి. ఇదీ తెలుగు పద్యాల్లో కనిపించే పరమార్థం.

# 19. రాజధర్మ ప్రతీక - రాయల కావ్యం

మనిషి మెదడు రెండు భాగాలుగా ఉంటుంది. అందులో కుడిభాగం శాస్త్ర సాంకేతిక విషయాలకు ఎక్కువగా స్పందిస్తుందని, ఎడమ భాగం కళాభావాలకు ఎక్కువగా స్పందిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక మనిషి మెదడులోనే రెండు భాగాల మధ్య ఇంత తేడా ఉన్నప్పుడు ఒకే భూమండలం మీద ప్రాక్పశ్చిమ భాగాల మధ్య మరెంతో తేడా ఉండటం ఆశ్చర్యమేమీ కాదు. తూర్పు దేశాలలో కవులు, కళాకారులు ఎక్కువగా ఉండటానికి, పశ్చిమ దేశాలలో శాస్త్రవేత్తలు ఎక్కువగా ఉండటానికి కారణం ఇదే. ఇది భగవంతుని సృష్టిలోని వైవిధ్యమే తప్ప వైరుధ్యం కాదు.

రాగరంజితమైన ఒక సంధ్యాసమయంలో సహజ జలధారలతో సాగిపోయే నదీతీరంలో ఒక కొండ ప్రక్కన నిలబడి చూస్తున్న ఒక భారతీయునికి ఏమనిపిస్తుంది? అక్కడ ఎవరైనా ఒక గుడి కడితే బాగుండుననిపిస్తుంది. అదే ఒక పాశ్చాత్యునకైతే తానే ఒక ఖరీదైన హోటల్ కట్టేయాలనిపిస్తుంది. అదీ తేడా. ఈ భేదం వారికి మనకి భాషా నిర్మాణంలో, వేషధారణలో, భావధారలో, పరిశోధనాసారంలో, ఆలోచనలో, ఆతిథ్యంలో, ధనార్జనలో, ధర్మనిర్వహణలో అన్నింటా.... అన్నిటా కనిపిస్తుంది.

అంత ప్రత్యేకతను సంతరించుకొన్న భారతీయధర్మ సంస్కారం 'ఆముక్తమాల్యద' కావ్యంలో ఎలా వ్యక్తమయ్యిందో తెలుసుకొందాం. ఈ కావ్యరచన విషయంలో పెద్ద చర్చ ఉంది. ఇంత లోతైన కావ్యాన్ని రచించే తీరిక రాయలకు లేదనీ దీన్ని పెద్దన్నో, మరెవరో రచించారని కొందరి అభిప్రాయం. కానీ ఈ కావ్యశైలికి, పెద్దన శైలికి చాలా తేడా ఉంది. ఇందులో ఒక 'రాజు' మాత్రమే రాయగలిగిన పద్యాలు చాలా ఉన్నాయి. అదీగాక కవిత్వం



రచించడానికి ఉండవలసింది తీరిక కాదు. తీవ్రమైన కోరిక. ఆ కోరిక తీవ్రంగా ఉంది కాబట్టే పగలు ఉమ్మత్తూరు కోటపై దండెత్తి ఆ విశేషాల్ని రాత్రి కూర్చొని గోదాదేవి విరహవేదనలో చేర్చి వర్ణించాడు. (తలిరుంగైదువు - ఆముక్త 5-85)

ఈ కావ్యంలో తృతీయాశ్వాసంలో 'ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానం' అని భారతీయ రాజనీతిని విశదీకరించే చక్కని కథ ఒకటి ఉంది. ఈ ఇద్దరికీ జరిగిన యుద్ధంలో ఖాండిక్యుడు ఓడిపోయి అడవుల పాలయిపోతాడు. అయినా మంచి రోజుల కోసం ఎదురుచూస్తూ తాత్త్విక చింతనతో జీవితం గడుపుతూ ఉంటాడు. ఈలోగా జయించిన కేశిధ్వజుడు ఒక యజ్ఞం తలపెడతాడు. ఆ యజ్ఞధేనువు పులివాతబడి మరణిస్తుంది. మధ్యలో ఆగిపోయిన యజ్ఞాన్ని ఎలా పరిపూర్ణం చెయ్యాలో తెలియక పురోహితుల నడిగితే వారీ విషయంలో సమగ్ర పరిజ్ఞానం ఉన్నవాడు ఖాండిక్యుడొక్కడే అంటారు. విజయగర్వంతో ఉండవలసిన కేశిధ్వజుడు ఏ మాత్రం సిగ్గుపడకుండా యజ్ఞపరిసమాప్తి కోసం ఖాండిక్యుని ఆశ్రయిస్తాడు. తనని ఓడించాడనే బాధ, కక్ష ఏ మాత్రం లేకుండా ఖాండిక్యుడు అతన్ని శిష్యునిగా స్వీకరించి అధ్వర పరిజ్ఞానాన్ని బోధిస్తాడు. గెలిచిన రాజుకి గర్వం లేకపోవడం, ఓడిన రాజుకి బాధ లేకపోవడం, ఇద్దరూ యజ్ఞం కోసం తమ ధర్మాలు తాము నిర్వర్తించడమే ఆర్షధర్మ సంస్కారం. ఇది ఈ దేశంలోనే సాధ్యం.

ఇంతటితో కథ అయిపోలేదు. ముగింపులో మరో చిత్రమైన తాత్త్వికమైన మలుపు. యజ్ఞ రహస్యాలు బోధించిన ఖాండిక్యునికి గురుదక్షిణ ఇస్తానని కేశిధ్వజుడు వినయంగా విన్నవించి కోరుకొంటాడు. శత్రుత్వం శత్రుత్వమే. సంప్రదాయం సంప్రదాయమే. కోల్పోయిన రాజ్యాన్ని కోరుకొన్నా ఇవ్వడానికి కేశిధ్వజుడు సిద్ధంగా ఉన్నాడు. అయినా ఖాండిక్యుడు రాజ్యము, సంపదలు శ్రమలేకుండా వచ్చిపడుతున్నా సరే కోరకుండా కేశిధ్వజునికి బాగా తెలిసిన బ్రహ్మజ్ఞానాన్ని తనకు బోధించమని అర్థిస్తాడు. ఏమి రాజులు వీరు! ఏమి వీరి

హృదయగాంభీర్యాలు ! అప్పుడు కేశిధ్వజుడు ఆశ్చర్యపడి రాజ్యం ఎందుకు కోరుకోవడం లేదు అంటాడు. ఖాండిక్యుని సమాధానం చూడండి.

**"విను కేశిధ్వజ ! ధాత్రివేదమికి నావేదించెదన్ హేతు వ**
**జ్ఞునకున్ గాక వివేకికేల జనియించున్ లౌల్యమెందున్? రణం**
**బున బాడిన్ రిపుగూల్చువాడియు ప్రజాపోషంబు ధర్మంబు రా**
**జునకౌ; నైన నశక్తు ద్వద్విజితరాజ్యు న్నన్నఘం బంటునే?"**

**(ఆముక్త - 3-61)**

"భౌతిక సంపదలు కోరేవారు శ్రమపడకుండా దానధర్మాల ద్వారా పొందాలనుకోవడం అజ్ఞానుల లక్షణం. వివేకవంతుడు అలా ఆలోచించడు. యుద్ధరంగంలో జయించి క్షత్రియధర్మం ప్రకారం రాజ్యం స్వీకరిస్తానే కాని యాచన ద్వారా కాదు. అయినా నేను నీకంటె బలహీనుణ్ణి కాబట్టి నీ చేతిలో ఓడిపోయాను. ఇందులో నేను బాధపడి క్రుంగిపోవలసిందీ లేదు. నన్ను అంటుకొనే పాపమూ లేదు" అంటాడు ఖాండిక్యుడు.

అంటే రాజులు క్షత్రియధర్మంగా భావించి ధర్మరక్షణ కోసం యుద్ధాలు చేశారు. కానీ రాజ్యకాంక్షతో కాదన్నమాట. మరి ధర్మంకోసమే అయితే ఇద్దరిదీ ధర్మం ఎలా అవుతుంది అంటే ఎవరి ఆలోచనను వారు ధర్మంగా భావించారన్నమాట. అంటే అక్కడ ఏదో ధర్మ సంక్లిష్టత ఉందన్నమాట. యుద్ధం చేసినా, ఓడినా, గెలిచినా వారు ఆశ్రయించింది ధర్మమార్గాన్ని. ఆరాధించింది బ్రహ్మతత్త్వాన్ని. ఇదీ భారతీయ ధర్మ సంస్కారం. ఆముక్త మాల్యద కావ్య సారం ఈ మహత్తర మానవీయ ధర్మ పరిరక్షణే.



# 20. కృష్ణ ధూర్జటి

ధూర్జటి అంటే శివుడు. ఆయన తెల్లగా ఉంటాడు. కాని నల్లగా ఉండే ధూర్జటి మరొకరున్నారు. ఆయనయే కృష్ణదేవరాయల కాలంనాటి కవి ధూర్జటి. కవి ధూర్జటి నల్లగా ఉన్నాడని మనకెలా తెలుసంటే – తాను తెల్లగానో, ఎర్రగానో ఉండి ఉంటే ఆయన అందాన్ని గురించి ఆయన శతకంలో ఎక్కడో ఒకచోట ప్రస్తావించి ఉండేవాడు. అలా ప్రస్తావించలేదు కాబట్టి నల్లగా ఉన్నాడని అనుకొందాం. అప్పుడు 'కృష్ణ ధూర్జటి' అనే పేరు చక్కగా సరిపోతుంది. పైగా కృష్ణరాయల ఆస్థానంలో ఉండే ధూర్జటి అని స్ఫురించే అవకాశం కూడా ఉంది.

అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన్న, మాదయగారి మల్లన వంటివారు రాయల ఆస్థానంలో ఉన్నారంటే ఆశ్చర్యం కలగదు కానీ 'ఛీ ఛీ ఈ రాజ శబ్దంబు జన్మాంతరమందు నొల్లను సుమీ' అని కంఠోక్తిగా ప్రకటించిన ధూర్జటి ఒక రాజు ఆస్థానంలో అందునా ఎనిమిది మంది కవి పండితుల మధ్యలో చిరకాలం ఉండగలిగాడంటే అబ్బురం కలిగించే విషయమే.

శ్రీకృష్ణదేవరాయల కవి పండిత పోషణ, వినయ విధేయతలు, పరమత సహనం, విశాల దృక్పథం ధూర్జటి వంటి వీరశైవుణ్ణి, స్వాభిమానిని, రాజభోగ ద్వేషిని, కుండబద్దలు కొట్టినట్లు పద్యాలు చెప్పే నిరంకుశ కవిని ఆ ఆస్థానంలో చిరకాలం కొనసాగేలా చేశాయి.

**"రాజుల్ మత్తులటంచు దిట్టినను రారమ్మందు కూర్చుండుమా**
**పూజల్ సేయుదునంచు ధూర్జటి కవిన్ పోషించె నా రాయలే**
**జాజుల్ పూచెడి కైత లెక్కగొనునా శైవాది భేదమ్ములన్**
**చేజల్లెన్ శశికాంతు లక్షతలుగా శ్రీకాళహస్తీశుడే**

**(సాగరఘోష - 3-98)**

తనలాంటి వారే అయిన రాజుల్ని ఘోరంగా తిట్టిన ధూర్జటిలో కూడా కృష్ణదేవరాయలు కవిత్వాన్ని చూసి గౌరవించాడు. ఆ సంస్కారం మనం ఇంకా అలవాటు చేసుకోవాలి. కవిత్వపు చిగురు కనిపిస్తే చాలు చెట్టుకి సాష్టాంగపడే స్వభావం గల రాయలు ధూర్జటికి బాగా నచ్చిన రాజు. అందుకే అంతటి సర్వతంత్ర స్వతంత్రుడైన కవి ఎన్నో కష్టనష్టాలు తట్టుకొని కూడా రాయల ఆస్థానంలోనే చివరివరకు నిలబడ్డాడు. కృష్ణదేవరాయలంటే కవిని 'పల్లకి నుండి పాదమొక పట్టున నేలను మోపనీని రాట్తల్లజుడు' గదా !

**ఎవరా పల్లకి నెక్కి యున్నది? అహో ! ఎవ్వారలా పల్లకిన్**
**చివురుంగేలను మోయుచున్నది ? భళీ ! శ్రీకృష్ణరాయ ప్రభూ**
**కవికిన్ బ్రహ్మరథమ్ము పట్టితివి నీ కావ్యమ్ము ఖడ్గమ్ము జం**
**కవురా భూతలమందునెల్లెడ గుణగ్రాహి ప్రపంచంబునన్**

**(సాగరఘోష - 3-92)**

ఇంతటి కవితా ప్రేమికుడైనా కృష్ణదేవరాయల ఆస్థానంలో ప్రవేశం అంత సులభమేమీ కాదు. ఆ విషయాన్ని ధూర్జటి తన శతకంలో పరోక్షంగా చెప్పనే చెప్పాడు.

**"వాణీ వల్లభ దుర్లభంబగు భవద్వారంబునన్ నిల్చిని**
**ర్వాణశ్రీ జెరబట్ట జూచిన విచారద్రోహమో ! నిత్యక**
**ల్యాణ క్రీడల బాసి దుర్దశల పాలై రాజలోకా ధమ**
**శ్రేణి ద్వారము దూరజేసెదెపుడున్ శ్రీకాళహస్తీశ్వరా**

**(కాళహస్తి శతకం - 2)**

నిజంగానే పెద్దనాది దిగ్గజాలతో నిండిన శ్రీకృష్ణదేవరాయల భువన విజయ సభా భవనంలో స్థానం సంపాదించడం బ్రహ్మకు కూడా ఆ రోజుల్లో దుర్లభమైనదే.



అసలిన్ని కష్టాలు పడి ఈ రాజులను ఆశ్రయించడం ఎందుకో అర్థం కాక ధూర్జటి అటువంటి అమాయకులను చూసి ఓ నవ్వు నవ్వాడు.

**"మద మాతంగములున్ రథంబులు హరుల్ మాణిక్యముల్ పల్లకుల్**
**ముదితల్ చిత్రదుకూలముల్ పరిమళంబుల్ మోక్షమీ జాలునే**
**మదిలో వీని నపేక్ష జేసి నృపధామ ద్వార దేశంబుగా**
**చి దినంబుల్ వృథపుత్తు రజ్ఞులకటా ! శ్రీకాళహస్తీశ్వరా !"**

**(కాళహస్తి శతకం - 31)**

ఎప్పుడు పడేస్తుందో తెలియని ఏనుగు ఎక్కడం కోసం, ఒళ్లంతా కుదిపేసే రథాలు అధిరోహించడం కోసం, ఒంటిమీద నిలబడని పట్టువస్త్రాల కోసం, పది నిమిషాల్లో ఆవిరైపోయే పరిమళాల కోసం ఈ కవి పండితులు ఆశపడి ద్వారం ద్వారానికి ద్వారపాలకులు అడ్డగిస్తున్నా, అంగరక్షకులు అవయవాలు కుళ్లబొడుస్తున్నా, మహాపండితుల్ని మాములు మనుషుల కంటే ఘోరంగా మందలిస్తున్నా ఆ మహారాజు దర్శనం కోసం తపించడం, ఆయన అనుగ్రహం కోసం అంగలార్చడం ధూర్జటిని ఆశ్చర్యపరిచింది. ఆవేదనకు గురి చేసింది.

సరిగ్గా ఈ ఆలోచనయే ధూర్జటి పట్ల రాయలకు ప్రత్యేకాకర్షణ కలిగేలా చేసింది. కృష్ణరాయలకు ఆత్మతత్త్వం క్షుణ్ణంగా తెలుసు. ఆ విషయం ఆముక్తమాల్యద చదివితే మనకు తెలుస్తుంది. ఆయనకు ఆత్మతత్త్వం, భౌతిక భోగాల క్షణికత్వం అర్థం కాకపోతే ఆముక్తమాల్యదలో కథావస్తువు అలా ఉండదు. దిగ్విజయాలు సాధించిన పాండ్యరాజు ప్రియురాలి ఇంటికి వెళుతూ పురోహితుని ఇంట్లోంచి వినబడిన శ్లోకం విని ఆగిపోవడమేమిటి?

"వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్
నిశార్థ మర్థం దివసం యతేత
వార్థక్యహేతో ర్వయసా నవేన
పరత్ర హేతోరిహ జన్మ నాచ"

వర్షాకాలం కాలు కదపకుండా కాలక్షేపం చెయ్యాలంటే మిగిలిన ఎనిమిది నెలలు కష్టపడి సంపాదించుకోవాలి. రాత్రి సుఖంగా నిద్రపట్టాలంటే రేపటికి పొయ్యిలోకి పొయ్యి మీదికి ఉండేలా చూసుకోవాలి. వృద్ధాప్యం సుఖంగా గడవాలంటే యౌవనంలో సంపాదించింది దాచుకోవాలి. అలాగే మోక్షం పొందాలంటే ఈ జన్మలోనే పుణ్యకార్యాలు చేసి చిత్తశుద్ధి పొంది తత్త్వజ్ఞానం పొందాలి. భోగాలను అనుభవిస్తూ కూర్చుంటే అంతూ దరీ ఉండదు. సరిగ్గా ధూర్జటి శతకంలో వ్యక్తం చేసిన భావాలివే.

**అమర స్త్రీల రమించినన్ జెడదు మోహంబంతయున్, బ్రహ్మ ప**
**ట్టము సిద్ధించిన నాసతీరదు నిరూఢక్రోధమీ యెల్ల లో**
**కములన్ మ్రింగిన మానదిందుగల సౌఖ్యం బొల్ల; నీ సేవ జే**
**సి మహాపాతక వారి రాశి గడతున్ శ్రీకాళహస్తీశ్వరా**

**(కాళహస్తి శతకం - 42)**

ఇరువురి భావాలు తీవ్రభక్తితో నిండినవే. ఇరువురూ స్వేచ్ఛాప్రియులే. ఇరువురూ పైకి గంభీరమైన ప్రవృత్తి లోపల తీవ్రమైన నివృత్తి కలిగిన వారే. అందుకే ధూర్జటి కోరినట్లుగానే 'సర్వమునకున్ మధ్యస్థుడు, సత్యదాన దయాదుల్ గల' కృష్ణదేవరాయలను ధూర్జటికి సంరక్షకునిగా శివుడు అనుగ్రహించాడు. పిండి కొద్దీ రొట్టె. భక్తి కొలదీ భగవదనుగ్రహం.



# 21. మన పద్యం - మన వ్యక్తిత్వం

ఈ యుగం ప్రత్యేకమైన కాలం. ప్రతి విద్యలోనూ ప్రత్యేక విభాగాలే. కాలికో వైద్యుడు, వ్రేలికో వైద్యుడు. ఏది వచ్చినా ఆదుకోగలననే ఆపద్బాంధవుడు లేడు. పదిహేనేళ్లు డిగ్రీ వరకు చదువు చెప్పాక కూడా మళ్ళీ వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక శిక్షణ, సంభాషణా నైపుణ్యానికి ప్రత్యేక శిక్షణ. నాయకత్వ లక్షణాలకి ప్రత్యేక శిక్షణ. అన్నింటికీ మూడేసి నెలలు శిక్షణ. మూడేసి వేలు భక్షణ. కడుపులోంచి ఇంకా బయటపడకుండానే కంగారుపడి తీసుకుపోయి కాన్వెంట్లలో అప్పగించినా, అక్కడి నుండి పదిహేనేళ్లు రాచి రంపాన పెట్టినా పట్టుమని పది పద్యాలు అప్పగించలేదు. నోరు తెరచి నాలుగు ముక్కలు కాగితం చూడకుండా మాట్లాడలేదు. ఇతరుల కోసం కాకపోయినా తన కోసం తానయినా కష్టపడలేదు. నాయకుడు కాకపోయినా సరైన అనుచరుడైనా కాలేదు. ఇన్ని లక్షలు ఖర్చుపెట్టి చదివించినా చివరకు విద్యార్థులు వ్యక్తిత్వ హీనులుగానూ, ఈర్ష్యాళువులు గానూ, నిస్సంతోషులుగానూ, కోపిష్ఠులుగానూ, వృథావేశపరులుగానూ, పరభాగ్యోపజీవులు గానూ తయారు కావడానికి కారణం ఏమిటి?

పదో తరగతి వరకు తెలుగు పుస్తకాలు చూస్తే పదిరకాల ప్రక్రియలు నేర్పేద్దామనే తాపత్రాయం తప్ప పది కాలాల పాటు పదిలంగా మనస్సు మీద ముద్రవేసేలా పది పద్యాలు నేర్పుదామనే ఆలోచన కానరావడం లేదు. ప్రాచీన పద్యసాహిత్యం మీద పక్కా వ్యతిరేకతతో పాఠాలు రూపకల్పన చేస్తున్నారనే అనుమానం సమాజంలో బలంగా ఉంది.

అదే ప్రాచీన సాహిత్యంలోని పద్యాల ద్వారా అత్యాధునిక విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగపడే ఎన్ని విషయాలు ఎంత చక్కగా నేర్పవచ్చో సావకాశంగా, సావధానంగా కాస్త 'లో చూపు'తో చూద్దాం.

వ్యక్తిత్వ వికాసం (Personality Development) అంటే పదిమందినీ మించి పోవడం కాదు. పదిమందినీ కలుపుకుపోవడం. సంభాషణా నైపుణ్యం (Communication Skill) అంటే దబాయించి మాట్లాడగలగడం కాదు, గుబాళించేలా మాట్లాడగలగడం. నాయకత్వ లక్షణం (Leadership Quality) అంటే పెత్తనం చెలాయించడం కాదు, ప్రేమతో జయించడం. నిర్వహణ సామర్థ్యం (Managing Ability) అంటే నెత్తి మీద కత్తిపెట్టి పని చేయించడం కాదు, ఒత్తిడి లేకుండా ఒప్పించి పని చేయించడం. ఇవన్నీ మన తెలుగు పద్యాల ద్వారా మనస్సుకి పట్టేలా చెప్పవచ్చు.

తన కోసం బ్రతికింది బ్రతుకు కాదు; పది మంది బ్రతికిందే బ్రతుకు. ఈ విషయాన్ని ఆంధ్రమహాభారతంలో శకుంతల ఎంత విశ్లేషణాత్మకంగా చెప్పిందో చూడండి.

**"నుతజల పూరితంబులగు నూతులు నూరిటి కంటె సూ**
**నృతవ్రత ! యొక బావి మేలు; మఱి బావులు నూరిటి కంటె నొక్క స**
**త్క్రతువది మేలు; తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు; త**
**త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు చూడఁగన్"**

**(నన్నయ)**

మూడు రోజులు ఏకాంతంగా గడిపి, గర్భిణిని చేసి, కుమారునితో వచ్చిన స్త్రీని నువ్వెవరో నాకు తెలియదన్న పెద్దమనిషిని 'సూనృతవ్రత!' అని నిండు సభలో సంబోధించడంలోనే శకుంతల ధైర్యం, నన్నయగారి ఉక్తి చమత్కారం కనబడుతున్నాయి. ఒక కుటుంబానికి మాత్రమే ఉపయోగపడే నుయ్యి కంటే పదిమందికీ ఉపయోగపడే ఊరబావి మంచిదనడంలో నీ కోసం నువ్వు బ్రతకడం అవసరమే అయినా పది మంది కోసం బ్రతికే ప్రయత్నం కూడా చేయమనే సందేశం లేదా. బావులు త్రవ్వడం కంటే యజ్ఞం గొప్పది. యజ్ఞంలో మఱ్ఱి,



మారేడు, జువ్వి, రావి, జమ్మి మొదలైన ఔషధ వృక్షాల సమిధలు వాడతారు. వాటి ధూమం గాలిలో కలిసి మేఘాలను కదిలించి వర్షాలు కురిపిస్తుంది. కాబట్టి నూరు బావులు త్రవ్వడం కంటే ఒక యజ్ఞం చేయడం మేలని చెప్పింది. వర్షాలు లేకపోతే త్రవ్విన నూతులు, బావుల వల్ల ఉపయోగం ఏముంది? వంద యజ్ఞాలు చేయడం కంటే కూడా ఒక కొడుకుని కనడం గొప్ప విషయమని పేర్కొంది. ఎందుకంటే ఆ కుమారుడు మళ్లీ యజ్ఞాలు చేస్తాడని. అంతేకాని వైద్యవిద్యో, యంత్రవిద్యో (ఇంజనీరింగ్) పూర్తి చేసి అమెరికాకో, ఆస్ట్రేలియాకో చెక్కేస్తాడని కాదు.

ఇటువంటి సందర్భాలలోనే కొంతమంది ప్రాచీన సాహిత్యానికి లింగవివక్ష ఆపాదిస్తారు. అందుకే కాస్త 'లో చూపు' అవసరం. స్త్రీ ప్రక్కన లేకుండా పురుషుడు ఎటువంటి యజ్ఞయాగాలు చెయ్యడానికి అధికారం లేదు. అందుకని యజ్ఞం చేసే కొడుకుని వీరు కంటే, ప్రక్కన కూర్చునే కూతుర్ని ఇంకొకరు కంటారు. ఆ రకంగా యజ్ఞాలు, తద్వారా వర్షాలు, తద్వారా పంట, తద్వారా పాడి తద్వారా వ్యక్తికి అభివృద్ధి, గ్రామానికి పురోగతి అన్నీ సాధ్యమవుతాయి.

ఇంతవరకు భౌతికాభివృద్ధిని గురించి మాట్లాడిన భారతీయ నాయిక 'శకుంతల' సారాంశంగా నైతికాభివృద్ధి గురించి మాట్లాడుతోంది. వందమంది కొడుకుల్ని కలిగి ఉండటం కంటే కూడా ఒక్క సత్యవాక్యానికి కట్టుబడి ఉండటం గొప్ప విషయమని చెప్పింది. (వందమంది కొడుకులు కలిగిన ధృతరాష్ట్రుని పతనం, సత్యానికి కట్టుబడిన ధర్మరాజు విజయం ఇక్కడే సూచింపబడ్డాయి). ఆ రకంగా దుష్యంతుని బుద్ధికి ధర్మదీపికను చూపించింది. ఈ ఒక్క పద్యం ఎంతమంది వ్యక్తిత్వాలనైనా వికసింపజేయడానికి బంగారు బాట కాదా?

విద్యార్థులు ప్రతిభ ఎలా పెంచుకోవాలో, ఆ ప్రతిభను ఎలా కాపాడుకోవాలో దాన్ని ఎవరికోసం వినియోగించాలో, ఎంత ఆకర్షణీయంగా ఆ ప్రతిభను అందించాలో, అలా అందించగలిగితే అతనికేం ప్రయోజనమో, దేశానికి ఏం ప్రయోజనమో అన్నీ ఒకే ఒక పద్యంలో వివరించాడు ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన్న.

**అటఁజని గాంచె భూమిసురుఁడంబర చుంబి శిరస్సరజ్ఝరీ**
**పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగనిస్స్వన**
**స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపిజాలమున్**
**కటక చర త్కరేణుకర కంపిత సాలము శీత శైలమున్.**

పైకి హిమాలయ వర్ణనలా కనిపిస్తున్నా ఈ పద్యంలో రత్నాలు చాలా ఉన్నాయి. (అనర్ఘరత్నాలకు హిమాలయం పుట్టినిల్లు గదా!) హిమాలయ శిఖరాలు అంబరాన్ని చుంబిస్తున్నాయని, అక్కడి నుండి జారిపడే జలధారలు మృదంగ ధ్వనులు వినిపిస్తున్నాయని, ఆ ధ్వనులకు ఆకర్షింపబడిన నెమళ్లు బయటకు వచ్చి పురివిప్పి నాట్యం చేస్తున్నాయని పైకి కనిపించే భావం. పదవ తరగతి పరీక్షల్లో ఎనిమిది మార్కులు సంపాదించడానికి అది చాలు. కాని విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలంటే ఇంకాస్త లోతుల్లోకి వెళ్లాలి.

విద్యార్థి ప్రతిభ ఆకాశమంత ఎత్తు ఎదగాలి. కాని అక్కడే ఉండిపోకూడదు. సెలయేటిలా క్రిందికి రావాలి. తన తల్లిదండ్రులకి, తన గ్రామ ప్రజలకు సేవ చేయడం కోసం స్వాదుజలంలా ఆ ప్రతిభ అందుబాటులోకి రావాలి. అలా ప్రవహించేటప్పుడు మృదంగధ్వనిలా ఆకర్షణీయంగా సాగాలి. విద్య ఎంత ఉన్నా దాని ఆకర్షణీయంగా అందించడం చేతగాకపోతే ఏ రంగంలోనూ ఎవరూ రాణించలేరు. అలా అందించగలిగితే నెమళ్లు తమంత తామే వచ్చి పురివిప్పి నాట్యం చేస్తాయంటే ప్రతిభావంతుడైన మేధావి ఎవరూ తన వినియోగదారుల్ని,



ఖాతాదారుల్ని, పాఠకుల్ని, శ్రోతల్ని, ప్రేక్షకుల్ని వెదుక్కోవలసిన అవసరం లేదని సారాంశం. రత్నాల్లాంటి ఈ భావాలు పద్యసముద్రాల గర్భాల్లో ఉంటాయి. ఆ మహాకవుల అంతరంగాలు అంత లోతైనవి. వాళ్లు సమస్త శాస్త్ర సాగరాలను ఆపోశన పట్టిన కుంభ సంభవులు (అగస్త్యులు). ఇటువంటివి ఉపాధ్యాయులు శోధించి సాధిస్తే, ఆకర్షణీయంగా వివరిస్తే మధ్యాహ్న భోజనాలు, ఉచిత పుస్తకాలు, ఉచిత దుస్తులు అవసరం లేకుండానే విద్యార్థులు పాఠశాలలో ఉంటారు. వింటారు, బాగుపడతారు.

ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా వాక్చాతుర్యంతో బయటపడటం తెలుగు పద్యాలు తీయతీయగా నేర్పిస్తాయి. మిత్రుల మధ్య అపార్థాలు తొలగిపోవడానికి, శత్రువుల వల్ల అనర్థాలు కలగకుండా జాగ్రత్త పడటానికి ఆంధ్రమహాభారతం శాంతిపర్వంలోని ఒక్క పద్యం చక్కని దారి చూపిస్తుంది.

ఒక ఎలుక ఉదయాన్నే జీవయాత్ర కోసం బయలుదేరింది. కన్నం దాటి నాలుగడుగులు వేసిందో లేదో యమధర్మరాజులా పిల్లి ప్రత్యక్షమయింది. కంగుతింది. అంతలోనే స్తిమితపడింది. ఆ పిల్లి వేటగాడి వలలో చిక్కుకుని ఉంది. అమ్మయ్య! అనుకొని కొంచెం ధైర్యంగా ముందుకు వెళ్లేసరికి చెట్టు మీద గుడ్లగూబ, పొదలోంచి ముంగిస ఎలుక వైపు గుర్రుగా చూస్తున్నాయి. 'ఇది సంకటంరా దేవుడా!' అనుకొంది. కానీ ధైర్యం కోల్పోలేదు. (ఎల్‌కేజీ నుండి ఎంసెట్ వరకూ చదివి ఆంగ్లభాషా సాగరాలు ఆపోశన పట్టిన అరివీరభయంకర విద్యార్థులెవ్వరిలో ఇంత ధైర్యం కనబడదు.) ఒక్క క్షణం చురుగ్గా ఆలోచించింది. పిల్లిని చూస్తే ముంగిస, గుడ్లగూబ భయపడతాయి. కాబట్టి పిల్లి రక్షణలో ఉన్నట్లుంటే అవి తన జోలికిరావు. అంతే! ఒక 'ఐడియా' జీవితాన్ని నిలబెడుతుంది గదా! పిల్లి రక్షణ కోరింది. వల త్రాళ్లు కొరికి పిల్లిని రక్షిస్తానంది. ప్రాణం మీద ఆశతో పిల్లి ఒప్పుకుంది. పిల్లి రక్షణలో ఉన్న ఎలుకను ఏమీ చేయలేమని నిర్ణయించుకొని మసకకళ్ల గూబ, మందబుద్ధి ముంగిస అక్కడ నుండి

జారుకున్నాయి. ఎలుక హాయిగా ఊపిరి పీల్చుకుంది. ఇంక పిల్లిని విడిపించాలి. తనకు ప్రాణాపాయం లేకుండా చూసుకోవాలి. అందుకే పిల్లి ఎంత కంగారు పడుతున్నా వేటగాడు దగ్గరకు వచ్చేవరకు వల త్రాళ్లు కొరకలేదు. వేటగాడు సమీపించాక హడావుడిగా తెగ్గొట్టి పారేసింది. బ్రతుకు జీవుడా అంటూ పిల్లి పారిపోయింది. బ్రతికానురా దేవుడా అంటూ ఎలుక కన్నంలోకి దూరింది.

ఇంతటితో కథ అయిపోలేదు. ఎలుక చేసిన మేలు మరిచిపోలేని పిల్లి జీవితాంతం స్నేహంగా ఉందాం రమ్మని కన్నం దగ్గరకు వచ్చి మరీ ఆహ్వానించింది. జీవితాంతం స్నేహం అక్కరలేదు. స్నేహం వల్ల జీవితం అంతం కాకుండా ఉంటే చాలని ఆలోచించిన ఎలుక ఇలా సమాధానం చెప్పింది.

**అరులను మిత్రులన్ దెలియ నారయుటెంతయు సూక్ష్మకృత్య, మ**
**వ్వైరవతి దుష్కర, మ్మరులు వీరన నుండియు మిత్రభావమున్**
**బొరయుటయున్ సుహృజ్జనము పోలికిఁ గల్గియు శత్రుతాగుణ**
**స్ఫురణ మొకప్డు సూపుటయు చూతుము గాదె ధరిత్రి నెల్లెడన్**

**(భారతం-శాంతిపర్వం - 3-227)**

జీవితంలో మిత్రులెవరో శత్రువులెవరో తెలుసుకోవడం చాలా కష్టం. కొంతమంది పైకి చురచురలాడే ముఖాలతో కనిపిస్తారు. కాని అవసరానికి ఆదుకొంటారు. కొందరు రాసుకు పూసుకు తిరుగుతారు. అవసరానికి ముఖం చాటేస్తారు. ఇవన్నీ జీవనయానంలో అలవాటుపడ్డ శకునాలే. అందువల్ల పిల్లిని నమ్మి ఎలుక స్నేహం చేయడం ఎప్పటికీ అవివేకమే పొమ్మని చెప్పింది.

ఈ వివేకం ఈనాటి యువతులకి ఉంటే అపాయకారులయిన అబ్బాయిల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండగల్గుతారో కదా! అర్ధరాత్రి బండి మీద విహారాలు, పబ్బులకి, క్లబ్బులకి కలిసి తిరగడాలు, విచ్చలవిడి విహారయాత్రలు కొంతయినా తగ్గే అవకాశం ఉంది కదా!



ఈ రోజుల్లో చాలామంది యువతీ యువకుల్లో అనుకూల దృక్పథం కొరవడుతోంది. ప్రతిదానికీ ప్రతికూలంగా ఆలోచించడం, ఆందోళన చెందడం, ఒత్తిడికి లోనవడం తరచుగా కనబడుతోంది. ప్రపంచం మనం ఎలా చూస్తే అలా కనబడుతుంది. 'సృష్టిలో భేదం లేదు. నీ దృష్టిలో తప్పు' అంటారు ఆదిశంకరాచార్య. ఏ వ్యక్తి అయినా మనం ఎలా చూస్తే అలా కనబడతాడని చెప్పడానికి ప్రబంధాల్లో వర్ణనలన్నీ ఉదాహరణలే. ఎంత వ్యతిరేకి అనుకొన్నా అతనిలో మనకు కావలసిన లక్షణాలు కొన్నయినా ఉంటాయి. అదే విషయాన్ని ఉత్తర హరివంశం అనే ప్రబంధంలో నాచన సోమన బలరామదేవుని వర్ణనలో స్పష్టం చేస్తాడు.

**పాతాళాధిపుడైన శేషుడు ప్రలంబఘ్నుండు నారాయణ**
**ప్రీతింబుట్టిన శంకరుండని జనుల్ పేర్కొన్నచో నంధకో**
**ద్భూత స్నేహముఁ గామపాలతయుఁ దప్పున్ దప్పఁగాకేమి? వి**
**ఖ్యాతింబొందఁడె పాండురాంగ మహిమన్ హాలహల స్వీకృతిన్**

**(ఉ.హరివంశం - 1-6)**

నాచన సోమన తిక్కన గారి గాఢాభిమాని. ఆయనలాగే ఈయన కూడా హరిహర నాథునికే కావ్యాంకితం చేశాడు. ఉత్తర హరివంశంలో కథ అంతా శ్రీకృష్ణ విజయమే. కాబట్టి కృష్ణునికి తోడునీడైన బలరాముని శివుని అవతారంగా వర్ణించాలని ఆయన తాపత్రాయం. కాని శివుడు అంధకవైరి. బలరాముడు అంధక మిత్రుడు (అంధక వంశం వారు యాదవుల మిత్రులు). శివుడు కామపాలుడు (మన్మథుని శాసించినవాడు). బలరాముడు మన్మథుని శ్వాసించిన వాడు. ఇన్ని వైరుధ్యాలున్నా కలిసే లక్షణాలు ఉండకపోతాయా కవి పరిశీలించగా అద్భుతమైన పోలికలు రెండు దొరికాయి. బలరాముడు, శివుడు ఇద్దరూ తెల్లని వారే. 'పాండురంగ మహిమ' ఇద్దరికీ ఉంది గదా అని సమర్థించాడు. ఇంకో

పోలిక 'హాలాహల స్వీకారం' అన్నాడు. శివుడు హాలాహల స్వీకారం చేసిన విషయం అందరికీ తెలుసు. మరి బలరాముని విషయంలో ఇది ఎలా సరిపోతుంది? మనసుండిన మార్గముండదా? నాచన సోమన భాషా నైపుణ్యంతో దాన్ని సాధించాడు. బలరాముడు హాల (మద్యం), హలము (నాగలి) విడిగా స్వీకరించాడు గదా అన్నాడు. అంటే శివుని విషయంలో ఏకపదమైన హాలాహలం బలరాముని విషయంలో రెండు పదాలు కలిసిన ద్వంద్వ సమాసం అయింది. కవిగారి నాలుకకి రెండు వైపులా పదునుండటం అంటే ఇదే.

సారాంశంగా మనం ఎంత వ్యతిరేకించే వారిలోనయినా మనకు కావలసిన లక్షణాలు కొన్నయినా ఉంటాయని గ్రహించవచ్చు. ఈ భావంతో జీవిస్తే ప్రపంచంలో ప్రతికూలతలుంటాయా? ఇంతకంటె వ్యక్తిత్వ వికాసం ఉంటుందా? ఈ నాలుగు పద్యాల్లోనే ఇంత ఉంటే మొత్తం పద్యసాహిత్యంలో ఇంకెంత ఉంటుంది. అందువల్ల తెలుగు పద్యమే తెలుగు వారి వ్యక్తిత్వం.

**ఒక పద్మమ్మును నేర్చుకొన్న ధనమై యోగమ్మునై ధ్యానమై**
**సుకవిత్వాంచల దీప్తి దర్శన సుధాస్రోతస్వినీ స్నానమై**
**అకలంక ప్రతిభాసమన్విత మృదు వ్యాహారమై హారమై**
**సకలోర్వీన్ కొనగోట నెత్తినటు లుత్సాహమ్ము దీపించెడిన్**



# 22. భాగవత పద్యం... పర్యావరణం

పురాణాల నిండా మతం, భక్తి, పూజలు తప్ప నిత్య జీవితానికి ఉపయోగపడే విషయాలేవీ లేవని కొంతమంది అభిప్రాయం. అందుకే పద్యాలు పాత కాలానివనీ అవి ఇప్పుడు పనికిరావని భావించి పిల్లలకు పద్యాలు నేర్పే విషయంలో కూడా అశ్రద్ధ చేస్తున్నారు.

నిజానికి మన పురాణాలు 'పురా అపి నవీనాలు'. అవి ఎంత పాతవో అంత కొత్తవి. ఏ కాలానికైనా పనికివచ్చే ధర్మాలు. ఆదర్శాలు వాటిలో ఉంటాయి. ఈ కాలంలో పచ్చదనం, పరిశుభ్రం అంటూ మొక్కలు పెంచడం గురించి వృక్షాల వల్ల ఉపయోగాల గురించి ఊదరగొట్టేస్తున్నారు. మొక్కలు పెంచడాన్ని గురించి ప్రచారం చేయడానికి సభ పెడుతున్నారు. ఆ సభావేదిక నిర్మాణం కోసం అక్కడ ఉన్న చెట్లు కొట్టేస్తున్నారు. సరే. అది వేరే విషయం.

తెలుగు వారందరికీ నిత్యపఠన గ్రంథంగా ఉన్న బమ్మెర పోతనగారి భాగవతంలో వృక్షాల ప్రాధాన్యం గురించి ఎంత మంచి పద్యం ఉందో చూడండి. బృందావనంలో గోపకులు గోవుల్ని మేపుతూ అలసిపోయి దట్టంగా ఉన్న చెట్ల నీడలకి చేరతారు. ఆ సందర్భంలో గోపకులు బలరామకృష్ణుల నుద్దేశించి చెప్పిన పద్యం ఇది.

**"అపకారంబులు సేయవెవ్వరికి, నేకాంతంబు నందుండు, నా**
**తప శీతానిల వర్ష వారకములై, త్వగ్గంధ నిర్యాసభ**
**స్మపలా శాగ్ర మరంద మూల కుసుమ చ్ఛాయా ఫలశ్రేణి చే**
**నుపకారంబులు సేయునెల్లరకు నీ యుర్వీజముల్ గంటిరే?"**

**(భాగ-దశమ-పూర్వ-848)**

1) చెట్లు ఎవరికీ అపకారం చెయ్యవట. ఈ యుగంలో ఇదే గొప్ప లక్షణమన్నమాట. ఉపకారం చెయ్యడం మాట దేవుడెరుగు. అపకారం చెయ్యకుండా ఉంటే అదే పదివేలు. 2) చెట్లు ఏకాంతంగా ఉండగలుగుతాయట. అందువల్ల ఇవి మనషులకు ఆదర్శం. ఒంటరితనాన్ని ఇష్టపడగలగాలి. అస్తమానం ఎవరో ఒకరు కూడా ఉంటే గాని తోచదనడం, అలా కూడా ఉన్న వాళ్లని ఆత్మస్తుతి, పరనిందలతో సుత్తికొట్టి చంపడం మంచి లక్షణం కాదన్నమాట. ఏకాంతంగా ఉండగలిగినప్పుడే మనం ఎవ్వరమో ఆలోచించుకునే అవకాశం లభిస్తుంది. కాస్సేపు కళ్లు మూసుకుని ఆ పని చేస్తే ఎప్పుడో అప్పుడు కాసింతైనా మనశ్శాంతి లభించే అవకాశం ఉంది. 3) చెట్లు ఎండ నుంచి రక్షిస్తాయట. 4) చలిగాలి నుంచి రక్షిస్తాయట. మఱ్ఱిచెట్టు వంటి వాటి నీడలు వేసవి కాలంలో చల్లగానూ శీతాకాలంలో వెచ్చగానూ ఉంటాయని శాస్త్రం. 5) వర్షంలో తడిసిపోకుండా దట్టమైన చెట్లనీడలు కాపాడతాయి. 6) చెట్లపై తోలు వస్త్రాలకు తాళ్లకు వాడతారు (త్వక్) 7) వాటి సుగంధం గాలిని ఆరోగ్యకరంగా చేస్తుంది (గంధ) 8) వాటి జిగురు ఎంతో ఉపయోగిస్తుంది (నిర్యాస) 9) వాటి బూడిద వైద్యంలో ఉపయోగిస్తారు. (భస్మ) 10) వాటి ఆకుల పచ్చదనంతో పర్యావరణం మొత్తం ప్రాణవాయు మయం అవుతుంది (పలాశ) 11) వాటి చిగుళ్లు కూరల్లో, పచ్చళ్లలో వాడతారు (అగ్ర). 12) పూవులలో తేనె ఉపయోగం మందుల్లో ఎంతో ఉంది (మరంద) 13) వాటి వేళ్లు ఆహారంగానూ, వైద్యంలోనూ ఉపయోగిస్తాయి (మూల) 14) పువ్వులు పూజకి ప్రశస్తం, శిరోధార్యం (కుసుమ) 15) వాటి నీడ తాపోపశమనం (ఛాయా) 16) వాటి ఫలాలు మనకి పుష్టికరమైన ఆహారం (ఫలశ్రేణి).

ఈ విధంగా 16 రకాల ఉపకారాలు చేస్తున్నాయనే విషయాన్ని పోతన ఒకే ఒక్క పద్యంలో కేవలం నాలుగు పంక్తుల్లో తెలియజేశాడు. ఇంత చక్కని పద్యాలను పిల్లలకు పాఠ్యాంశాలుగా పెట్టకపోవడం వల్ల ఎంత కోల్పోతున్నాం?



ఆలోచించండి. ఈ ఒక్క పద్యాన్ని కంఠస్థం చేయిస్తే విద్యార్థి స్వయంగా వృక్షాల గురించి స్వీయ వివరణతో 16 పుటల వ్యాసం రాయగలుగుతాడు. అది మంచిదా? చెట్ల మీద వ్యాసం కోసం గైడు చదివి అందులో వాళ్లు రాసిన వాక్యాలన్నీ బలవంతంగా కంఠస్థం చేసి అది పరీక్షలో గుర్తురాక, మార్కులు సంపాదించుకోలేక మూర్ఖుడిగా మిగిలిపోవడం మంచిదా?

అంతేకాదు. తెలుగులో సమాసాల ప్రాధాన్యం గురించి చెప్పడానికి ఈ పద్యం ఎంతో ఉపయోగిస్తుంది. త్వగ్గంధ ......... అనే ఏక సమాసంలో 11 పదాలతో విస్తృతమైన వృక్ష మహిమని సంక్షిప్త సుందరంగా ఎంత బాగా చెప్పగలిగాడు! సూక్ష్మంలో మోక్షం అంటే ఇదే.

# 23. నడకలోనే పద్యం నడక

తెలుగు పద్యానికి ప్రపంచ సాహిత్యంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఆ ప్రత్యేకతలో సగభాగం దాని నడకలోనే ఉంది. ఆ నడక అందంగా ఉండాలంటే కవి పద్యనిర్మాణం పట్ల శ్రద్ధ చెయ్యాలి. అటువంటి శ్రద్ధాయుతమైన పద్యనిర్మాణం ఎలా ఉంటుందో పోతన గారి భాగవతంలోని 'వామన చరిత్ర' ఘట్టంలో చూద్దాం.

బుజ్జి వామనుడు బలి చక్రవర్తి సభామంటపంలోకి ప్రవేశించాడు. అందరూ ఆశ్చర్యంగా, కొందరు ఆనందంగా, ఇంకొందరు అసూయగా చూస్తూ ఉండగా ఆ బాలుడు అడుగులో అడుగు వేసుకొంటూ నడచి వస్తున్నాడు. ఆ నడకల్ని పోతన ఎంత శాస్త్రీయంగా, మనోవిశ్లేషణాత్మకంగా వర్ణించాడో చూడండి.

**"వెడవెడ నడకలు నడచుచు**
**నెడనెడ నడుగులకు నడరి యిల దిగబడగా**
**బుడిబుడి నొడువులు నొడువుచు**
**జిడిముడి తడబడగ వడుగు చేరెన్ రాజున్"**

వామనుడు పసిబాలుడు. కాబట్టి తప్పటడుగులు వేయడం సహజం. అందుకే 'వెడవెడ నడకలు' అనే ప్రయోగం. నడుస్తూ ఉంటే పడిపోతానేమో అనే భయంతో నడవడం బాలుని నైజం. ఇక్కడ – కొంచెం దూరంగా ఉన్న తల్లి దగ్గరకు చేరుకొనే పసిబాలుని నడకను – మనం ఊహించుకోవాలి. తల్లి పిల్లవాడికి నడక నేర్పేటప్పుడు కొంచెం దూరంగా నిలబడి దగ్గరకు రమ్మని పిల్లవాణ్ణి ప్రోత్సహిస్తూ ఉంటుంది. అతడు దగ్గరకు వస్తున్నకొద్దీ తాను కొంచెం కొంచెం దూరం జరుగుతూ పిల్లాణ్ణి మళ్లీ మళ్లీ రమ్మని పిలుస్తూ వాడు పడిపోబోతుంటే తాను దగ్గరికి వెళ్లి పట్టుకోబోతున్న భద్రతాభావన కల్పిస్తూ



చివరికి దగ్గరకు వచ్చే సమయానికి తాను చేత్తో అందుకోబోతున్నట్లు నటిస్తూ నడకలో గొప్ప శిక్షణనిస్తుంది. ఈ వాతావరణమంతా ఈ చిన్న పద్యంలో ఇమిడించాడు పోతన్న.

'ఎడనెడ నడుగులు' అటూ ఇటూ వేసే తప్పటడుగులన్నమాట. 'అడరి యిల దిగబడగా' అంటే 'ఆ బాలుడు భూమి మీద జారిపోతున్నాడేమో' అని చెప్పుకోవచ్చు. ఆ బాలుడు సాక్షాత్తు విష్ణుమూర్తి కాబట్టి ఆయన అడుగుల భారానికి భూమి దిగబడిపోయేలా ఉందనీ చెప్పుకోవచ్చు. 'ఇల' అనే శబ్దం తర్వాత ద్రుతం లోపించిందనుకొంటే ఈ రెండు అర్థాలు చక్కగా సరిపోతాయి. ఇంతకు మించిన విశేషం మరొకటి ఉంది.

ఇది ఇంచుమించుగా సర్వలఘు కందం. తప్పనిసరి కాబట్టి రెండవ, నాల్గవ పాదాల చివర గురువుంది. కాని వాటితో బాటు నాల్గవ పాదం చివరలో 'చేరెన్ రాజున్' అంటూ నాలుగు గురువులు వేశాడు. అన్నీ లఘువులే వేసిన పద్యంలో చివరలో అకస్మాత్తుగా నాలుగు గురువులెందుకు? తల్లిని చేరుకోవడానికి ప్రయత్నించే బాలుడు నెమ్మది నెమ్మదిగా నడుస్తూ తల్లి దగ్గరయ్యే సరికి అమ్మ దొరికేసిందన్న ఆనందంలో ఒక్కసారిగా వేగం పెంచి ఆమె ఒడిలోకి దూకేస్తాడు. అక్కడ వామనుడు కూడా అంతవరకు నెమ్మదిగా నడుస్తూ, అందరినీ పలకరిస్తూ ఉన్నవాడు (బుడిబుడి నొడువులు నొడువుచు) ఒక్కసారిగా బలి చక్రవర్తి దగ్గరయ్యే సరికి లక్ష్యానికి చేరుకొన్నానన్న ఆనందంలో గబగబా నడుస్తాడు. ఆ వేగమే ఈ నాలుగు గురువుల ప్రయోగానికి కారణం (చేరెన్ రాజున్). ఇదీ ఆయన మనస్తత్వ పరిశీలన. పాత్రోచిత రచన. సందర్భోచితశయ్య. పద్య నిర్మాణంలోనే బాలుని నడకను అందులో రకరకాల దశలను చిట్టచివరి వేగాన్ని చూపించగలిగిన ఈ శక్తి తెలుగు పద్యానికే ఉందేమో !

# 24. ఆర్షధర్మాల్లో అభ్యుదయ భావన

నిరంతర పరిణామశీలమైన ఈ సృష్టిలో అభ్యుదయ భావన అనంతంగా ఉంది. మొదటి నుండి మానవుడు తానున్న స్థితి నుండి ఉన్నత స్థితిని పొందడానికి, అభ్యుదయాన్ని అందుకోవడానికి తీరని ఆరాటంతో అరని పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఆ అభ్యుదయ భావకుసుమాల వికాసానికి అడ్డు తగిలే ప్రతీపశక్తుల ప్రతాపాన్ని యధాశక్తిగా ఎదిరిస్తూనే ఉన్నాడు.

ఋషుల పంథాలో, ప్రాచ్యుల భావనా లోకంలో, పక్షపాతం లేకుండా పరిశీలించగలిగితే ఈ అభ్యుదయ భావన నిరంతర స్రవంతిగా ప్రవహిస్తూనే ఉందని తెలుస్తుంది.

ఆదికావ్యం రామాయణంలో మానవ ప్రయత్నానికిచ్చిన ప్రాధాన్యాన్ని చూడండి.

**దైవం పురుషకారేణ**
**య స్సమర్థః ప్రబాధితుం ।**
**న దైవేన విపన్నార్థః**
**పురుషస్సోఽవసీదతి**

దృఢతరమైన ప్రయత్నం చేత ఎవరు అదృష్టాన్ని దెబ్బతీయగల్గుతారో వారు ఎన్నడూ విపన్నులు కారని తెలిపే ఈ శ్లోకం ఆర్షధర్మంలో పురుష ప్రయత్నానికుండే ప్రాధాన్యాన్ని అద్దం పట్టి చూపిస్తోంది.

కులాల సంకుల సమరంతో పాపపంకిలమై పోయిన సమాజానికి కులాల నిష్ప్రయోజకత్వాన్ని ఆర్షధర్మం ఎంత సూటిగా తెలియజేస్తోందో చూడండి.



**కిం కులేన విశాలేన**
**శీలమేవాత్ర కారణం ।**
**కృమయః కిం న జాయంతే**
**కుసుమేషు సుగంధిషు ॥**

సుగంధ బంధురాలైన సుమసముదాయం నుండి దుర్గంధ కారకాలైన పురుగులు పుట్టడం లేదా? కులం ప్రధానమా, గుణం ప్రధానం కాని! అని ఈ శ్లోకం ఎలుగెత్తి చాటుతుంటే ప్రాచీన సంస్కృతి అంతా కులమతాలతో పాచి పట్టిందేనని మనం గొంతు చించుకోవడం ఎందుకు?

కోట్లకు కోట్లు సంపాదించి, ప్రజాహిత కార్యక్రమాలకు వెచ్చించకుండా దాచి, దోచే దోపిడిదారులకు నేటి చట్టాలు విధించే శిక్షలు చాలా తక్కువ. ఆర్షధర్మం ఈ దోపిడీగాళ్లని ఏం చేయమని ఆజ్ఞాపించిందో చూడండి.

**ద్వావంభసి నివేష్టవ్యౌ**
**గళేబద్ధ్వా శిలాందృఢాం ।**
**ధనవంత మదాతారం**
**దరిద్రం చాఽతపస్వినం ॥**

ధనవంతుడై యుండి తన సొమ్మును బహుజన సుఖం కోసం బహుజన హితం కోసం ఖర్చుపెట్టని వాణ్ని వెంటనే లోతైన బావిలోకి తోసేయమన్నారు. మామూలుగా కాదు. మెడకి ఒక పెద్ద బండరాయి కట్టి మరీ తోసైమన్నాడు. ఎందుకు? మళ్లీ తేలివచ్చి జనాన్ని ముంచకుండాను. దరిద్రుడై యుండి సంపాదించడానికి కష్టపడని వాడికి కూడా ఇదే శిక్ష. ఎంత తీవ్రవాదం ! ఎంత ఆవేశం ! దాని వెనుక ఎంత ఆవేదన ! ఎంత సామాజిక స్పృహ! ఇటువంటి శ్లోకాలు చదువుతుంటే అసలీ ఋషుల కంటె అభ్యుదయ వాదులు విప్లవకారులు వేరే ఉన్నారా ! అనిపిస్తుంది.

"సమాజానికి నువ్వు ఇవ్వగలిగింది ఇయ్యి. నీకు అవసరమైంది తీసుకో", అన్నాడు సామ్యవాద ప్రవక్త మార్క్స్. ఇది ఒక్కటి మనమంతా ఆచరిస్తే సమసమాజం రేపేపాటికి ఏర్పడిపోతుందనడంలో సందేహం లేదు. కానీ మనం మార్క్స్ చెప్పిందీ చెయ్యం. మహర్షులు చెప్పిందీ చెయ్యం. కొందరు మార్క్సుని, మరి కొందరు మహర్షులని తిట్టుకుంటూ పరస్పరం కొట్టుకుంటూ కాలక్షేపం చేసేసి కర్తవ్యాన్ని భావితరాల వారికి బోధిస్తూ ఉంటాం. మార్క్స్ భావనలను మహర్షులు ఎంతో కాలం ముందుగానే ఎంత కచ్చితంగా ప్రకటించారో చూడండి.

యావద్భ్రియేత జఠరం
తావత్ స్వత్వం హి దేహినాం ।
అధికం యోஉభిమన్యేత
సస్తేనో దండ మర్హతి ॥

కడుపు ఎంతవరకూ పడుతుందో అంతవరకే మనిషి సొంతం. ఆ అవసరాల మేరకే దాచుకోవాలి. అంతకంటె నయాపైసా అధికంగా దాచినా వాడు దొంగే అవుతాడు. వాణ్ణి దండించి తీరవలసిందే ! "నీకవసరమైనంత వరకే తీసుకో" అన్న మార్క్స్ భావనకి, దీనికి తేడా ఏమిటి?

దీన్ని లోతుగా విచారించి (ఆలోచించి) ఆచరించి, ప్రచారం చేస్తే సమసమాజం కోసం రక్తపుటేరులు ప్రవహించవలసిన అవసరం లేదు. ఆ చిత్తశుద్ధి, నిజాయితీ, ఆదర్శం లేనినాడు దాడులు, ఎదురుదాడులు వర్గ సంఘర్షణలు తప్పవు మరి.

అభ్యుదయ భావన అనాదిగా, అనంతంగా పెనవేసుకొని వస్తూనే ఉంది. ఆచరించే వాళ్ల కోసం అప్పటినుండి ఇప్పటివరకు ఆశగా ఎదురుచూస్తూనే ఉంది. ఆ ఆశలు నెరవేర్చడానికి మహర్షులూ రారు, మార్క్సూ రాడు. నెరవేర్చినా, పరిమార్చినా మనమే.



# 25. ధర్మో రక్షతి రక్షితః

ధర్మాన్ని మనం అనుసరిస్తే ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుందని హిందువుల ప్రగాఢ విశ్వాసం. నిజానికి ధర్మాన్ని మనం అనుసరించడం వల్ల కాకుండా అసలు 'ధర్మం' అనే శబ్దం ఉచ్చరించడం చేతనే మన దేశం యావత్తు రక్షింపబడిన బహుచమత్కారమైన ఘట్టం ఒకటుంది.

1962లో చైనా మనదేశం మీద దురాక్రమణకు పాల్పడింది. యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఒక దశలో భారత సైన్యం కొంచెం బలహీనపడింది. అప్పుడు అమెరికా అధ్యక్షుడు కెనడీ అప్పటి మన రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి ఫోన్ చేసి "Do you need any help Mr. President?" అని అడిగాడట. వెంటనే స్వాభిమానం మూర్తీభవించిన మన రాధాకృష్ణ పండితుడు "No, we don't need any body's help. We have the weapon Dharma. We believe in Dharma. We follow Dharma. We will be saved by Dharma. It is enough" అని పౌరుషంగా జవాబిచ్చి ఫోన్ పెట్టేశాడట. కెనడీకి మిగిలిన మాటలన్నీ అర్థమయ్యాయి కానీ ఈ "DHARMA" అనేది ఏమిటో అర్థం కాలేదట. 'ధాం, ధాం' అని వినబడితే అదేదో బాంబు అనుకున్నాడట. అక్కడికీ అనుమానం తీరక బ్రిటన్ ప్రధాని చర్చిల్‌కి ఫోన్ చేసి ఈ "DHARMA" ఏమిటి అని అడిగాడట. ఆయన "I too don't know that. But they have that. Every Indian speaks Strongly about DHARMA" అన్నాడట. మొత్తం మీద ఇద్దరూ కలిసి అదేదో పెద్ద బాంబనీ, దీన్ని ఇండియాలో రహస్యంగా తయారు చేస్తున్నారనీ దాన్నే త్వరలో చైనా మీద ప్రయోగించ బోతున్నారని నిర్ధారణకు వచ్చారు. వెంటనే అప్పటి చైనా అధ్యక్షునికి ఫోన్ చేసి ఇండియాలో "DHARMA" అనే సరికొత్త బాంబు తయారవుతోందనీ అది ప్రయోగిస్తే చైనా పని అయిపోయినట్లే అని

బెదిరించారట. దాంతో ఆయన కూడా భయపడి ఎందుకైనా మంచిదని వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాడట.

ఆ రకంగా 'ధర్మం' అనే మాటే మన దేశాన్ని పెద్ద యుద్ధం నుండి కాపాడిందంటే నిజంగా మనం ధర్మాన్ని త్రికరణశుద్ధిగా ఆచరిస్తే అది మనల్ని రక్షించదూ? ఆలోచించండి.